

ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ



ప్రధాన్ రాజీనామాకై 30 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్త ప్రచారం

యువతకు ప్రధాన్ క్షమాపణ చెప్పాలి

చట్టాన్ని అందరికీ సమానంగా అందుబాటులో ఉంచడమే సమానత్వానికి తొలి అడుగు 07



సంపుటి 29, సంచిక: 7 | శుక్రవారం | 26-06-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




## తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ

# నీటి సమస్యల పరిష్కారానికి ముందడుగు

- మూడు తరాలనాటి సమస్యకు 33 గేట్ల పునరుద్ధరణతో తీరనున్న లక్షలాది మంది రైతుల సమస్యలు
- ఆర్‌డిఎస్‌లో తెలంగాణకు కేటాయించిన 15 టిఎంసిల నీరు వాడుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి
- కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- తుంగభద్ర ప్రాజెక్టు నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మూడు రాష్ట్రాల సిఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, డి.కె. శివకుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్

సాగునీరు, తాగు నీరు విషయంలో బళ్లారి, అనంతపూర్, కర్నూల్ జిల్లాల సమస్యలతో పాటు పాలమూరు ప్రాంతాలలో మూడు తరాలుగా ఉన్న సమస్యకు తుంగభద్ర ప్రాజెక్టుకు 33 గేట్ల పునరుద్ధరణ ద్వారా శాశ్వత పరిష్కారం లభించనుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల ఈ జిల్లాల్లోని లక్షలాది మంది రైతుల సమస్యలు తీరనున్నాయని, ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని సిఎం అన్నారు. గద్వాల్, అలంపూర్, పాలమూరు ప్రాంతాల్లో 'రాజోలిబండ డైవర్షన్ స్కీమ్'లో భాగంగా తెలంగాణాకు కేటాయించిన మేరకు 15 టిఎంసిల నీరు వాడుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. కర్ణాటకలోని హోస్పేట వద్ద ప్రతిష్ఠాత్మక తుంగభద్ర ప్రాజెక్టుకు నూతనంగా ఏర్పాటు చేసిన 33 క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం తరువాయి 8లో

# సర్ షురూ

- పలు నియోజకవర్గాలలో సకాలంలో అందని ఎన్యూమరేషన్ ఫారాలు
- హైదరాబాద్‌లో స్పష్టంగా కనిపించిన అధికారుల నిర్లక్ష్యం
- ఫారాలు పంపిణీలో జాప్యం
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇంటింటికీ తిరిగి ఫారాలు అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) ప్రక్రియ గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, జాబితాల్లోని లోపాలను సరిదిద్దడం, ఓటర్ల వివరాలను ధృవీకరించడం లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఇంటింటి సర్వే కార్యక్రమం వచ్చే నెల వరకు నిరంతరాయంగా కొనసాగనుంది. దాదాపు 24 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో ఈ స్థాయిలో సమగ్ర ఓటరు సర్వే జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో బిఎల్‌ఓలకు ఎన్యూమరేషన్ ఫారాలు అందకపోవడంతో వారు కార్యాలయాలకే పరిమితమయ్యారు. ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా సర్వే ఉత్సాహంగా ప్రారంభమవగా, హైదరాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లోనే జూబ్లీహిల్స్, ముషీరాబాద్, అంబర్‌పేట్, సనత్ నగర్ తదితర నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంతో పాటు పలు చోట్ల బిఎల్‌ఓలకు సమయానికి ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదు. రెండు రోజుల క్రితమే ఇతర సామాగ్రిని పంపిణీ చేసిన జిల్లా ఎన్నికల అధికారులు, ప్రధానమైన తరువాయి 8లో



# వెనిజులాలో ప్రకృతి విలయం

## 164 మంది మృతి

- రికార్డుస్థాయిలో 30 సార్లు ప్రకంపనలు
- 7.5 తీవ్రతతో రెండుసార్లు భారీ భూకంపం
- తేలని లెక్క : వేలాది మరణాలకు అవకాశం
- నేల కూలిన వందలాది భవంతులు, ఇళ్ళు
- అమెరికా- భారత్ సహ అనేక దేశాల సంఘీభావం
- 200 మిలియన్ డాలర్లతో ఐఎంఎఫ్ పునర్నిర్మాణ నిధి

**కారకస్:** ఉత్తర అమెరికా కరీబియన్ సముద్ర తీర ప్రాంత దేశం వెనిజులా రాజధాని కారకస్,పరిసర ప్రాంతాలను శక్తివంతమైన రెండు భూకంపాలు కుదిపేశాయి. గురువారం తెల్లవారకముందే రికార్డుస్థాయిలో 30 సార్లు వరుస ప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజల హా..హా కారాలతో వెనిజులా ప్రతిధ్వనించింది. ప్రాథమిక నివేదిక ప్రకారం 164 మంది మరణించగా, 1000 మంది గాయపడ్డారు. సజీవంగా ఉన్న వారిని వెలికి తీసేందుకు ముమ్మర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మృతులసంఖ్య బాగా పెరిగే అవకాశం ఉందని వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి సహాయ బృందాలు వెనిజులాకు వెళ్ళాయి. అదేవిధంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కూడా వెనిజులా పునర్నిర్మాణానికి వీలుగా 200 మిలియన్ డాలర్ల ప్రాథమిక మొత్తంతో ఒక నిధిని ఏర్పాటు చేసింది. కారకస్‌కు ఉత్తరాన 30 కి.మీ దూరంలో ఉన్న ప్రాంతంలో డజన్లకొద్దీ భవంతులు పేకమేడల్లా కూలిపోయాయి. అదేవిధంగా ఉత్తర జపాన్‌లో కూడా 6.9 తీవ్రతతో భూకంపం సంభవించింది. చిలీ దేశంలో కూడా అదే సమయంలో 5.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ప్రభావంవల్ల తరువాయి 8లో



# యూరియా బుకింగ్ యాప్ సక్సెస్

- రెండవ పంట కాలంలోనూ విశేష ఆదరణ
- ఈ సీజన్‌లో ఇప్పటికే 38.62 లక్షల బ్యాగులు బుకింగ్
- మంత్రి తుమ్మల వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ రంగ సంస్కరణలో భాగంగా ప్రభుత్వం తీసుకువచ్చిన యూరియా బుకింగ్ యాప్ అత్యంత కీలకమైందనివ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రెండో సీజన్‌లో కూడా ఈ విధానం విజయవంతంగా తరువాయి 12లో



# కూల్చివేతలు నిలిపివేసి ఇళ్ల పట్టాలివ్వండి

- ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి
- రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని కలిసిన సిపిఐ ప్రతినిధి బృందం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు వేసుకున్న గుడిసెలు, ఇళ్ల కూల్చివేతను నిలిపివేసి వారికి పట్టాలను మంజూరు చేసి ప్రభుత్వ సహాయం అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తరువాయి 8లో

# అక్రమార్కులకు అడ్డుకట్ట వేయండి

## ఇచ్చిన మాట ప్రకారం పిఆర్‌సి అమలుకు యత్నిస్తాం : సిఎం

- నిర్ణయాలు ప్రభుత్వం చేస్తున్నా.. అమలు చేస్తున్నది ప్రభుత్వ ఉద్యోగులే
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బీమా పథకం అమలుపై బ్యాంకర్లతో ఒప్పందం




ప్రజాపక్షం/హైదరాబాద్

రోజుకు ఒక గంట అదనంగా పని చేస్తూ, రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవాలని, ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఆదాయ పన్నులు చెల్లించనివారిని పట్టుకోవాలని, అక్రమార్కులకు అడ్డకట్ట వేయాలని పిలుపునిచ్చారు. నిర్ణయాలు తాము చేస్తున్నప్పటికీ,వాటిని అమలు చేస్తున్నదే ప్రభుత్వ ఉద్యోగులని, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేదే 'మీ' ద్వారా అని, తాము రెండవ సారి కూడా అధికారంలోనికి రావడానికి 'మీరే వారదులు, సారథులు' అని అన్నారు. మళ్లీ తామే అధికారంలోనికి వస్తామనే విశ్వాసం తనకు ఉన్నదని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ తరువాయి 8లో



# పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేదు

గత 12 ఏళ్లలో కొత్తగా ఏ నిర్ణయం తీసుకోలేదు : కేంద్రం

భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ఒక ప్రయాణపత్రం మాత్రమే..

**న్యూఢిల్లీ :** పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను ప్రూఫ్‌గా పరిగణించే ఏ నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. దేశ పౌరులు కాని వారికి పాస్‌పోర్ట్‌లు జారీ చేసే వెసులుబాటు తరువాయి 12లో

## క్యూర్ పరిధిలో

# పదంతస్తుల ఇందిరమ్మ ఇండ్లు

- మహిళల పేరిటే ఇందిరమ్మ ఇళ్ల రిజిస్ట్రేషన్
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేదల జీవనోపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డిఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణాలపై అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని పేదలకు, వారు నివసిస్తున్న తరువాయి 12లో

# భారతదేశంలో అమెజాన్ మరో 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి

## ప్రధాని మోదీతో సమావేశం అనంతరం అమెజాన్ సిఇఒ ఆండీ జస్సీ వెల్లడి



**న్యూఢిల్లీ :** భారతదేశంలో అమెజాన్ 2026–2030 కాలానికి అదనంగా 13 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడిని పెట్టాలని నిర్ణయించింది. అమెజాన్ దీంతో, తన ప్రణాళికాబద్ధమైన మూలధన నిబద్ధతను అంతకుముందున్న పెట్టుబడిని 48 బిలియన్ డాలర్ల మొత్తానికి చేర్చడం ద్వారా భారతదేశంలో పెట్టుబడులు అధికం చేసేందుకు తన ప్రాధాన్యత ఏమిటన్నది ప్రపంచానికి చాటిచెప్పింది.ఈ మేరకు గురువారం అమెజాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ఆండీ జస్సీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో సమావేశమైన అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ తాజా పెట్టుబడి తరువాయి 12లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

# కౌంటర్లు దాఖలు చేయకపోవడంపై హైకోర్టు అసంతృప్తి

విచారణ 22వ తేదీకి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్



పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేసిన కేసుల్లో కౌంటర్ల దాఖలు చేయకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇప్పటికీ కౌంటర్లు దాఖలు చేయని ఖైరతాబాద్, గద్వాల్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిల తీరును తప్పుపట్టింది. చాలా వాయిదాలు వేశామని, ఇప్పటికీ కౌంటర్లు దాఖలు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇదే చివరి అవకాశమని ప్రకటించింది. మరో రెండు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని, అనంతరం వారం రోజుల్లో పిటిషనర్లు రిప్లై కౌంటర్లు దాఖలు చేయాలని, మూడు వారాల్లో రాతపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశించింది. విచారణను జూలై 22కు వాయిదా వేసింది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య, కడియం శ్రీహరి, బండ్ల, ప్రకాశ్‌గౌడ గాంధి, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై స్పీకర్ అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. ఈ తీర్పును కొట్టేయాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, బీజేపీ శాసనసభాపక్ష నేత వేసిన పది పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం గురువారం విచారణను జులై 22కి వాయిదా వేసింది.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
26-06-2026
www.prajapaksham.in


# ఓటర్లూ.. పారాహుషార్ !

అనేక సందేహాలు, అనుమానాల నడుమ ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – సర్) ప్రక్రియ గురువారం నుంచి మొదలైంది. ఓటర్ల జాబితాను సమగ్ర ప్రక్షాళన జరిపే ఉద్దేశంతో సర్ ప్రక్రియను దేశవ్యాప్తంగా గతేడాది జూన్ – సెప్టెంబర్ మాసాలలో బీహార్ రాష్ట్రంలో మొదటి దశను నిర్వహించారు. ఆ తరువాత అక్టోబర్ మాసంలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ ప్రక్రియ పూర్తయింది. మొదటి రెండు దశల్లో 5 కోట్లకు పైగా ఓటర్లను తొలగించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపు ప్రక్రియ వివాదాస్పదమైంది.ప్రస్తుతం 13 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలు కలుపుకొని 59 కోట్ల మంది ఓటర్లకు సంబంధించిన 'సర్' ప్రక్రియను 'సర్ 3' కింద చేపట్టారు. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా మొదలైంది. 2006 మే 12వ తేదీని ఆధారంగా తీసుకొని, 2026 అక్టోబర్ 1 నాటికి సర్ పూర్తయిన తరువాత తాజా పరిచిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది.

తెలంగాణలో చివరి సారిగా 2002లో సర్ ప్రక్రియ జరిగింది. ప్రస్తుత సర్ ప్రక్రియకు అదే మూలాధారం కానుంది. ఇప్పుడు తెలంగాణలో 3.38 కోట్ల ఓటర్లు ఉన్నారు. అయితే, సర్ ప్రక్రియ చేపట్టకుముందు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది. అంటే సర్ – 2002 ఓటరు జాబితాలో ఉన్న ఓటర్ల పేర్లను, ప్రస్తుత ఓటర్ల పేర్లతో సరిపోల్చి చూడడం. తద్వారా 2.38 లక్షల ఓటర్ల వివరాలు సరిపోయాయి. 89.88 లక్షల మంది ఓటర్ల వివరాలు తేలాల్సి ఉంది. ఇక్కడే అసలు కథ ప్రారంభమైంది. పేర్లు సరిపోలకపోవడమో, తండ్రి పేరు, వయసు, అడ్రస్ తదితర పొరపాట్ల కారణంగానో, కొందరు మరణించిన కారణంగానో, ఇతరత్రా కారణాలతోనో వాటిని ఎనామలీస్ జాబితాలో పెట్టారు. అంటే అవి త్రిశంకు స్వర్గంలో ఉన్నట్లే. ఇంటి పేరు 2002 జాబితాలో పేరు వెనక ఉండి, తాజా జాబితాలో ముందు ఉండడంతో తన పేరునే ఎనామలీస్ జాబితాలో పెట్టారని స్వయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెబుతుండడం పరిస్థితి తీవ్రతను తెలియపరుస్తోంది. ఆయన తన గుర్తింపును నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు సర్ ప్రక్రియలో దేశంలోనే అత్యధికంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఓటర్ల జాబితా నుంచి 83.86 లక్షల మంది ఓటర్లు తగ్గిపోయారు. అందులో 60 లక్షల మంది వరకు మరణించిన వారు ఉండగా, 27 లక్షల మంది పేర్లు తొలగించబడ్డాయి. వారి గురించి సుప్రీం కోర్టులో నాటి బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాదించగా, అత్యున్నత న్యాయస్థానం ప్రత్యేక ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేసి పరిష్కరించాలని ఆదేశించినా, పెద్దగా ప్రయోజనకరంగా లేకపోయింది. ఇది ఎన్నికల ఫలితాలను తారుమారు చేసిందని ఓటమి పాలైన తృణమూల్ కాంగ్రెస్ ఆక్రోశం అరణ్యరోదనగా మారింది.

ప్రస్తుతం గురువారం నుంచి ప్రారంభమై, వచ్చే నెల 24 వరకు బిఎల్‌ఒలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. గడగడపకూ వెళ్ళి ప్రతి ఒక్క ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి, నింపిన తరువాత తీసుకోవడం వారి బాధ్యత.అంటే అందరూ కొత్తగా ఓటర్లుగా నమోదైతున్నట్లే లెక్క! సర్ ప్రక్రియ చేపట్టే ముందు ఓటర్ మ్యాపింగ్‌లో సరిపోలిన వారు కాక, సరిపోలని వారు తమ గుర్తింపును నిరూపించుకోవాల్సిన పరిస్థితి. అయితే, ఇందుకు కొన్ని గుర్తింపు పత్రాల జాబితాను ప్రకటించినప్పటికీ, అందులో 1987కు పూర్వపు పత్రాలు చూపమనడంతో ఇబ్బందులు తలెత్తనున్నాయి. పెద్ద కష్టమే కాదని అధికారులు చెబుతున్నప్పటికీ ఆ పత్రాలను తీసుకు రావడం అంత సులభమేమీ కాదు.

రాష్ట్ర మంతటా ఒక ఎత్తైతే, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జల్లాల్లో సర్ మరొక ఎత్తు. 2002 తరువాత జిల్లాల నుంచి ప్రజలు ఉపాధి, ఉజ్వల భవిష్యత్తును వెతుక్కుంటూ పెద్ద ఎత్తున రాజధాని హైదరాబాద్‌కు వలసలు వచ్చారు. ప్రస్తుతం ప్రామాణికంగా తీసుకుంటున్న సర్ – 2002 ఓటర్ల జాబితాల్లో ఆయా కుటుంబాల ఓట్లు సొంతూళ్ళలోనే ఎక్కువ. హైదరాబాద్‌కు వచ్చిన తరువాత కూడా స్థిరనివాసం ఉండక, అనేకచోట్ల అద్దెలు ఉండడం పరిపాటి. అలాంటి వారు తమ గుర్తింపును నిరూపించుకోవడం సవాలుగా మారనుంది. వీరి విషయం లో గుర్తింపు పత్రాల సమస్యను సులభతరం చేయాల్సిన అవసరం ఎన్నికల కమిషన్ పైనే ఉంది. ప్రక్రియ చేపట్టే కొలదీ ఎదురయ్యే సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపించాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ మహానగరంలో మరో చిక్కుముడి కూడా ఉంది. తెలంగాణ జిల్లాల నుంచి మాదిరిగానే 2002 నుంచి హైదరాబాద్‌కు తెలంగాణ జిల్లాల నుంచి వచ్చిన మాదిరిగానే పెద్ద సంఖ్యలో ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌కు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజలు వలసలు వచ్చారు. రాష్ట్ర విభజన తరువాత కూడా అక్కడా, ఇక్కడా రెండు చోట్ల ఓట్లు ఉన్న వారి సంఖ్య ఎక్కువే. ఈ విషయాన్ని ఇప్పటికే బిఆర్‌ఎస్ ప్రతినిధి వర్గం ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లింది. ప్రస్తుతం తెలంగాణ జిల్లాల్లో రెండు చోట్ల ఉన్న ఓట్లను డూప్లికేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా కమిషన్ గుర్తించింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల ఓట్లకు కూడా ఈ ప్రక్రియ చేపట్టాలని బిఆర్‌ఎస్ సూచించింది.

నిజానికి సర్ ప్రక్రియ చేపట్టడం మంచిదే. ఒకటి కంటే ఎక్కువ ఓట్లను, మరణించిన ఓటర్ల పేర్లను, ఇతర చోట్లకు వలస వెళ్ళినా కొనసాగుతున్న ఓట్లను తొలగించాల్సిందే. అయితే, దీనికి దేశభక్తి ముసుగు కప్పేందుకు ఇతర దేశం నుంచి అక్రమంగా నివసిస్తున్న వారిని ఏరివేసేందుకు సర్ చేపట్టినట్లు ప్రచారం విషయాన్ని భూతద్దంలో చూపెట్టడమే. అక్రమ నివాసితులను ఏరివేసేందుకు మరింత మెరుగైన చర్యలు తీసుకోవచ్చు. గతంలో సర్–2002 సందర్భంగా ఓట్ల తొలగింపులు, గుర్తింపు పత్రాలకు సంబంధించి ఇప్పటి మాదిరిగా గందరగోళం, ప్రజల్లో ఆందోళనకు దారితీసిన దాఖలాలు లేవు. మరి ఈసారే సర్ విషయంలో ఎందుకింత రగడ జరుగుతోందనే ప్రశ్న ఉద్భవిస్తోంది. ఇందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సర్‌ను ఎన్నికల్లో విజయం సాధించుకునేందుకు సర్‌ను ఒక అస్త్రంగా వాడుతున్నట్లు అనేక వ్యాసాలు వచ్చాయి. అందుకు ఉదాహరణగా పశ్చిమబెంగాల్, బిహార్ ఎన్నికల ఫలితాలపై అనేక మంది మేధావులు విశ్లేషణలు చేశారు. తాజాగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన బిజెపి ప్రభుత్వం ఓటర్ల జాబితాను సంక్షేమ పథకాలకు ముడిపెట్టింది.

సర్ ప్రక్రియ కింద ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన లబ్ధిదారులకు గత ప్రభుత్వం అమలు చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం పంపిణీ, మహిళలకు నగదు బదిలీ పథకాన్ని రద్దు చేస్తామని నోటిఫికేషన్‌లు ఇచ్చింది. అసలు భయం అదే. ఎందుకంటే సర్ ప్రక్రియ కింద ఎక్కువగా ఓట్లు కోల్పేయేది వలస కార్మికులు, నిరుపేద వర్గాలే. పొట్టకూటి కోసం ఎక్కడికి బడితే అక్కడ తిరిగే ఆ కుటుంబాలు 2002 జాబితాతో సరిపోల్చే ఆధారాలు సమకూర్చుకోవడం కష్టం. కాబట్టి సంక్షేమ పథకాలలో వేటు వేస్తే నష్టపోయేది వాళ్ళే. కాబట్టి తెలంగాణ ఓటర్లు నెల రోజు పాటు జరిగే సర్ ప్రక్రియ సందర్భంగా అత్యంత అప్రమత్తతతో వ్యవహరించి, ఓటు హక్కును కోల్పోకుండా చూసుకోవాల్సిన అవసరాన్ని ఇతర రాష్ట్రాల అనుభవాలు చెబుతున్నాయి. ●



## రాజకీయంగా దెబ్బతీసేందుకే...

**రాజకీయంగా నన్ను దెబ్బతీసేందుకే ప్రతిపక్ష పార్టీలు నకిలీ వీడియోలు సృష్టించి వైరల్ చేస్తున్నాయి. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి నేను కాదు. ఈ వీడియోపై ఎలాంటి దర్యాప్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధం. కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్, బిజెపి కలిసి నాపై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నాయి. అసెంబ్లీకి తాగి వచ్చానంటూ ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలు అవాస్తవం.**

- పంజాబ్ సిఎం భగవంతమాన్

# 'మరచిపోకుమా' మనిషివని!

తిరుపతిలో అరసం మహాసభలలో కలసి సురేంద్ర రొద్ద నాకు 'మరచిపోకుమా' కవితా సంపుటి అందించినపుడు ఇంత బరువైన కవిత్వం నేను ఆస్వాదించగలనా! అనే అనుమానం వచ్చింది. కానీ పేజీలు తిప్పుతుంటే నేనే ఆ సంపుటిలో మాయమై పోయాను.

కరోనా గురించిన వివరణలో 'మరణం మనకు శత్రువేమీ కాదు మనతో పుట్టి నడుస్తున్న తోబుట్టువే' అనే సాహసపు మాటతో ఆగిపోక మహారాష్ట్ర దళితుల జీవితాన్ని వడబోసి 'మూతికి ముంత వీపుకో మట్ట మనకేమీ కొత్తకాదు' అంటూ ఓ దృశ్యాన్ని సాక్షాత్కరించి ఆక్షేపణ చేయడం ఎంతో ధైర్యవంతుడైన కవి మాత్రమే చేయగలిగిన పని కదా అనిపించింది.

మూడు చిన్ని పదాల్లో 'కూలి కొచ్చిన తల్లికి సేపు కొచ్చిన చనుబాలు కారి రవిక తడిసి పోతుంటే' అనడం ఓ దృశ్యాన్ని ఆవిష్కరించడమే కదా! ఈ ఒక్క దృశ్యంతో సురేంద్ర దృశ్య కవితకు నా దృష్టిలో చిరునామా అయిపోయాడు.

'కోన అంటుకోక మునుపే కొండలోని మంట ఆర్పేయాలి' అంటూ మనుషుల్లో మనసు మాయమవడాన్ని ఆక్షేపిస్తూ కవితా దృశ్యం పండించడం చేతనైంది సురేంద్రకు.

ఒక వన్నె తగ్గిన ముదుసలి వేశ్యపై 'కడుపు చేసిన వాడు మొగుడు కాక, కడుపున పుట్టిన వాడు కొడుకు కాక, సుఖరోగాల పుట్టకు చావు రాక, సుఖనిద్రనిచ్చే ఆరడుగుల నేలకోసం వెతుకులాట' లాంటి దృశ్య కవిత 'మరిచి పోకుమా' కవితా సంపుటికి చిరునామా కాదా!

జీవితంలో నాన్న పాత్ర ఏంటో రెండు మాటల్లో చెప్పడం ఎలా అనే అనుమానమొస్తే 'నాన్న పాలలో వెన్న, కడవరకూ తన కష్టాలను నీకు కనబడక దాచేస్తూ' అని చెప్పేస్తే చాలు అనిపించింది.

శిశిరానికి స్వాగతం చెప్పాలనుకుంటే 'ఆనంద భాష్పాలతో నీ పాదాలను అభిషేకించాలనేమో మది వరదలై పారింది' చాలదా!

ఈ దేశం అనుభవిస్తున్న సామాజిక సంక్షోభం గురించి 'తనో వెర్రివాడో వేదాంతో తెలియదుగానీ తన సంచిలోని ధర్మాలను ఊరి చివర దించి కుప్పగా పోసి కన్నీరిడుతూ .. దింపుడు కల్లెం ఆశతో ... ఓ జవానులా ఎదురు చూస్తుంటాడు' అంటూ వాపోతాడు.

ఒక బాధ్యత గల టీచరుగా ఉద్యోగిస్తూ కూడా సాటి వర్గానికి తోడు నిలబడే అవకాశమివ్వని కఠోరమైన నిర్బంధాన్ని మనసులో తలుచుకుంటూ 'పీడితులు తోడురాక బిగిసిన పిడికిళ్లను చూపలేక జేబులో దాచుకుంటూ ఒంటరినై ప్రతిసారి నేనోడి పోతున్నా' అంటూ స్వగతాన్ని ఆవిష్కరిస్తాడు.

'మా బతుకులింతే మా బతుకు సారాన్ని ఎంత తాగినా సారా రాకాసి దాహం తీరనే తీరదు' అంటూ ప్రభుత్వాల సారా విధానాలను దుయ్య పడతాడు.

ప్రేమరాహిత్యంలో కొట్టుకు పోతున్న మనిషి 'కొండను పిండిచేసి అడవిని బుగ్గిచేసి భూమాత గుండెల్నీ కుళ్ళబొడిచేసి భూగోళాన్ని బంధించిన మనిషి' ప్రస్తుతం 'పంచ ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాపాడే శక్తి కోసం ఊపిరి బిగబట్టి ఎదురు' చూడటాన్ని నిరసిస్తాడు.

జీవిత ప్రయాణాన్ని నడుపుతున్నది ఉద్యోగించే పురుషుడా లేక నిశ్శబ్దం గా సెకను ముల్లులా ఇంట్లో అందరికీ అన్ని వేళలా కావలసినవన్నీ అందించే స్త్రీయా అనే అనుమానానికి 'గడియారంలోని సెకను ముల్లులా జీవిత వృత్తం చుట్టూ తిరుగుతున్న ఇల్లాలు' అంటూ జవాబిస్తూ మెప్పిస్తాడు.

సంపుటి చదవడం ముగించాక నా మనసుకు నచ్చిన కవిత్వంపై ఈ నాలుగు మాటలు రాయాలనిపించింది. వచన రచనకు అలవాటైన నన్ను ఈ సంపుటి మెప్పించింది.

కవితా సంపుటి కోసం 9491523570ను సంప్రదించవచ్చు.
వెల 200 రూపాయలు.

_ **వంకిరెడ్డి రెడ్డెప్ప రెడ్డి**
9440044922 4922

# ప్రాంతీయ పార్టీల చీలిక వెనక బిజెపి వ్యూహం

**అరుణ్ శ్రీవాస్తవ్**

ప్రాంతీయ పార్టీలను చీల్చాలనే భారతీయ జనతా పార్టీ (బిజెపి) వ్యూహం వెనుక నాలుగు అంశాలతో కూడిన రాజకీయ ఎత్తుగడ దాగుంది. అవి దీర్ఘకాలిక రాజ్యాంగ ఆధిపత్యాన్ని సురక్షితం చేసుకోవడం, ప్రతిపక్షం నిర్మించుకున్న ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయడం, క్రియాశీల ప్రతిపక్ష ముక్త భారతదేశాన్ని సృష్టించాలనే చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడం, చివరగా 2029లో తమ స్థానాన్ని పటిష్టం చేసుకుని లోక్‌సభ ఎన్నికలలో ఘనవిజయం సాధించడం. 'ఒకే దేశం, ఒకే పార్టీ' లక్ష్య సాధన ప్రక్రియ ను, హిందూ రాజ్య స్థాపనను సులభతరం చేయడానికి నరేంద్ర మోదీ – అమిత్ షా ద్వయం నడిపిస్తున్న మూడేళ్ల కార్యక్రమం ఇది.

ప్రాంతీయ పార్టీలను చీల్చడం అనేది ఒక సాధారణంగా చేపట్టిన చర్యలా కాకుండా, అత్యంత ప్రణాళికాయుతమైన, బహుళ అంచెల రాజకీయ వ్యూహం. వచ్చే పార్లమెంటరీ సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదానికి వీలు కల్పించే రాజ్యాంగ సవరణల కోసం మూడింట రెండొంతుల లోక్‌సభ మెజారిటీని సాధించడమే దీని తక్షణ లక్ష్యం. రాజ్యాంగ సవరణను సాధించుకోవడానికి, అధికారంలో ఉన్న ఎన్‌డిఎకు లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ (540 స్థానాలకు గాను 360 సీట్లు) అవసరం. గత సమావేశాల్లోనే మోదీ ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రయత్నించింది, కానీ దానికి అవసరమైన మెజారిటీ దక్కలేదు.

పార్టీలను చీల్చి, అధికారాన్ని బలోపేతం చేసుకోవాలనే ఈ చర్యతో 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేయడానికి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలకు విడదీయరాని సంబంధం ఉంది. సంఖ్యాబలాన్ని కూడగట్టుకోవడం ద్వారా భారతదేశ పార్లమెంటరీ సమీకరణాలను మౌలికంగా మార్చే విధంగా తిరిగి రాసిన ఎన్నికల పటాలను సులభంగా ఆమోదింపజేసుకోవాలనే తన ప్రణాళికకు ఒక రూపాన్ని ఇవ్వడానికి మోదీకి ఇది సహాయపడుతుంది.

ప్రాంతీయ నాయకులను లాగేసుకోవడం ద్వారా బిజెపికి తక్షణ క్షేత్రస్థాయి సంస్థాగత యంత్రాంగం లభిస్తుంది. కానీ షా చర్యలు ప్రతికూల ఫలితాలనిచ్చి, బిజెపి – మోదీ ప్రణాళికలకు ముప్పు కలిగించే అవకాశాన్ని కొట్టిపారేయలేము. డీలిమిటేషన్ కారణంగా బిజెపికి బలమైన పట్టు కలిగిన ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలు, ప్రాంతీయ కంచుకోటలలో సాపేక్షంగా ఎన్నికల తూకం తగ్గుతుంది. శాసన ప్రక్రియను నియంత్రించడం నియోజకవర్గాల హద్దుల పునర్ లిఖిస్తుంది. అది జాతీయంగా పార్టీ దీర్ఘకాలిక ఎన్నికల లబ్ది మరింత పెరిగేందుకు అనువుగా ఉంటుంది. కొన్ని నిర్దిష్ట రాష్ట్రాలలో పట్టు కోసం, స్థానికంగా బిజెపిని ఓడించటం కోసం ఇండియా కూటమి బలమైన ప్రాంతీయ పార్టీలపై ఎక్కువగా ఆధారపడుతుంది.

ఈ ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం ద్వారా, కాంగ్రెస్ పార్టీని బిజెపి ఏకాకిని చేస్తుంది. ఫలితంగా ఆ పార్టీ కీలకమైన సంకీర్ణ భాగస్వాములను, ఉమ్మడి ఓటు బ్యాంకులను, స్థానిక సంస్థాగత యంత్రాంగాన్ని కోల్పోతుంది. ఈ చీలికలు పార్టీ పేర్లు, ఎన్నికల చిహ్నాలపై తీవ్రమైన అంతర్గత కలహాలకు దారితీస్తాయి. దీంతో ప్రతిపక్ష నాయకులు జాతీయంగా ఐక్య ప్రచారం చేపట్టడం కన్నా, తమ మనుగడపైనే దృష్టి పెట్టేలా ఒత్తిడిలో పడతాయి.

గత సమావేశాల్లో ఓడిన 'నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, 2026' అత్యంత వివాదాస్పదమైనది. దీని ద్వారా లోక్‌సభ సీట్లను సుమారు 850కి పెంచి, ఏ రాష్ట్రం కూడా తన సంపూర్ణ సీట్ల సంఖ్య ను కోల్పోకుండా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ అదే సమయంలో, ఇది సమాఖ్య సంబంధిత సమస్యలను పరిష్కరించకుండా, నిర్వహించడానికి కష్టమైన చట్టసభను సృష్టిస్తుంది.

ఇది పూర్తిగా బిజెపి రాజకీయ ఎత్తుగడ. బిజెపి ఉత్తర భారతదేశంలో ఒక ప్రధాన శక్తి, ఇది రాష్ట్రాలలో కాంగ్రెస్‌ను దాదాపుగా బలహీనపరిచింది. సీట్ల సంఖ్య పెరగడంతో బిజెపి అధికార పార్టీగా అవతరిస్తుంది. దానికి దక్షిణాది రాష్ట్రాల మద్దతు కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. గత 50 ఏళ్లలో ఉత్తరాది జనాభా గణనీయంగా పెరిగినందున, కేవలం జనాభా ఆధారంగా సీట్ల ను కేటాయించడం ద్వారా (ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి) ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎంపిలసంఖ్య గణనీయంగా పెరుగుతుంది.

> శాసన ప్రక్రియను నియంత్రించడం నియోజకవర్గాల హద్దుల పునర్ లిఖిస్తుంది. అది జాతీయంగా పార్టీ దీర్ఘకాలిక ఎన్నికల లబ్ది మరింత పెరిగేందుకు అనువుగా ఉంటుంది. కొన్ని నిర్దిష్ట రాష్ట్రాలలో పట్టు కోసం, స్థానికంగా బిజెపిని ఓడించటం కోసం ఇండియా కూటమి బలమైన ప్రాంతీయ పార్టీలపై ఎక్కువగా ఆధారపడుతుంది. ఈ ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం ద్వారా, కాంగ్రెస్ పార్టీని బిజెపి ఏకాకిని చేస్తుంది. ఫలితంగా ఆ పార్టీ కీలకమైన సంకీర్ణ భాగ-స్వాములను, ఉమ్మడి ఓటు బ్యాంకులను, స్థానిక సంస్థాగత యంత్రాంగాన్ని కోల్పోతుంది. ఈ చీలికలు పార్టీ పేర్లు, ఎన్నికల చిహ్నా-లపై తీవ్రమైన అంతర్గత కలహాలకు దారితీస్తాయి. దీంతో ప్రతిపక్ష నాయకులు జాతీయంగా ఐక్య ప్రచారం చేపట్టడం కన్నా, తమ మనుగడపైనే దృష్టి పెట్టేలా ఒత్తిడిలో పడతాయి.

ఒకే దేశం అని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లు మాట్లాడుతున్నప్పటి కీ, కాషాయ కూటమి తీసుకున్న ఈ చర్య భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ ప్రాంతాలుగా విభజిస్తుం ది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో తీవ్రమైన, అన్యాయమైన మార్పులు తీసుకురావడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఇండియా కూటమి ఆరోపించింది. హద్దులను మార్చేందుకు ఏ జనాభా లెక్కలను ఉపయోగించాలనే దానిపై పార్లమెంటుకు ప్రత్యక్ష అధికారాన్ని ఇవ్వాలని ఈ బిల్లు కోరింది. తద్వారా సంస్థాగత తటస్థతను నిర్ధారించే రాజ్యాంగబద్ధమైన కాలపరిమితులను ఇది తొలగిస్తుంది. మహారాష్ట్రలో ఇప్పటికే అధికారంలో ఉన్న బిజెపికి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి), శివసేన (ఎస్‌ఎస్)లను చీల్చడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఈ పార్టీలకు చెందిన డజన్ మంది లోక్‌సభ సభ్యులు తమ మాతృ పార్టీలను వీడితే రాష్ట్రంలో పెద్దగా ప్రాముఖ్యత ఉండదు. కానీ జాతీయ స్థాయిలో వారి మద్దతు చాలా అవసరం. వారు బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు తమ దీర్ఘకాలిక లక్ష్యాన్ని సాధించడంలో దోహదపడతారు. శివసేనలో భారీ తిరుగుబాటుకు 2022 జూన్‌లో ఏక్‌నాథ్ షిండే నాయకత్వం వహించినప్పుడు మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) ఎదుర్కొన్న మానసిక ఆఘాతం నుండి ఇంకా కోలుకోలేదు.

బెంగాల్‌లో కూడా టిఎంసి శాసనసభ్యుల తిరుగుబాటుకు అంతగా ప్రాసంగికత లేదు. బిజెపి ఇప్పటికే అధికారంలో ఉంది. రాబోయే ఐదేళ్ల పాటు అదే పాలనను కొనసాగిస్తుంది. తిరుగుబాటుదారులు రాష్ట్ర ప్రభుత్వ రక్షణ పొందడానికి, అధికారాన్ని అనుభవించడానికి బిజెపిని వాడుకుంటుండగా, డీలిమిటేషన్ బిల్లు సులభంగా ఆమోదం పొందాలనే ఉద్దేశంతో బిజెపి ఎంపిలు టిఎంసిని వీడేలా ప్రోత్సహిస్తోంది. వీడిన వారి సంఖ్య తక్కువేమీ కాదు. సుమారు 20 మంది ఎంపిలు ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపిల ఫిరాయింపు వల్ల జాతీయ బిజెపికి లాభమే చేకూరుతుంది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రాంతీయ ఆధిపత్యాన్ని దెబ్బతీయడం, జాతీయ స్థాయిలో బిజెపి వ్యతిరేక ప్రతిపక్ష కూటములను బలహీనపరచడం, తూర్పు భారతదేశంలో తన పార్లమెంటరీ బలాన్ని, సంస్థాగత ఉనికిని పెంచుకోవడం వంటివి దీనికి కారణం. తన పార్లమెంటరీ సంఖ్యాబలాన్ని పెంచుకోవడం వల్ల, గతం లో విస్తృత ప్రతిపక్ష ఏకాభిప్రాయం అవసరమైన కీలక బిల్లులను, శాసన సంస్కరణల ను ఆమోదింపజేసుకోవడం బిజెపికి సులభతరం అవుతుం ది.

ఈ ఫిరాయింపులు, పార్లమెంటు తదుపరి సమావేశాల్లో తమ వివాదాస్పద డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవడానికే కాకుం డా, 'ఒకే దేశం, ఒకే ఎన్నిక', 'యూనిఫామ్ సివిల్ కోడ్' (యుసిసి) వంటి అత్యంత వివాదాస్పదమైన, నిలిచిపోయి న చట్టాలను సులభంగా ఆమోదింప జేసుకోవడానికి కూడా బిజెపికి సహాయపడతాయి. ప్రతిపక్షంలో ముఖ్యమైన ప్రాంతీయ స్తంభాలను ముక్కలు చేయటం ద్వారా బిజెపి, పార్లమెంటులో ఇండియాకూటమి సమష్టి వాదనా పటిమను, ఓటింగ్ శక్తిని సమర్థవంతంగా నీరుగార్చుతుంది. ప్రాంతీయ పార్టీలను మొత్తం గా ఎదుర్కొనేబదులు రొట్టెను ముక్కలుగా కోసినట్లు ప్రతిపక్షంలో 'లొంగిపోయేవారిని ముక్కలు చేయటం' అనే విధానాన్ని బిజెపి అనుసరిస్తోంది. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ప్రతిపక్ష పార్టీలపై ఒకేసారి దాడిచేసే బదులు వాటిని నెమ్మదిగా బలహీనపరచటం, విభజించటం, రూపుమాపటం ద్వారా – అనగా ఒక ముక్క తర్వాత మరో ముక్కను – అతి పలచగాఉన్న ముక్క ను ముందుగా వేరుచేయటం అనేది రాజకీయ వ్యూహం. 2014 లో మోదీ 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అనే నినాదాన్ని ప్రవేశపెట్టినప్పుడు, భారతదేశాన్ని వంశపారంపర్య రాజకీయాల నుండి విముక్తి చేయడంగా దానిని అభివర్ణించారు, కానీ ఆయన తాజా చర్య ప్రాంతీయ రాజకీయ అధికార కేంద్రాలను అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.



నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపుదల వంటి మోదీ ప్రతిపాదనలు ఆర్‌ఎస్‌ఎస్ దీర్ఘకాలిక సైద్ధాంతిక లక్ష్యాలలో పాతుకుపోయి ఉన్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పటినుంచో జనాభా ఆధారిత ప్రాతినిధ్యాన్ని, భారతదేశ రాజకీయ భౌగోళిక స్వరూపం పునర్నిర్ణాన్ని ప్రతిపాదిస్తున్నది.

నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కలతో అనుసంధానించడం, లోక్‌సభ స్థానాలను భారీగా (850 వరకు) పెంచాలన్న ప్రతిపాదనకు ఆర్‌ఎస్‌ఎస్ గట్టి మద్దతు పలుకుతోంది. దీని ద్వారా 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రం పునరుద్ధరించబడుతుందని మోదీ ప్రభుత్వం వాదించింది. అయితే, ప్రభుత్వ జనాభా నియంత్రణ విధానాలను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణ, తూర్పు రాష్ట్రాలకు ఇది అన్యాయం చేస్తుందని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

# పాస్‌పోర్ట్ ఉన్నా.. నీవు ఇండియన్ సిటిజన్ కాలేవు...

పాస్‌పోర్ట్ ఉన్నా నీవు ఇండియన్ సిటిజన్ కాలేవు.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ ఇది.. మరి భారత పౌరసత్వానికి అసలు ఏ పత్రాలు ఆధారం.. ఏకపక్షంగా నిరూపించుకోవడానికి ఏ పత్రమైనా ఉందా..

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MEA) ఇటీవల నిర్వహించిన 'పాస్‌పోర్ట్ సేవా దివస్' అధికారిక సదస్సులో ఓ సంచలన వివరణ ఇచ్చింది. దాని ప్రకారం.. పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి అంతర్జాతీయంగా ప్రయాణించడానికి, విదేశాలలో ఉన్నప్పుడు తాను ఫలానా దేశస్థుడినని అని తాత్కాలికంగా నిరూపించుకోవడానికి ఉపయోగపడే 'జాతీయత' (Nationality) రుజువు మాత్రమే. కానీ, అది దేశీయంగా పౌరసత్వానికి సంబంధించిన చట్టపరమైన హక్కులను నిశ్చయంగా నిర్ధారించే పత్రం కాదు.

దేశంలో ఒక వ్యక్తి యొక్క పౌరసత్వ అర్హతలపై లేదా హక్కులపై ఏదైనా సంక్లిష్టమైన చట్టపరమైన ప్రశ్నలు లేదా వివాదాలు తలెత్తినప్పుడు.. 1955 పౌరసత్వ చట్టం, దాని నిబంధనల ప్రకారమే అధికారులు నిర్ణయం తీసుకుంటారు తప్ప, కేవలం పాస్‌పోర్ట్ కలిగి ఉన్నంత మాత్రాన పౌరసత్వాన్ని నిశ్చయాత్మకంగా క్లెయిమ్ చేయలేరని తెలిపింది.

ఈ ప్రకటన వెలువడినప్పటి నుండి దేశవ్యాప్తంగా చట్టపరమైన, పరిపాలనాపరమైన వర్గాల్లో ఒక పెద్ద చర్చ నడుస్తోంది. అంతర్జాతీయ ప్రయాణాలకు అత్యున్నత ప్రామాణిక పత్రంగా, ప్రభుత్వ గుర్తింపుగా భావించే పాస్‌పోర్ట్ పౌరసత్వానికి నిశ్చయాత్మకమైన రుజువు కాదని మంత్రిత్వ శాఖ స్వయంగా స్పష్టం చేయడంతో, అసలు భారత పౌరసత్వాన్ని చట్టబద్ధంగా నిరూపించే పత్రాలేమిటనే దానిపై పౌరుల్లో ఆసక్తి పెరిగింది.

ప్రపంచంలోని కొన్ని దేశాలలో ప్రతి పౌరుడికి ప్రత్యేకంగా ఒకే ఒక 'సార్వత్రిక పౌరసత్వ ధృవీకరణ పత్రం' (Universal Citizenship Certificate) జారీచేసే సంప్రదాయం ఉంది. కానీ భారతదేశంలో అటువంటి ఏకైక పత్రం అంటూ ఏదీ లేదు. ఇక్కడి పౌరసత్వ నియమాలు పూర్తిగా 1955 పౌరసత్వ చట్టం ద్వారా నిర్దేశించబడతాయి. ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తి కేవలం పుట్టుక ద్వారానే కాకుండా..వంశపారంపర్యం, ప్రభుత్వ నమోదు (Registration), పౌరసత్వ స్వీకరణ (Naturalization) లేదా ఏదైనా కొత్త భూభాగం భారతదేశంలో విలీనం కావడం వంటి విభిన్న మార్గాల్లో పౌరసత్వాన్ని పొందవచ్చు. అందువల్ల, ఒక వ్యక్తి ఏ కాలంలో, ఏ పద్ధతి ద్వారా ఈ హోదాను పొందారనే దానిపై ఆధారపడి, పౌరసత్వాన్ని నిరూపించడానికి వివిధ రకాల పత్రాల కలయికను (Combination of Documents)సాక్ష్యంగా చూపించాల్సి ఉంటుంది.


**పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రధాన పత్రాలు**

చట్టపరమైన, ప్రభుత్వ రికార్డుల ప్రకారం, భారతదేశంలో పౌరసత్వాన్ని స్థాపించడానికి సాధారణంగా కొన్ని కీలకమైన పత్రాలపై అధికారులు ఆధారపడతారు.

జనన ధృవీకరణ పత్రం (Birth Certificate): సదరు అధికారిక సంస్థ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం పుట్టుకతో వచ్చే పౌరసత్వానికి అత్యంత ప్రాథమిక, ముఖ్యమైన ఆధారం.

*పౌరసత్వ ధృవీకరణ పత్రం:* విదేశీయులు నమోదు లేదా పౌరసత్వ స్వీకరణ ప్రక్రియ ద్వారా భారత పౌరసత్వాన్ని పొందినప్పుడు కేంద్ర ప్రభుత్వం వారికి ప్రత్యేకంగా ఈ పత్రాన్ని జారీ చేస్తుంది.

*ఎలక్టోరల్ ఫోటో ఐడెంటిటీ కార్డ్ (ఓటర్ ఐడి):* భారతదేశంలో ఓటు హక్కు, ఓటర్ ఐడి కేవలం భారత పౌరులకు మాత్రమే లభించే చట్టబద్ధమైన హక్కు. కాబ ట్టి ఇది పౌరసత్వ హోదాను బలంగా ప్రతిబింబిస్తుంది.



తల్లిదండ్రుల రికార్డులు: పౌరసత్వ చట్టాల నిబంధనల ప్రకారం అవసరమైన చోట తల్లిదండ్రుల పౌరసత్వ స్థితిని లేదా వారి జనన వివరాలను చూపించే పత్రాలు.

సహాయక సాక్ష్యాలు: పాత పాఠశాల ధృవపత్రాలు (Study/TC), నివాస ధృవీకరణ పత్రాలు (Nativity).

**'జనన వివరాలు' ఎందుకు అత్యంత కీలకం?**

భారతదేశంలో పుట్టుకతో వచ్చే పౌరసత్వ నియమాల్లో కాలక్రమేణా పౌరసత్వ చట్టాలకు అనేక సవరణలు వచ్చాయి.

జనవరి 26, 1950 నుండి జూలై1, 1987 మధ్య కాలంలో భారతదేశంలో జన్మించిన వారు వారి తల్లిదండ్రుల జాతీయత లేదా హోదాతో సంబంధం లేకుండా సాధారణంగా పుట్టుకతోనే భారత పౌరులవుతారు. జూలై1, 1987 తర్వాత కాలంలో జన్మించిన వారికి తల్లిదండ్రులలో కనీసం ఒకరైనా భారత పౌరుడై ఉండటం తప్పనిసరి. తదుపరి సవరణల ప్రకారం చూస్తే తల్లిదండ్రులు ఇద్దరూ భారత పౌరులై ఉండాలి లేదా వారిలో ఒకరు చట్టవిరుద్ధమైన వలసదారు (Illegal Migrant) కాకూడదనే నిబంధనలు వచ్చాయి. ఈ చట్టపరమైన మార్పుల వల్లే, అధికారులు కొన్నిసార్లు పౌరసత్వ ధృవీకరణ కోసం కేవలం వ్యక్తిగత జనన ధృవీకరణ పత్రమే కాకుండా, వారి తల్లిదండ్రుల పాత రికార్డులను కూడా సమర్పించాలని కోరుతుంటారు.

**ఆధార్, పాన్ కార్డ్‌ల చట్టపరమైన పరిమితి**

నిత్య జీవితంలో మనం అన్నింటికీ గుర్తింపుగా ఉపయోగించే ఆధార్ కార్డ్ (Aadhaar), పాన్ కార్డ్ (PAN) లు చట్ట ప్రకారం ఏమాత్రం పౌరసత్వానికి రుజువు కావు.

ఆధార్ అనేది కేవలం భారతదేశంలో నివసిస్తున్న ఒక వ్యక్తి యొక్క ప్రత్యేక గుర్తింపు, నివాసానికి (Identity & Residence) మాత్రమే ఆధా రం. ఆధార్ చట్టం ప్రకారం భారతదేశంలో నిర్ణీత కాలం (182 రోజులు లేదా అంతకంటే ఎక్కువ) పాటు నివసించే విదేశీయులు లేదా పౌరయేతరులు కూడా ఆధార్ పొందేందుకు అర్హులవుతారు. అలాగే పాన్ కార్డ్ అనేది కేవలం ఆదాయపు పన్ను చెల్లింపులు, ఆర్థిక లావాదేవీల ట్రాకింగ్ కోసం జారీ చేసే ఒక ఆర్థిక గుర్తింపు పత్రం మాత్రమే.

పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణ కేవలం చట్టపరమైన వ్యత్యాసాన్ని స్పష్టం చేయడానికి ఉద్దేశించినది. ఒక వ్యక్తి అంతర్జాతీయ ప్రయాణాలు చేయడానికి, విదేశాల్లో ఉన్నప్పుడు తాను ఫలానా దేశస్థుడినని తాత్కాలికంగా నిరూపించుకోవడానికి పాస్‌పోర్ట్ 'జాతీయతను' (Nationality) ధృవీకరిస్తుంది. అయితే, దేశీయంగా ఒక వ్యక్తి పౌరసత్వ అర్హతలపై లేదా హక్కులపై సంక్లిష్టమైన చట్టపరమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు మాత్రం పౌరసత్వ చట్టం1955 నిబంధనలే అంతిమంగా మారుతాయి తప్ప కేవలం పాస్‌పోర్ట్ కలిగి ఉన్నంత మాత్రాన పౌరసత్వాన్ని నిశ్చయాత్మకంగా క్లెయిమ్ చేయలేరు. భారతదేశంలో ప్రతి పరిస్థితిలోనూ పౌరసత్వాన్ని ఏకపక్షంగా నిరూపించే సార్వత్రికమైన ఒకే ఒక్క పత్రం లేదనే నిజాన్ని ఈ మొత్తం చట్టపరమైన విశ్లేషణ స్పష్టం చేస్తోంది.

## యూనియన్ ఎన్నికల కంటే ముందే ఆర్‌టిసి విలీనం చేయాలి

**ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. బోస్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి)ను యూనియన్ ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. బోస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్‌టిసి కార్మికులు కీలక పాత్ర పోషించినప్పటికీ వారికి తగిన గౌరవం లభించలేదని పేర్కొన్నారు. ఆర్‌టిసి కార్మికులు నాలుగు రోజుల నిరవధిక సమ్మెను విజయవంతంగా నిర్వహించిన సమయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, జెఎసితో పాటు కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామమని ఆయన అన్నారు. గతంలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు 52 రోజుల పాటు సమ్మె నిర్వహించారని గుర్తు చేశారు. అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరపకుండా ట్రేడ్ యూనియన్లను రద్దు చేసి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి, గతంలో రద్దు చేసిన యూనియన్లను పునరుద్ధరించడం కార్మికుల ఆత్మగౌరవానికి పెద్ద విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంతో జరిగిన ఒప్పందంలోని అంశాల్లో ఆర్‌టిసి విలీనం అత్యంత ముఖ్యమైనదిగా కార్మికులు భావిస్తున్నారని తెలిపారు. యూనియన్ ఎన్నికలు నిర్వహించే ముందు ఆర్‌టిసి విలీన ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం ఎన్నికలతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారని చెప్పారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని వి.ఎస్ బోస్ విజ్ఞప్తి చేశారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్ కర్నూల్ జిల్లా

No.G2/808/2026 తేది: 12.06.2026
Gaz. No.95/2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

ఫారం. 6
ప్రాథమిక ప్రకటన

నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండలములోని పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన **ఎ.2.28 1/2 గుంటలు** భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 73 (MJR-16/Minor/L-1) నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి సేకరించుటకు **ఎ.లు 2.28 1/2 గు.** భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 73 (MJR-16/Minor/L-1) నిమిత్తం భూసేకరణ ద్వారా గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: పోతిరెడ్డిపల్లి మండలం: వంగూర్ జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నం./ ఎస్.డి. నం. | పట్టా/ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట/తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ఎ.గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 68 | పట్టా | మెట్ట | 0.05 1/2 | చికొండ్ర పర్వతాలు తండ్రి మల్లయ్య (0.051/2) జిల్లెల్ల లింగమ్మ భర్త లక్ష్మయ్య చికొండ రాము తండ్రి జంగయ్య చికొండ ధర్మయ్య తండ్రి పర్వతాలు చికొండ్ర వెంకటమ్మ భర్త పర్వతాలు చికొండ్ర శ్రీశైలం తండ్రి పర్వతాలు లింగారెడ్డి శ్రీనివాసులు రెడ్డి తండ్రి వెంకటేశ్వర్ రెడ్డి చికొండ్ర బంగారమ్మ భర్త జంగయ్య ఇరిగేషన్ ప్రాజెక్టు | 65 | 74 | 67 | 69 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 65 | పట్టా | మెట్ట | 0.19 1/2 | కెంగురి చిన్నయ్య తండ్రి రాములు (0.081/2) ఎల్క నిరంజన్ తండ్రి సత్యనారాయణ (0.11) చికొండ్ర రేణుక భర్త రాములు చికొండ మల్లేష్ తండ్రి పర్వతాలు యల్క పర్వతాలు తండ్రి నరసింహ్మ జిల్లెల పర్శ రాములు తండ్రి లక్ష్మయ్య పస్పనూరు వెంకట్నారాయణ తండ్రి లక్ష్మి నర్సు | 60 | 68 | 66 | 69 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 60 | పట్టా | మెట్ట | 0.13 1/2 | యల్క కృష్ణయ్య తండ్రి నర్సింహ్మ (0.10) పానుగంటి దుర్గమ్మ భర్త నర్సింహ్మ (0.031/2) పుట్ట సత్యనారాయ్య తండ్రి రాములు ప్రభుత్వ భూమి | 61 | 65 | 59 | 64 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 61 | పట్టా | మెట్ట | 0.20 1/2 | రాములు తండ్రి పెంటయ్య (0.161/2) మారాల రవికుమార్ తండ్రి ఎల్లయ్య (0.04) సామ నిరంజన్ తండ్రి వెంకటయ్య తంగెళ్ళ స్వామి తండ్రి జంగయ్య తంగెల్ల వరుణ్ తండ్రి నాగరాజు టి చందు తండ్రి నాగరాజు గుద్దేటి దామోదర్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి మారాల బాలమ్మ భర్త ఎల్లయ్య | 57 | 60 | 59 | 62 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 62 | పట్టా | మెట్ట | 1.09 1/2 | గుద్దెటి తీర్పతిరెడ్డి తండ్రి రాంరెడ్డి (0.25) గుద్దటి కృష్ణారెడ్డి తండ్రి రామ్ రెడ్డి (0.12) గుద్దటి సునంద భర్త దామోదర్ రెడ్డి (0.121/2) గుద్దటి వెంట్రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి | 56 | 64 | 61 | 47 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తము : 2.28 1/2 | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వ నైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.


ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము - II మరియు అధ్యాయము -III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది..

సం/- స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టరు నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO NO. 360/LA/PP/Advt/Pub/2026-27


## అధికారం కోల్పోయిన అక్కసుతో కెటిఆర్, హరీశ్ అడ్డగోలు విమర్శలు

**టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావు శకం గతమని, అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి బావా బామ్మర్దులకు నచ్చడం లేదని ఆయన విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎస్‌టి రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్ళు పూరైన సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను గురువారం గాంధీభవన్‌లో మహేశ్ కుమార్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎస్‌టి రిజర్వేషన్లకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కృషే కారణమన్నారు. ఇందిరా గాంధీ ఎస్‌టి రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని, ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ పాత్రను ఆయన గుర్తు చేస్తూ రాహుల్ గాంధీ సూచనల మేరకు ప్రభుత్వం కులగణన చేపట్టామని తెలిపారు. రాష్ట్రానికి రూ.1.78 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని, అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుతో కలిపి రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌టి సెల్ జాతీయ అధ్యక్షులు వికాస్ బూనియా, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, బలరామ్ నాయక్, ఎంఎల్‌సి శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.351 కోట్లతో భద్రాద్రి ఆలయ పునరుద్ధరణ



- ఈ నెల 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ పునరుద్ధరణ
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధి, పునరుద్ధర ణ పనుల కోసం ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసిందని వెల్లడించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారన్నారు. ఈ క్రమంలోనే ఆలయ పునరుద్ధరణ పనులను ఈ నెల 27న అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపే పనులు పూర్తి చేయాలని, అందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి లక్ష్యంగా పెట్టుకున్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకుని సమాంతరంగా అన్ని పనులు చేపట్టాలన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

**బిసి హక్కుల సాధన సమితి డిమాండ్**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు ప్రైవేట్ విద్యాసంస్థలకు చెల్లించాల్సిన సుమారు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, దీనివల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులతో పాటు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యా రంగంలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండి చేశారు.కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న జనాభా గణనలో బిసిలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి కులగణన నిర్వహించి. జనాభా నిష్పత్తి ఆధారంగా విద్య, ఉద్యోగాలు, శాసనసభలు, పార్లమెంట్‌లో రిజర్వేషన్లు కల్పించేలా చట్టం తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో బిసిలు, ఇతర బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టిఅట్రాసిటీ చట్టం తరహాలో ప్రత్యేక బిసి రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆగస్టు నెలాఖరు వరకు అన్ని జిల్లాల్లో మహాసభలు, సెప్టెంబర్ రెండో వారంలో హైదరాబాద్‌లో నాలుగో రాష్ట్ర మహాసభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వారు తెలిపారు. బిసి హక్కుల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని బిసి సంఘాలతో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్మించాలని తీర్మానించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నేదునూరి రాజమౌళి, తాటి వెంకటేశ్వర్లు, పల్నాటి యాదయ్య, చింతకింది కుమారస్వామి, ఎ.బాపురాజు, జి.కృష్ణ, విజయుడు ఉపేంద్రాచారి, కె.ప్రమీల, జె.లక్ష్మి, గాజుల సుమలత, చెలుకల రాజు, కె.చంద్రశేఖరచారి తదితరులు పాల్గొన్నారు.



## శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత నివాసంలో మళ్లీ ఎసిబి సోదాలు


- రూ 5.5 కోట్ల కూడబెట్టిన అక్రమ ఆస్తుల గుర్తింపు
- లంచం కేసులో ఎసిబికి చిక్కి రిమాండ్‌లో ఉన్న సుచరిత

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** గత నెలలో రూ.30 లక్షలు లంచంగా తీసుకొంటూ ఎసిబికి చిక్కిన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత ఇంట్లో గురువారం ఆమె ఆస్తులను పసిగట్టేందుకు మరోసారి ఎసిబి ఆమె నివాసంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో కళ్లు చెదిరే రీతిలో అక్రమంగా కూడబెట్టిన ఆస్తులను గుర్తించింది. గత నెల 26న స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాల వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున రూ. 30 లక్షలు డిమాండ్ చేసి తన డ్రైవర్ ద్వారా తొలి విడతగా రూ.2 లక్షలు తీసుకొంటుండగా ఎసిబికి పట్టుబడటం, ఈ మేరకు కేసు నమోదు చేసి డ్రైవర్‌తో సహా ఆమెను రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. రెవెన్యూ అధికారిగా అమె అక్రమ ఆస్తులు భారీగా కూడబెట్టిందన్న సమాచారంతో ఎసిబి మరో సారి జరిపిన తనిఖీల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో 3 ఫ్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో 2 ఓపెన్ ప్లాట్లు, సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంట గ్రామంలో 2 ఎకరాల 17 గుంటల వ్యవసాయ భూమి, రూ. 12 లక్షల నగదు, రూ.1.20 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు, ఒక వ్యాక్సన్, ఒక హుందాయ్ క్రెటా కారులను గుర్తించారు. మార్కెట్ విలువ ప్రకారం ఎసిబి అధికారులు గుర్తించిన అక్రమ ఆస్తుల విలువ రూ.5.5 కోట్లు పైనే ఉంటుందని భావిస్తున్నారు.

## అంగన్ వాడీలను బిఎల్‌ఒ విధుల నుంచి మినహాయించాలి

**ఎఐటియుసి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్‌సర్) నమోదు కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లను బిఎల్‌ఒ (బూత్ లెవల్ ఆఫీసర్) విధులకు బలవంతంగా నియమించవద్దని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. ప్రేమపావని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంరక్షణ, పోషకాహార కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించాల్సి ఉండగా, అదనంగా ఎస్‌ఐఆర్ నమోదు కార్యక్రమంలో విధులు నిర్వహించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రత్యేకించి ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లే అన్ని బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో బిఎల్‌ఓ విధులు నిర్వహించడం వల్ల కేంద్రాల పనితీరుపై ప్రభావం పడుతోందని వివరించారు. ఆరోగ్య సమస్యలు, కుటుంబ పరిస్థితులు, ఇతర కారణాలతో ఎన్యుమరేషన్ కార్యక్రమంలో పాల్గొనలేని అంగన్‌వాడీ సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి మాత్రమే ఈ బాధ్యతలు అప్పగించాలని ఎన్నికల అధికారులను కోరారు. తమ వినతిపై ఎన్నికల అధికారులు సానుకూలంగా స్పందించినట్లు నందూరి కరుణ కుమారి వెల్లడించారు.



## ఏడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు

**పలు జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరిక**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముండగా, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ఉరుములు, మెరుపులు, గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశముందని హెచ్చరించారు. వాతావరణ కేంద్రం గురువారం మధ్యాహ్నం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం గురువారం నుంచి శుక్రవారం వరకు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని చెప్పారు. శని, ఆదివారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరిక జారీ చేశారు. సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళవారం రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. ఈనెల 30 నుంచి జూలై 2 వరకు రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందన్నారు. ఇక రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని అధికారులు తెలిపారు.

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం హర్షణీయం

**ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, డేలివేజ్ ఉద్యోగులకు కూడా ప్రమాద బీమా సౌకర్యం కల్పించడాన్ని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హర్షించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. గతంలో కాం ట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వంటి సౌ కర్యాలు కల్పించాలని ఎఐటియుసి తరపున అనేక పోరాటాలు, వినతులు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని, దీని ద్వారా ఉద్యోగుల భద్రతకు భరోసా కలుగుతుందని పేర్కొన్నా రు. అలాగే ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఎన్‌హెచ్‌ఎం వంటి పథకాల కింద ఫీల్డ్ లెవల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారని, వారికి కూడా ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఇహెచ్‌ఎస్)లో ఈ ఉద్యోగులను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా, ఆరోగ్య భద్రత లేకుండా పనిచేస్తున్న ఈ వర్గాలకు సమగ్ర భద్రతా పథకాలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తే వారు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తారని, ప్రభుత్వానికి ఇది మంచి ఫలితాలు ఇస్తుందని ఎం. నరసింహ పేర్కొన్నారు.

## ‘దోస్త్’ మూడవ దశలో 93,516 సీట్ల కేటాయింపు

**జులై 4 వరకు ‘సెల్ఫ్ రిపోర్టింగ్’ ఇవ్వకపోతే సీటు రద్దు..**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ‘దోస్త్ 2026’ మూడవ దశలో మొత్తం 93,516 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. మొదటి, రెండవ దశలో సీట్లు వచ్చి, మెరుగైన కళాశాలల కోసం ప్రయత్నించిన అభ్యర్థులతో కలిపి మూడవ దశలో వెబ్ ఆప్షన్లు నమోదు చేసిన మొత్తం 1,07,284 మంది అభ్యర్థులకు సీట్లను కేటాయించారు. విద్యార్థులందరూ ఈ నెల 27 నుంచి జూలై 4వ తేదీ వరకు తమకు కేటాయించిన సంబంధిత కళాశాలలకు స్వయంగా హాజరై, ఈ సిసిఒటిపిని సమర్పించి, తమ అడ్మిషన్‌ను ఖరారు చేసుకోవాలి. గడువులోపు కళాశాలలకు వెళ్లి రిపోర్ట్ చేయకపోతే కేటాయించిన సీటును పూర్తిగా కోల్పోతారని ‘దోస్త్’ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కళాశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన ‘డిగ్రీ ఆన్‌లైన్ సేవలు,తెలంగాణ’ (దోస్త్)2026 మూడవ దశ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు దోస్త్ మూడవ దశ సీట్లను టిజిసిహెచ్ఇ చైర్మన్,దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఎ.దేవసేన గురువారం వెల్లడించారు. మొదటి ప్రాధాన్యతలో 65,466 మంది విద్యార్థులు తాము ఎంచుకున్న మొదటి ఆప్షన్ ద్వారానే సీట్లు పొందగా, రెండవ, ఆ తర్వాతి ఆప్షన్ల ద్వారా 28,050 మందికి సీట్లు దక్కాయి. వెబ్ ఆప్షన్లను చాలా తక్కువగా ఇవ్వడం వల్ల 13,768 మంది విద్యార్థులకు ఈ విడతలో సీట్లు దక్కలేదు. అభ్యర్థులు తమకు కేటాయించిన సీట్ల వివరాలను వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రభుత్వ,విశ్వవిద్యాలయ (యూనివర్సిటీ) కళాశాలల్లో సీట్లు పొంది, ‘ఈపాస్ ’ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులు (కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల పరిశీలన అనంతరం) ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. మిగిలిన వారు అవసరాన్ని బట్టి నిర్దేశిత రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

### కామర్స్‌లో ఎక్కువ సీట్లు...

కామర్స్‌లో37,510, ఫిజికల్ సైన్సెస్‌లో 21,942, ఆర్ట్స్‌లో 17,245,లైఫ్ సైన్సెస్‌లో 16,751, ఇతరులు 68 మంది మొత్తంగా 93,516 సీట్లను కేటాయించారు. మూడవ దశలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 26వ తేదీ నుంచి (శుక్రవారం ) జూలై 02వ తేదీలోపు దోస్త్ లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి, తమ సీటును రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్ణీత గడువులోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకపోతే అభ్యర్థులకు కేటాయించిన సీటు రద్దవుతుంది. కాగా రెండవ దశలో సీటు వచ్చి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులకు, ఫేజ్3 వెబ్ ఆప్షన్ల ద్వారా కొత్తగా మరో సీటు కేటాయిస్తే, వారి పాత సీటు (ఫేజ్2 సీటు) ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. కొత్తగా వచ్చిన సీటును కూడా విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా తప్పనిసరిగా రిజర్వ్ చేసుకోవాలి.


దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ రాష్ట్రం
శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానము, సికింద్రాబాద్.

ఆర్.సి.నెం.1/SUMD/2026 షార్ట్ టెండర్ / సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం తేది: 25.06.2026

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవాలయమునకు **ఆషాడ జాతర - 2026** కు గాను దేవాలయములో కలకత్తా డెకరేషన్ క్యూలైన్ పనులు చేయడానికి దిగువ కనబరచిన లైసెన్స్ హక్కుల నిమిత్తము ఆసక్తి గల వారి నుండి తక్కువ మొత్తంలో ధరను కోట్ చేయుటకు షార్ట్ టెండర్ / సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన ద్వారా టెండర్లను కోరడమైనది. దేవస్థానము కార్యాలయము నందు గల టెండరు బాక్స్‌లో తేది: 02.07.2026 మ.12.00గం.ల వరకు టెండర్ ఫామ్స్ వేయవలెను. టెండర్లు **తేది: 02.07.2026,** మ.2.00గం.లకు ఓపెన్ చేయబడును.
**ఆషాడ జాతర (బోనాలు) టెండర్లు.**

| క్ర.సం. | టెండర్ వివరములు | ధరావత్తు రూ.లు |
|---|---|---|
| 1 | ఆషాడ జాతర కలకత్తా డెకరేషన్ క్యూలైన్, | రూ.50,000/- |
| 2 | 2024-25 సంవత్సరములో సేకరించిన చీరలు / బ్లౌజ్ పీసులు సమారు 20 వేల చీరలు ఎట్లఉన్నవి అట్లనే. | రూ.2,50,000/- |

షార్ట్ టెండర్ / సీల్డ్ టెండర్‌లో పాల్గొనుటకు ఆసక్తిగల వారు వివరముల కొరకు దేవాలయము నందు సంప్రదించగలరు. ఫోన్ నెం. 9491000695.
ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
సం/- అసిస్టెంట్ కమిషనర్ & ఎగ్జిక్యూటివ్ అధికారి
DIPR R.O. No. : 4971-PP/CL/ADVT/2026-27, Date: 25-06-2026



మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎం) కార్యాలయం, ఎంఎంసి.
‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్

NIT.No. 13/EE(M)/MMC/2026-27 తేది: 25.06.2026

| క్ర. సం. | NIT No. | పని పేరు | మొత్తం విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | | పేరు & ఆఫీస్ అడ్రస్, ఫోన్ నెం. |
|---|---|---|---|---|---|---|
| 1 | NIT No. 13/ EE(M)/ MMC/2026-27, Date: 25.06.2026 | ఎంఎంసి పరిధిలోని మల్కాజ్‌గిరి జోన్‌కు చెందిన అల్వాల్ మరియు మల్కాజ్‌గిరి సర్కిళ్లలో, జూలై-2026 నెలకు గాను LED వీధి దీపాల నిర్వహణ మరియు CCMS బాక్సుల ON/OFF ప్రక్రియ. | రూ. 7.48 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది | 27.06.2026 @ 10.00 AM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎం), హుడా కాంప్లెక్స్, తార్నాక. 8790174055 |
| | | | | బిడ్ దాఖలకు ఆఖరి తేది | 30.06.2026 @ 10.30 AM | |
| | | | | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | 30.06.2026 @ 11.00 AM | |
| | | | | ప్రైస్ బిడ్ ప్రారంభ తేది | 30.06.2026 @ 11.00 AM | |

మరిన్ని వివరాలకు http://tender.telangana.gov.inలో చూడవచ్చు మరియు కొటేషన్ల వివరాలు జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్ https://ghmc.gov.in నుండి పొందవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎం), ఎంఎంసి.
DIPR R.O. No. : 4923-PP/CL/ADVT/2026-27, Date: 25-06-2026

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/కేశంపేట :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధియే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్యతో కలిసి సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, గుండె రాణి, అబ్బి సుందరయ్య, శివయ్య, వార్డు సభ్యులు బాలకృష్ణ, రవి, సురేష్, నందు, రామకృష్ణ, శ్రీను, నేతలు కృష్ణారెడ్డి, శంకర్, సత్యం, యాదయ్య, రఘు, బాలరాజ్, నర్సింలు, రామచంద్రయ్యలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ సమగ్ర ఓటరు జాబితా సవమరణకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సయ్యద్ తోఫిక్, సదతుల షాకీర్ అలీ, ఎండి తాహేర్, కొత్తపల్లి భానుకృష్ణ, బిఎల్‌క్ష విజయ, భూషం, చిన్నకొండ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు 24 గంటలు వైద్యం అందించాలి

సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లి



**ప్రజాపక్షం/యాచారం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు 24 గంటల ఉండి గ్రామీణ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిచాలని సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని అయన సందర్శించారు. అసుపత్రిలో సౌకర్యాలు, సమస్యలను వైద్యులను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా అయన మాట్లాడుతూ అసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పగడాల యాదయ్య, సామేలు, రాంచందర్, జగదీష్, జగన్, ఎ.నర్సింహ్మ, జంగయ్య, చందునాయక్, వెంకటయ్య, జగన్, పెద్దయ్య, జగన్, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటరు సర్వేపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/కొత్తూరు:** సమగ్ర ఓటరు సర్వేపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కొత్తూరు డిప్యూటి తహాశీల్దార్ జంగయ్య సూచించారు. గురువారం కొత్తూరు మండలంలోని 29వ పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐఆర్ ప్రోగ్రాంను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి తహశీల్దార్ జంగయ్య మాట్లాడుతూ సమగ్ర ఓటరు జాబితా సవమరణకు ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్ళి ముద్రించిన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని, ఇంటి వద్ద ఎవరు లేని పక్షంతో రెండు, మూడుసార్లు సందర్శించేందుకు బిఎల్‌ఓలు కృషి చేయాలని సూచించారు.

## హోటల్ యజమానులకు జైలుశిక్ష

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా అర్ధరాత్రి వరకు నడుపుతున్న గంగా జమూనా హోటల్ ఆటోనగర్, మన స్వాగత్ హోటల్ తుర్కయంజాల్ హోటల్స్ యజమానులు మంటూ కుమార్ యాదవ్, రమేష్ లను హతయ్ గనర్ కోర్టు ఐదు రోజుల పాటు శిక్ష విధించడం జరిగింది. కమ్యూనిటీ సర్వీస్ కింద సోషల్ సర్వీసెస్‌ను, ట్రాఫిక్ రెగ్యులేషన్, వీధుల శుభ్రత మొదలైన సర్వీసెస్ చేయబడుతుతుందన్నారు. గతంలో ఈ విధంగా కేసులు ఉన్నందనన్నారు. ఈ సందర్భంగా వనస్థలి పురం సిఐ రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంగించిన వారిపై కమ్యూనిటీ సర్వీసెస్‌లో పాటు, జైలు శిక్ష పడే విధంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



**ప్రజాపక్షం/కొత్తూరు:** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తూరు సిఐ నర్సయ్య సూచించారు. గురువారం కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాతిమాపూర్ స్కూల్, ఐటిఐ కళాశాలలో డ్రగ్స్‌పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నర్సయ్య మాట్లాడుతూ యువతను పట్టి పడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని అంతమొందించి డ్రగ్స్‌రహిత సమాజాన్ని స్థాపించడమే ద్యేయంగా ఫ్యూచర్ సిటి పరిధిలో భారీ అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఎవరైన డ్రగ్స్, మాదకద్రవ్యాలు విక్రయిస్తే 14446 కు సమాచారం అంధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు



ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లి, కానాజీగూడ, ద్వారకానగర్ కాలనీ, ఆల్వాల్, మచ్చ బొల్లారం ప్రాంతాల్లో గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలో నాలాలు, వరదనీటి డ్రెయిన్‌లలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ద్వారకానగర్ కాలనీలో ఖాళీ స్థలాల్లో అక్రమంగా చెత్త వేసే వారిపై జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. ఆల్వాల్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను, మచ్చ బొల్లారంలో సహజ ప్రవాహానికి అడ్డంగా ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మెట్ టీమ్‌లు, హైడ్రా డిఆర్ఎఫ్ బృందాలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు.

## ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరించాలి

సిఎంసి కమిషనర్ డాక్టర్ సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌తో కలిసి నార్సింగి సర్కిల్ పరిధిలోని నేక్నాంపూర్ వార్డులో విస్తృతంగా పర్యటించారు. వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక నివాసితులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీధి దీపాల ఏర్పాటు, ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు, యుజిడి సామర్థ్యం పెంపు, స్పీడ్ బ్రేకర్లు, పార్కుల్లో సిసి కెమెరాల ఏర్పాటు, వైన్ షాపుల తరలింపు, పాషా కాలనీలో నీటి నిల్వ సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషనర్, రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాధాన్యత క్రమంలో ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.



## రజకుల కుల గణనపై పునర్ సర్వే జరిపించాలి

తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రజకుల కుల గణనపై పునర్ సర్వే జరపించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు తెలంగాణ బిసి కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఇలందుల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, నాయకులు డి నిరంజన్, నరేందర్, బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడతూ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన జన గణనలో రజకుల జనాభా లెక్కల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, వాస్తవ జనాభా కంటే తక్కువగా నమోదు జరిగిందని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో దాదాపు 70 లక్షలకుపైగా రజకులు ఉండగా, గణనలో మాత్రం సుమారు 9 లక్షలుగా మాత్రమే చూపించారని ఆందోళన వ్యక్తం చేశారు. రజకులు సంప్రదాయంగా కులవృత్తిని జీవనాధారంగా చేసుకుని సమాజానికి సేవలందిస్తున్నారని, అయినప్పటికీ వారికి సరైన స్థాయిలో ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. బిసివర్గీకరణలో కూడా రజకులకు అన్యాయం జరుగుతోందని, ఇతర కులాలను బిసిఏ గ్రూపులో చేర్చడం వల్ల రజకులకు నష్టం జరుగుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రజకుల కోసం ప్రత్యేకంగా కుల గణన రీసర్వే నిర్వహించాలని, వాస్తవ జనాభా ఆధారంగా ప్రభుత్వ పథకాలు, రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రజకుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సర్ ప్రక్రియను రాజకీయ కోణంలో చూడొద్దు

ఓటర్ల జాబితా సవరణపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను రాజకీయ కోణంలో చూడొద్దని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. ఇది కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపడుతున్న రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన కార్యక్రమమని తెలిపారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత, విశ్వసనీయత కోసమే ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని, దీనిని కేవలం ఓటర్ల జాబితా సంస్కరణగా చూడాలే తప్ప రాజకీయ కోణంలో చూడవద్దన్నారు. కొన్ని పార్టీలు, నేతలు దీనిపై అనవసరంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, నకిలీ, డూప్లికేట్ ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి అవసరమన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మార్గదర్శకత్వంలో పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొని, ఒక్క నకిలీ ఓటు కూడా లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

## ప్రతి చిన్నారికి విధిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలి

షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** పల్స్ పోలియో చుక్కలను ప్రతి చిన్నారికి విధిగా వేయించేందుకు కృషి చేయాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఫరూక్‌నగర్ ఎంపిడిఒ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ 0నుండి 5ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలను వేయించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. షాద్‌నగర్ డివిజన్‌లో 36వేల మంది చిన్నారులు ఉన్నారని, వారికి పోలియో చుక్కలు అందించేందుకు ప్రత్యేక బూత్‌లు, ట్రాన్సిట్ పాయింట్లు, మొబైల్ బృందాలు, పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీకాంత్, ఎంఇఒ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సిబ్బంది, చించోడు వైద్యాధికారి డాక్టర్ శ్రావంతి, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యంలో ఓటరు వ్యవస్థ ప్రాముఖ్యమైంది



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజాస్వామ్యంలో ఓటరు వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యమైందని, ప్రత్యేక ఓటరు జాబితాపై దృష్టి కేంద్రీకరించేందుకు నేతలు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆరు మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు, ముఖ్య నాయకులతో ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా కాంగ్రెస్ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్క ఓటరును వదలిపెట్టకుండా జాబితాను తయారు చేయడంతో నేతలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కొత్తూరు మండలానికి వీరేశం, చెంది తిరుపతిరెడ్డి, చిట్టెం దామోదర్ రెడ్డి, నందిగామ మండలానికి శ్రీనునాయక్, కృష్ణారెడ్డి, కేశంపేట మండలానికి ఇబ్రహీం, శ్రీకాంత్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్ మండలానికి జితేందర్‌రెడ్డి, కరుణాకర్, జంగ నర్సింహులు, కొందుర్గు మండలానికి బాబర్‌ఖాన్, చలివేంద్రంపల్లి రాజు, జిల్లేడు చౌదరిగూడ మండలానికి మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, షాద్‌నగర్ మున్సిపాలిటికి సిద్దార్థ, శివారెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివ, భాస్కర్, అన్వర్, అంబటి ప్రభాకర్, జంగారి రవిచ కొత్తూరు మున్సిపాలిటికి వెంకటరాంరెడ్డి, కావలి కృష్ణ, శివశంకర్ గౌడ్, తుపాకుల శేఖర్‌లను బాధ్యులుగా నియమించారు.

### రూ.3.12కోట్లతో నిర్మించనున్న షెడ్లకు శంకుస్థాపన

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతోనే షెడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.3.12కోట్ల నిధులతో మూడు షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, మార్కెట్ కార్యదర్శి వెంకటేర్‌రెడ్డి, డిఇఇ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్పు, వైస్ చైర్మన్ అందె మోహన్ పాల్గొన్నారు.



## మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

చల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మహిళల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వచ్చిన చీరలను మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్‌ఎంసి మీర్పేట్ పరిధిలో జిల్లెల్లగూడలోని కమలనగర్‌లో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి చల్లా నర్సింహారెడ్డి ముఖ్య అతిధి గా జిహెచ్‌ఎంసి బడంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, గంగమ్మలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ మహిళా చీరలను అందిస్తామన్నారు. స్థానికంగా ఆధార్ కార్డు ఉన్న ప్రతి మహిళకు చీరలు అందుతాయని, ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్ పిటిసి అనితరెడ్డి, సిద్ధార్థ దశరథ్, పల్లె పాండు, వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ చల్లా కవిత బాల్ రెడ్డి, గజ్జల రామచందర్, సురేందర్, సంతోష్ కుమార్, బాపోజు సిద్దేశ్వర చారి, వెంకటేష్, పైల శేఖర్‌రెడ్డి, పరశురాం, శ్రీనివాస్, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** పట్నం ఆర్‌టిసి డిపో కార్యాలయంలో డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుజాత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుండి 1గంటల వరకు నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ డిఎం కార్యాక్రమం నిర్వహిస్తున్నామని, 8125889405 నెంబర్‌కు ఫోన్ చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చి డిపో అభివృద్ధికి తోడ్పాడాలని డిపో మేనేజర్ సుజాత ప్రజలను కోరారు.

## విత్తన మేళా సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శిల్పాప్రేమకర్ సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలం ముకునూర్ గ్రామం పరిధిలో రైతు వేధిక భవనంలో విత్తన మేళాకు సర్పంచ్ శిల్పాప్రేమకర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ సాగులో నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి పంటలు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ సృజన పాల్గొన్నారు.

# యువత లక్ష్య సాధనపై దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. గురువారం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్"(ఎన్ఎంబిఎ)కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా.కిరణ్మయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజంతోపాటు దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న "నషా ముక్త్ భారత్ అభియాన్"ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. "వికసిత్ భారత్‌కు నషా ముక్త్ భారత్ పునాది"అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా చైతన్యపరిచి ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, ముఖ్యంగా పిల్లలపై జరిగే అఘాయిత్యాలను అత్యంత తీవ్రంగా పరిగణించాలన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద సంఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయలన్నారు. మాదకద్రవ్యాలు (డ్రగ్స్), మద్యం (ఆల్కహాల్) అనేక నేరాలు, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, "నాకెందుకులే" అనే నిర్లక్ష్య భావనకు బదులుగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమాజం సురక్షితంగా ఉంటేనే వ్యక్తులు, కుటుంబాలు సంతోషంగా ఉంటాయని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత్‌రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత, కలెక్టరేట్ ఎఒ సునీల్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఆర్‌యుబి నిర్మాణ పనుల సమస్యలపై విన్నపం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో ఆర్‌యుబి (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణ ప్రతిపాదనతో ఇళ్లు కోల్పోతున్న తమను ఆదుకోవటంతో పాటు దీనివల్ల ఈ ప్రాంతంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలంటూ బాధిత నివాసితులు మల్కాజిగిరి ఎంపి ఈటలను గురువారం కల్సి వినతిపత్రం సమర్పించారు. మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తో కల్సి కాలనీవాసులు మహేశ్వరి, వీరేశం, సుధాకర్, శ్రీనివాసగుప్తా, శ్రీధర్ బాబు, రాణిలు వినతిపత్రం ఇచ్చిన తర్వాత మాట్లాడుతూ ఆర్‌యుబి నిర్మాణ పనుల్లో భాగంగా కూల్చివేయాల్సిన ఇళ్లకు ఇప్పటికే మార్కింగ్ వేసారన్నారు. దీనివల్ల ఇప్పటికే ఇరుకుగా ఉన్న తమ కాలనీ మరింత ఇరుకుగా మారి వాహనాల రాకపోకలే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో కనీసం అంబులెన్స్ వాహనం సైతం రాలేని పరిస్థితులు ఏర్పడుతాయన్నారు.



## పెండింగ్ సమస్యల పరిష్కారానికి వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివిజన్ పరిధిలోని ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మాజీ మంత్రి, మేడ్చెల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలోని నాగారం, రాంపల్లి కాలనీలకు సంబంధించిన పెండింగ్‌లో పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందాడి శ్రీకాంత్‌రెడ్డి, కాలనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ జాబితా పరిశీలన

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట, మల్లంపేటలో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని ఓటర్ జాబితాను జోనల్ మిషనర్ పింకేష్ కుమార్ పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా, జోనల్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందించే ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఎన్నికల విధుల్లో ఉన్న బి.ఎల్.ఓ లకు పారదర్శకంగా, తప్పులు లేకుండా ఫారమ్‌లను సేకరించాలని తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణి కరణ్, ఏ.ఎం.సి లక్ష్మయ్య, సూపర్వైజర్లు, బి.ఎల్.ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి : కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** అర్హులైన ప్రతిఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని గాజులరామారం సర్కిల్ కైసర్ నగర్‌లో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని (ఎస్ఐఆర్) సర్కిల్ అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, సర్కిల్ ఉపకమిషనర్ వెంకట రాములు బిఎల్‌ఒలు చేస్తున్న ఓటరు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బిఎల్‌ఒలు ఇంటింటికి తిరుగుతూ సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కును కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని అన్నారు. ప్రజలు బిఎల్‌ఒల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌ని సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు నిండిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమని, ప్రతిపౌరుడు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, బిఎల్‌ఒలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రారంభం

### జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ క్షేత్రస్థాయి పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) షెడ్యూల్‌లో భాగంగా గురువారం నుంచి ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సమన్వయంతో, బూత్ లెవల్ అధికారులు ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ స్వయంగా రంగంలోకి దిగారు. జోనల్ కమిషనర్ బి. సంతోష్‌తో కలిసి కర్ణన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఫిల్మ్ నగర్, జ్ఞాని జైల్ సింగ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇండ్ల వద్ద జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి, ఇఆర్ఒ, ఎఇఆర్ఒలకు కమిషనర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అర్హుడికీ ఫారాలు అందేలా చూడాలని, ఎక్కడా అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మొత్తం కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పారదర్శకత, సజావుగా అమలుపై దృష్టి సారించగా, సంబంధిత జోన్‌లలో ఫారాల పంపిణీని జోనల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి సామూహికంగా కృషి చేయవలసిన అవసరముందని తెలంగాణ జైళ్ల శాఖ డిఐజి (హైదరాబాద్ రేంజ్) డాక్టర్ డి. శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖకు చెందిన నివృత్తి డి అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్వహించిన మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆరోగ్యకరమైన మాదక ద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహిస్తూ, అవసరమైన సమయంలో సహాయం కోరమని వ్యక్తులను ప్రోత్సహించే సందేశాల పోస్టర్లను ప్రదర్శించి ఇందులో పాల్గొన్న వారిచే మాదకద్రవ్య రహిత ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల వ్యసనాన్ని అధిగమించి ఆరోగ్యకరమైన, ఫలవంతమైన జీవితాలను గడపడానికి వ్యస న విముక్తి పునరావాసం, సామాజిక భాగస్వామ్యం గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారం, పిఎసి పర్యవేక్షణాధికారులు ప్రమోద్, భరత్, డిప్యూటీ పర్యవేక్షణాధికారులు వెంకటేశం, జైలర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




**దౌల్తాబాద్ :** కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల కేంద్రంలో డ్రగ్స్‌పై అవగాహన నిర్వహించారు. 2026 సందర్భంగా జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా ఆదేశాల మేరకు దౌల్తాబాద్ ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువకులు, విద్యార్థులు సర్వం కోల్పోతున్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి అని సూచించారు. అనంతరం విద్యార్థులతో మానవ హారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వేణుకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నా రు.



## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాలలదే

### ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాలలపైనే ఉందని తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ ప్రగతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి విచ్చేసి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఎంత ఉంటుందో అంతే బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని అన్నారు. విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అత్యున్నతస్థాయి విద్యను అందించాలని సూచించారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన ఐఐటి, జెఇఇ, నీట్ ఒలంపియాడ్, ఇంటిగ్రేటెడ్ కోర్సులతో పాటు ఎఐ, రోబోటిక్స్, సైన్స్ ల్యాబ్ అండ్ గేమ్స్‌లతో కూడిన విద్యను పాఠశాల యాజమాన్యం అందించాలని అన్నారు. విద్యార్థులు సాధించే ర్యాంకులతోనే పాఠశాలలకు పేరు వస్తుందని తెలిపారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అందిపుచ్చుకుని అటు పాఠశాలకు, ఇటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి నేత డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్‌లు రవిరాజు, లక్ష్మీ నారాయణ, కమలేష్ ముఖర్జీ, మేఘారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ విజయ భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ, ఇందిరమ్మ గృహప్రవేశాలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి/జవహర్‌నగర్:** మల్కాజిగిరి నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని పివిఎన్ కాలనీ కమ్యూనిటీ హాలులో స్థానిక మాజీ కార్పొరేటర్ వై.ప్రేంకుమార్ ఆధ్వర్యంలో జరిగిన చీరల పంపిణీ కార్యక్రమంలో అఖిల, పద్మ, భాగ్యలక్ష్మి, పుష్పలత, కల్పన, తదితరులు పాల్గొన్నారు. మల్కాజిగిరిలో జరిగిన చీరల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు జిడి సంపత్, కుమార్ గౌడ్, కొండా గౌడ్, మహేందర్‌గౌడ్, జిఎన్‌వి సతీష్, నగేష్ గౌడ్, రవీందర్‌రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. జవహర్‌నగర్‌లోని పాతగబ్బిలాలపేట కాలనీలో మాజీ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మచీరల పంపిణీతో పాటు ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్‌కు చెందిన మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, శంకర్‌గౌడ్, శంకర్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఓటరు సవరణపై ప్రజలకు అవగాహన

### ఆర్టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఓటరు సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్, అంతాయిపల్లి గ్రామాల్లో సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు ధృవీకరణకోసం బిఎల్‌ఒలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పని సరిగా పూర్తిచేసి తిరిగి సమర్పించాలని కోరారు. అలా చేయకపోతే ఓటరు జాబితాలో పేరు తొలిగిపోయే అవకాశం ఉండవచ్చని ప్రజలకు వివరించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బానాల మధుసూధన్‌రెడ్డి, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.



**ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట డివిజన్ ఉప్పర్‌పల్లిలో ఇందిరా మహిళ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సామాజిక భద్రత కల్పించడం లక్ష్యంగా పలు పథకాలను ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గురుజాల బాబు, కత్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలు లబ్దిదారునికి అందే బాధ్యత అధికారులదే


### వికారాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి నవీన్‌మిట్టల్

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళి 99రోజుల కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి , జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ది ,సంక్షేమ పథకాలు ,క్షేత్రస్థాయిలో ప్రతి లబ్దిదారునికి అందుతున్నది లేనిది తెలుసుకోవడంతోపాటు, వివి ధ పథకాల అమలులో ప్రజలకు అవగాహన కల్పించసమస్యలను తెలుసుకునేందుక 99రోజుల పాటు ,నిర్వహించిన ప్రభుత్వ పథకాల పలితాలు లబ్దిదారుల కందాలంటే పథకాలను పకడ్బందిగా అమలు చేయాలని సూచించారు. పథకాల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇందు లో ముఖ్యంగా విద్యా, వైద్యం, ఆరోగ్యం సంక్షేమ కార్యక్రమాల అమలులో జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లువెంకటచారి, ఉమ శంకరప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, జెడ్పిసిఓ సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## ఆరోగ్యం, సంక్షేమం కోసం నిరంతరం కృషి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ప్రజా ఆరోగ్యం, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అని బిఆర్ఎస్ నాయకులు కొనియాడారు. చింతల్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎల్వోసి పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 126 డివిజన్ జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పకు చెందిన కె.సుజా తమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1,10,000 ఎల్వోసి పత్రాలను బిఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ఆలోచిస్తు సేవలు అందిస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేక మంది పేదలకు వైద్య సహాయం అందేలా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, బాబు గౌడ్, నర్సింహారెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 25ఏళ్ల దుకాణాలపై మోసపు కన్ను

### బాధితులకు అండగా కాంగ్రెస్ పార్టీ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నారపల్లి ప్రధాన రహదారిపై గత 25 ఏళ్లగా కొనసాగుతున్న నాలుగు దుకాణాలకు నకిలీ పత్రాలతో ఖాళీ స్థలంగా చూపించి స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరిగిందని ఘట్‌కేసర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేష్ ఆరోపించారు. ఎన్ సుందరాచారి 2001లో నాలుగు వుకాణాలను నిర్మించుకుని అద్దెకు ఇచ్చి జీవనోపాధి పొందుతున్నారని ఆస్తి పన్నులు విద్యుత్ బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారని తెలిపారు. మల్లుల అభిషేక్ నకిలీ పత్రాలు తప్పుడు వివరాలతో బాధితుల పేర్లపై ఉన్న ప్లాట్లను ఖాళీ స్థలాలుగా చూపించి తన పేరుతో నమోదు చేసుకునేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. ఈ విషయంపై తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు పోచారం మున్సిపాలిటీ స్థలాన్ని పరిశీలించగా అక్కడ నాలుగు దుకాణాలు ఉన్నట్లు వ్యాపారాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. అదే స్థలానికి విద్యుత్ కనెక్షన్ కోసం చేసిన దరఖాస్తును కూడా అధికారులు తిరస్కరించారని తెలిపారు.బాధితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. మల్లుల అభిషేక్‌పై చర్యలు తీసుకుని బార్ కౌన్సిల్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తుంగతుర్తి రవి, పల్లె బాబురావు, మెట్టు గణేష్, ఎర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.



## ప్లాట్ల కేటాయింపులో లబ్దిదారులకు ఊరట


### చట్ట ప్రకారం తప్ప జోక్యం చేసుకోవద్దని హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం ఉప్పర్‌పల్లి గ్రామంలోని నిరుపేదలకు గతంలో కేటాయించిన ఇండ్ల స్థలాల్లో పిటిషనర్లకు అనుకూలంగా గురువారం హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి బాలేష్ మాట్లాడుతూ ఉప్పర్‌పల్లి గ్రామంలో 837, 838 సర్వే నెంబర్‌లలో 2003లో పేద ప్రజలకు ఇండ్ల స్థలాలకు సుమారు 100 గజాల చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. ఇట్టి భూమిలో నుంచి ఔటర్ రింగ్ రోడ్డు కొరకు యాభై శాతం భూమిని ప్రభుత్వం సేకరించిందని దీంతో లబ్దిదారులకు కేటాయించిన ప్లాట్లను 80 గజాలకు కుదించారని తెలిపారు. 2014లో కేటాయింపుదారులకు పాత, కొత్త ప్లాట్ నెంబర్లను సూచిస్తు కొత్త సర్టిఫికెట్‌లు జారీ అయ్యాయని చెప్పారు. 2018లో ప్రతివాది అధికారులు లబ్దిదారులు నిర్మిస్తున్న కట్టడాలను, ఇండ్లను కూల్చివేశారు. దీంతో నష్టపోయిన లబ్దిదారులు ఇళ్లు కట్టుకోవడానికి అనుమతుల కోసం మరోసారి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అధికారుల నుంచి ఏలాంటి స్పందన రాలేదని చెప్పారు. అధికారులు తిరిగి ప్లాట్లను సందర్శించి ఆ ప్లాట్లు ఇతర అవసరాల కోసం ఉన్నాయంటు అక్కడ ఉన్న నిర్మాణాలను, ఇండ్లను కూల్చివేశారు. దీంతో లబ్దిదారులు హైకోర్టును ఆశ్రయించి పిటిషన్‌ను దాఖలు చేయగా కోర్టు లబ్దిదారులకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కోర్టు ఉత్తర్వులు గ్రామస్థులకు అనుకూలంగా రావడంతో ఉప్పర్‌పల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆ స్థలాల్లో ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను కట్టించాలని మాజీ జడ్పిటిసి బాలేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలతో జస్వంత్ రావు భేటీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ఆయన నివాసంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియ ర్ నాయకుడు గొట్టుముక్కల జస్వంత్‌రావు (దేశల్), కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు, అభివృ ద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా జస్వంత్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యా వ్యవస్థ రాష్ట్ర విద్యారంగంలో పెను మార్పులు తీసుకురానుందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులు బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర రాజ్యసభ సభ్యుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ యాదవ్‌ను ఆయన స్వగృహంలో కలిసి నియోజకవర్గ సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. కూకట్‌పల్లి ప్రాంత అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, దేశల్ మిత్ర సభ్యులు పాల్గొన్నారు.






## సర్ ప్రక్రియకు ప్రజలంతా సహకరించాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

**ప్రజాపక్షం/పరిగి :** ఎన్నికల సంఘం అదేశాల మేరకు ఇంటింటి ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలంతా సహకరించాలని పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు. గురువారం 16వ వార్డులో ప్రారంభమైన ఇంటింటి సర్వే ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ బిఎల్‌ఏలు ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. వృద్ధులకు ,దివ్యాంగులకు ,నిరక్షరాస్యులకు ప్రతి అంశాన్ని క్షుణంగా వివరించి ఎస్ఐఆర్ ను నిర్వహించాలని తెలిపారు. తమ ఇళ్లవద్దకు వచ్చే బిఎల్‌ఎలకు సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్‌చైర్మన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మాగంటి గోపీనాథ్‌కు నివాళ్లు



**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** మాజీ ఎమ్మెల్యే, దివంగత మాగంటి గోపినాథ్ మొదటి వర్ధంతి సందర్భంగా యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన మాగంటి స్మారక కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మాగంటి గోపినాథ్ కుటుంబ సభ్యులను పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## భద్రత, డ్రగ్స్ నియంత్రణకు ప్రాధాన్యత



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** రాష్ట్ర పోలీసులు ప్రజల భద్రత, డ్రగ్స్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి గురువారం రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిస్థితులు, ప్రజా భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, ఫ్రెండ్లీ పోలీసింగ్ తదితర అంశాలపై చర్చించినట్లు రవిశేఖర్‌రెడ్డి తెలిపారు.

## మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురానగర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం అమీర్‌పేట్ మైత్రీవనం శ్రీచైతన్య జూనియర్ కళాశాల వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమాన్ని బంజారాహిల్స్ ఏసిపి ఎస్.వెంకట్‌రెడ్డి, మధురానగర్ ఎస్‌హెచ్‌ఓ హెచ్.ప్రభాకర్, డిఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శివశంకర్, ఎస్‌ఐ శ్రీహరి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.

## సేవాభావమే పరమావధి



**ప్రజాపక్షం/బోరబండ:**సేవాభావమే పరమావధి అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు కళ్యాణ్‌నగర్ వెంచర్3లో నిర్వహించిన శిరిడి సాయిబాబా 27వ వార్షికోత్సవ మహోత్సవాల్లో ఆయన పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## డ్రగ్స్‌కు నో చెప్పండి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలలో భాగంగా గురువారం చత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పుగూడ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో డ్రగ్స్‌కు నో చెప్పండి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి చత్రినాక ఏసీపీ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో చత్రినాక సిఐ కోటేశ్వర రావు, డిఐ ఆర్‌కె నాయుడు, ఎస్‌ఐ ప్రేమ్ కుమార్, చత్రినాక పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు కబ్జాపై స్థానికుల ఫిర్యాదు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** రోడ్డు కబ్జా చేసి చేపట్టిన అనధికార నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ మేరకు గోల్‌నాకా కమలానగర్‌బస్తీలోని కమ్యూనిటీ హాల్ ఎదురుగా రంగ్ శాల డిజిటల్ ప్రింటింగ్ నిర్వాహకులు రోడ్డును కబ్జా చేసి, అనధికార నిర్మాణాలు చేపట్టారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని బస్తీ కమిటీ సభ్యులు రెవెన్యూ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమలానగర్ బస్తీ కమిటీ సభ్యులు శ్రవణ్, రవి, ప్రణీత్, శశికిరణ్, మహేందర్, సాయి, నవీన్, శ్రీనివాస్ గురువారం అంబర్‌పేట్ డిటి బాలరామ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

## పేదలకు అండగా సిఎం సహాయనిధి



**ప్రజాపక్షం/మలక్‌పేట్:** ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తోందని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# విద్యుత్ భద్రతా వారోత్సవాలు

### జూన్ 26 నుంచి జూలై 2 వరకు నిర్వహణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** భద్రత ఒక నినాదం కాదు.. జీవన విధానం కావాలి... అనే సందేశంతో విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లూజ్ కనెక్షన్, నాసిరకం వైరింగ్, ఎర్తింగ్ లేకపోవడం వంటి వాటి వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. విద్యుత్ వినియోగం పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా జూన్ 26 నుంచి జూలై 2 వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నారు.

నేషనల్ సేఫ్టీ కౌన్సిల్, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆదేశాల మేరకు ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ భద్రతా కార్యక్రమాలలో భాగంగా వినియోగదారులకు అవగాహన, చైతన్యం కల్పించనుంది. ముఖ్యంగా ఏసీలు, గీజర్లు, అధిక విద్యుత్ పరికరాల వినియోగం పెరగడంతో విద్యుత్ లోడ్ అధికమవుతోంది. సామర్థ్యానికి మించిన లోడ్‌తో కేబుళ్లు వేడెక్కి కాలిపోవడం, షార్ట్‌సర్క్యూట్లు, అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లూజ్ కనెక్షన్లు, పాత వైరింగ్, నాసిరకం పరికరాల వినియోగం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.




ప్రజల్లో అవగాహన కల్పన కోసం విద్యా సంస్థలు, పరిశ్రమలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు, గృహ సముదాయాల్లో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యుత్ ప్రమాదాల కారణాలు, నివారణ చర్యలు, నాణ్యమైన పరికరాల వినియోగం, ప్రభుత్వం కల్పిస్తున్న భద్రతా సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ప్రభుత్వ విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి (సిఇఐజి) కే.నందకుమార్ తెలిపారు. ఇండ్లల్లో ఎంసీబీ, ఆర్సీబీ పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, పరిశ్రమల్లో స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ డిటెక్టర్లు, ఫైర్ ఎగ్జిటింగ్విషర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. లిథియం బ్యాటరీలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైరైజ్ భవనాల్లో లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానెల్ గదుల్లో అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచడం, స్నానాల గదుల్లో స్విచ్లు, సాకెట్లు అమర్చకపోవడం వంటి చర్యలు ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తాయని ఆయన వివరించారు.

## బిబికా ఆలం ట్రాఫిక్ ఆంక్షలు

### సహాయం కోసం సెల్:9010203626

**ప్రజాపక్షం/చార్మినార్:** పాతబస్తీలోని బీబీ కా అలవా నుంచి నిర్వహించే 'బీబీ కా ఆలమ్' ఊరేగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్లింపులు విధిస్తున్నారు. ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లు...కా అలవా వైపునకు వాహనాల రాకపోకలు అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను సునార్‌గల్లీ 'టి' జంక్షన్ వద్ద దబీర్‌పురా దర్వాజా, గంగానగర్ నాలా, యాకుత్‌పురా వైపునకు మళ్లిస్తారు. అలాగే షేక్ ఫైజ్ కమాన్ వైపునకు వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను జబ్బార్ హోటల్ వద్ద అవసరానికి అనుగుణంగా దబీర్‌పురా దర్వాజా లేదంటే చంచల్‌గూడ వైపునకు మళ్లిస్తారు. ఏతేబార్ చౌక్ నుంచి బడా బజార్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను ఏతేబార్ చౌక్ వద్ద పరిస్థితికి అనుగుణంగా బట్టి కోట్లా అలీజా లేదంటే పురాణీహవేలీ వైపునకు మళ్లిస్తారు. కాగా ప్రధాన ఊరేగింపు గంగానగర్ నాలాకు చేరుకున్నప్పుడు, పురాణీహవేలీ నుంచి ఏతేబార్ చౌక్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈక్రమంలోనే పురాణీ హవేలీ, మొఘల్‌పురా, గుల్జార్‌హౌజ్, మదీనా, కోట్లా అలీజా, చార్మినార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. అత్యవసర పరిస్థితిలో సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ సెల్:9010203626లో సంప్రదించవచ్చు.

## ఫీజుల కోసం హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

### 30న కలెక్టరేట్‌లను ముట్టడించాలి
### విద్యార్థులకు ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**పజాపక్షం / హిమాయత్‌నగర్:** పెండింగ్ ఫీజుల కొసం ఈ నెల 30న తరగతులు బహిష్కరించి, జిల్లా కలెక్టరేట్‌లను ముట్టడించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, పిజి, డిగ్రీ కోర్సులు పూర్తయిన విద్యార్థులు ఫీజులు కట్టకపోవడంతో వారికి కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, కన్వీనర్ మోదీ రాందేవ్ సంయుక్త అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్. కృష్ణయ్య హాజరై, మాట్లాడారు. ప్ర భుత్వం ఇకనైనా విద్యార్థులకు



ఫీజులివ్వకపోతే తానే జూలైలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తాన ని ప్రకటించారు. 14 లక్షల మంది వి ద్యార్థుల భవిష్యత్తు, అభివృద్ధి కోసం మ రో రూ. 10వేల కోట్లు అప్పు తెస్తే ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. విద్యార్థులపై ఆర్ ఆర్ యాక్ట్ పెట్టి జిఒ నం.8, 9 వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యార్థుల న్యాయమైన సమస్య పరిష్కరించకపోతే జులై మొదటివారంలో తీవ్ర ఉద్యమాలు చేస్తామని, అందులోభాగ ంగా 5లక్షల మంది విద్యార్థులతో కార్యక్రమంలో బిసి సంఘం నేత లు గొరిగె మల్లేశ్, నీలం వెంకటేశ్, సి. రాజేందర్, అనంతయ్య, శివ ముదిరాజ్ , సిద్ధు యాదవ్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### కలెక్టర్ ప్రియాంక ఆల
### విద్యార్థినులతో కలిసి భోజనం



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ:**వీరనారీ చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. కోఠిలోని వీరనారీ ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న భవనాల నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు గడువులోగా పూర్తి చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. నిర్మాణం పనులు వేగం పెంచేందుకు షిఫ్టుల వారీగా 24గంటలు పనులు నిర్వహించాలన్నారు. వేగంగా పనులు చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు, ఆధునిక విధానాలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. హాస్టల్ బ్లాక్, ఆడిటోరియం బ్లాక్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, విసి రూమ్,వసతి గృహం తదితర భవనాల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పునర్ నిర్మాణ పనుల కోసం తొలగించిన పాతహాస్టళ్ల కారణంగా



విద్యార్థినుల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్యాబిన్లను పరిశీలించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఈడబ్ల్యూఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిత సింగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లైవ్ వెరిఫికేషన్ తప్పనిసరి




**ప్రజాపక్షం/ముషీరాబాద్:** పింఛన్‌దారులు తప్పనిసరిగా లైవ్ వెరిఫికేషన్ చేయించుకోవాలని ముషీరాబాద్ తహశీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్ సూచించారు. మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వృద్ధాప్య, వికలాంగ, వితంతు, ఒంటరి మహిళ తదితర పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు వెరిఫికేషన్ పూర్తి చేయించుకోవాలని, లేకుంటే వచ్చే నెల నుంచి పెన్షన్ కట్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.ఇప్పటికే మండల పరిధిలో అనేక మంది పెన్షనర్లు వెరిఫికేషన్ చేయించుకున్నారని, మిగిలిన వారు కూడా త్వరితగతిన చేయించుకోవాలని సూచించారు.

## ఎటిఎం క్యాష్ రూ.14.55 లక్షలు స్వాధీనం

**ప్రజాపక్షం/చార్మినార్:** ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు కన్న కొడుకులతో కలిసి ఓ క్యాష్ వ్యాన్ డ్రైవర్ వేసిన ఘరానా దొంగతనం ప్లాన్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్(చార్మినార్ జోన్), ఐఎస్ సదన్ పోలీసులు ఉమ్మడిగా ఛేదించారు. ఎటిఎంలో నింపాల్సిన రూ.17 లక్షల నగదుతో పరారైన డ్రైవర్‌తో పాటు అతని ఇద్దరు కొడుకులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 14,55 లక్షల నగదు, నేరానికి ఉపయోగించిన ప్యాషన్ ప్లస్ బైక్, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్



డిసిపి ఖరే కిరణ్ ప్రభాకర్ వివరించారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ ఆందె శ్రీనివాసరావు పర్యవేక్షణలో.. సంతోష్‌నగర్ ఏసీపీ టి.సుఖ్‌దేవ్‌సింగ్, చార్మినార్ టాస్క్‌ఫోర్స్ సిఐ ఎస్.సైదాబాబు, ఐఎస్ సదన్ సిఐ జి.నాగరాజు, డిఐ బి.సాయిప్రకాష్‌గౌడ్, ఎస్‌ఐలు కె.రామారావు, ఎం.మహేష్, ఎం.మధు, సిబ్బందిని ఈ సందర్భంగా డిసిపి ఖరే కిరణ్ ప్రభాకర్ అభినందించారు.

## దేశ్‌పాండే మరణం సర్కార్‌కు పట్టదా?

### సంస్మరణ సభలో వక్తల ఆందోళన

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణ ఉద్యమ కళాకారుడు, సకల కళల జాక్ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే మృతికి ప్రభుత్వ మౌనం దేనికి సంకేతం? దేశ్‌పాండే మృతి సర్కార్‌కు పట్టదా? అంటూ పలువురు వక్తలు ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మురళీధర్ దేశ్ పాండే సంస్మరణ సభలో పలువురు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రముఖ కళాకారుడు విష్ణు కిషోర్, కొండూరు భాస్కర్, డప్పు స్వామి, గుంటి చంద్రయ్య, కోల జనార్దన్, వి.సుభాష్ చంద్రబోస్, అంబాల నారాయణ గౌడ్, దండుసా రంగపాణి, డోలక్ యాదగిరి, మంచాల వెంకటస్వామి, రాఘవేంద్ర స్వామి, అడ్వకేట్ ప్రతాప్ తదితరులు మాట్లాడుతూ... తెలంగాణ కోసం దేశ్‌పాండే కళాకారులను కూడగట్టారని కొనియాడారు. తెలంగాణ కోసం అహర్నిశలు కృషి చేశారని, రాష్ట్ర సాధన కోసం జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. కల్వకుంట్ల చంద్రశేఖరరావు, కల్వకుంట్ల కవిత వెంట కళాకారులను సమీకరించి సభలను విజయవంతం చేశారని, ఉద్యమం చేసిన నాయకుడు చనిపోతే వీళ్లంతా ఎక్కడ అని వారు గట్టిగా ప్రశ్నించారు. కనీసం సంతాప సభ కూడా పెట్టని సర్కారు కళాకారుల సంక్షేమం అంటూ మాటలు తప్ప ఆచరణ లేదని వారు మండిపడ్డారు. అతి త్వరలో రాష్ట్రవ్యాప్తంగా కళాకారులతో నిరసన సభలు చేపడతామని.. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు స్పష్టం చేశారు.

## వివాదంలో సెలబ్రిటీ విల్లాస్?

### ఇనాం చట్టంతో హక్కుల సమస్య?

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసుకున్న విల్లా స్థలాన్ని ప్రభుత్వం ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చడంతో సెలబ్రెటీ విల్లాస్ యజమానులు లబోదిబోమంటున్నారు. సెలబ్రెటీ యాజమాన్యం, రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారుల వ్యవహారం కారణంగా నెలకొన్న పరిస్థితి ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ మేరకు బాధితులు శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించుకున్నారు. డిసెంబర్ 31,2025లో ప్రభుత్వం జారీ చేసిన జిఓ190 ఉత్తర్వులతో ఇక్కడి విల్లాలు నిషేధిత భూముల జాబితాలోకి చేరడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇనాం రద్దు చట్టం, 1955 పరిధిలోకి వచ్చే ప్రభుత్వ భూములకు పర్మిషన్లు ఎలా ఇచ్చారు? నాటి సబ్‌రిజిస్ట్రార్ల పాత్ర ఎంత? రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ప్రభుత్వ, ఇనాం భూములను రిజిస్టర్ చేయకూడదనే నిబంధన ఉన్నా ఎలా రిజిస్ట్రేషన్లు చేశారు? మున్సిపల్, రెవెన్యూ అధికారుల వాటా ఎంత? ఎలాంటి లీగల్ టైటిల్ లేని భూముల్లో సెలబ్రిటీ విల్లాస్ నిర్మిస్తుంటే, ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు, మున్సిపల్ పర్మిషన్లు ఎలా జారీ చేశారు? సెలబ్రెటీ యాజమాన్యం ప్రజలను మోసం చేసిందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## రియల్ ఎస్టేట్ కోసమే మూసీ సుందరీకరణ

- ఉద్యమకారులతో కలిసి భూ పోరాటం చేస్తా
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/అంబర్‌పేట్: మూసీ సుందరీకరణ రూ.1.50 లక్షల కోట్ల స్కాం కోసమే తప్ప అందులో నది పునర్జీవం అంటూ ఏమి లేదని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకణ అంటుందని ఆమె ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు గురువారం అంబర్‌పేట్ టిఆర్ఎస్ ఇంచార్జి కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మూసీ పరిసరాల్లో పాదయాత్ర చేస్తానని.. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి భూపో



రాటం చేస్తానని ప్రకటించారు. జూలై 2న భూపోరాటం చేసి ఉప్పల్ భగయత్‌లో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించిందని ఆమె ఆరోపించారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ అన్ని డివిజన్లలో ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను కలుపుకోని జీహెచ్‌ఎంసీలో టీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన లక్ష్యం సామాజిక న్యాయమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర జెండా పండుగ పరిశీలకుడు ఎం.అభిలాష్ గౌడ్, మీర్ హమీద్ అలీ, విద్యార్థి నాయకులు శేఖర్, సిద్ధు తదితరులుతదితరులు పాల్గొన్నారు.

## జెనరిక్స్ ఫర్ ఆల్' సదస్సు

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** పేద, మధ్యతరగతి వర్గాలకు నాణ్యమైన మందులను చౌకగా అందించడమే లక్ష్యంగా గాంధీ మెడికల్ కాలేజీ మినీ ఆడిటోరియంలో 'జెనరిక్స్ ఫర్ ఆల్' సదస్సు విజయవంతంగా జరిగింది. వారధి ట్రస్ట్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సదస్సులో వైద్య రంగ ప్రముఖులు, ఫార్మా నిపుణులు, విధాన నిర్ణేతలు, వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన, విశ్వసనీయత పెంచడం ద్వారా రోగుల జేబులకు భారాన్ని తగ్గించవచ్చని సదస్సు అభిప్రాయపడింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర,



ఎం.ఆనందం అండ్ కో డైరెక్టర్ ఎం.రవీంద్ర విక్రమ్ ప్రసంగిస్తూ.. వైద్యం అనేది కొద్దిమందికే పరిమితం కాకుండా అందరికీ అందుబాటులో ఉండే ప్రాథమిక హక్కు కావాలని ఆకాంక్షించారు. వైద్య విద్యార్థులు, కాబోయే వైద్యులు జెనరిక్ మందుల నాణ్యత, వాటి ప్రాధాన్యతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రోగుల సంక్షేమం కోసం జెనరిక్ ప్రిస్క్రిప్షన్లను ప్రోత్సహించాలని వారు పిలుపునిచ్చారు.


## యువ ఇంజనీర్ దుర్మరణం

- ఆలస్యంగా ఘటన వెలుగులోకి
- నిర్మాణ ప్రాంతంలో లోపించిన భద్రత?



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** నిర్మాణ ప్రాంతంలో లోపించిన భద్రత కారణంగా ఓ యువ ఇంజనీర్ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్ 13న జరిగిన విషాద ఘటనలో 27 ఏళ్ల సైట్ ఇంజనీర్, సిరిసిల్ల జిల్లాకు చెందిన దనుజ్ మృతిచెందడం జరిగింది. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో చేపట్టిన నిర్మాణ స్థలంలో భవనంపై నుంచి కింద పడి మరణించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఎత్తులో పనులు చేసేటప్పుడు ఉండాల్సిన సేఫ్టీ నెట్లు, హెల్మెట్లు, హార్నెస్ల వంటి ప్రాథమిక భద్రతా పరికరాల కొరత యువ ఇంజనీర్ మరణానికి దారితీసినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధ్యతాయుతమైన అధికారులు స్పందించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నిర్మాణ అనుమతులు, భద్రతా తనిఖీలను పర్యవేక్షించాల్సిన అధికారులు, కార్మికుల భద్రతను పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత కూడా క్షేత్రస్థాయిలో భద్రతా తనిఖీలు నిర్వహించకపోవడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా.. ఈ విషయంపై సుల్తాన్‌బజార్ సిఐ నరేష్‌ను వివరణ కోరగా.. కేసు నమోదు చేశామని, ప్రస్తుతం ఘటనకు సంబంధించి దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నారు. అదృశ్యశక్తుల ఒత్తిడితోనే కేసును నీరుగార్చి బాధితులకు సరైన న్యాయం జరగకుండా కొందరు అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# 9వ తరగతి సాంఘిక శాస్త్రంలో ఎమర్జెన్సీ పాఠం




**న్యూఢిల్లీ :** 'జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి)' కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిదో తరగతి సామాజిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో ఎమ ర్జెన్సీకి సంబంధించిన పాఠాన్ని ప్రవేశపెట్టింది. 1975–77 మధ్య అత్యవసర పరిస్థితిని విధించడం అనేది భారతదేశంలో ప్రజాస్వామ్యానికి ఎదురైన ప్రధాన సవాళ్లలో ఒకటిగా నమోదైంది. 1970 ప్రారంభంలో, ఇందిరా గాంధీ నేతృత్వం లోని ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెర గడం, దుష్పరిపాలన ఆరోపణలు విస్తృత నిరసనలకు దారితీశాయి అని కొత్తగా రూపొందించిన 'అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్' అనే సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలోని ఒక పేరా పేర్కొంది. '1975 జూన్‌లో, అంత ర్గత అశాంతి కారణంగా ప్రభుత్వం జాతీయ అత్యవసర పరిస్థితిని విధించింది. ఈ కాలంలో, చాలా వరకు ప్రాథమిక హక్కులు నిలిపివేయబడ్డాయి, పత్రికలపై సెన్సార్‌షిప్ విధించబడింది. అనేకమంది రాజకీయ నాయకులు, కార్యకర్తలు అరెస్టు చేయబడ్డారు. ప్రజాస్వామ్య సంస్థలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. పౌరుల స్వేచ్ఛ పరిమితం చేయబడింది' అని ఆ విభాగం వివరిస్తుంది. రాజ కీయ అశాంతి, గాంధీ ఎన్నిక చెల్లదని ప్రకటించిన కోర్టు తీర్పు నేపథ్యంలో, 51 ఏళ్ల క్రితం 1975 జూన్ 25న ఈ అత్యవసర పరిస్థితి విధించబడింది.

రాజకీయ అండదండలు గల ప్రైవేట్ పెట్టుబడులు

# విస్తృత ప్రైవేట్ పెట్టుబడులను అణచివేస్తున్నాయి: కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులలో ఉత్సాహం లేకపోవడమే భారతదే శానికి అత్యంత తీవ్రమైన సవాలు అని కాంగ్రెస్ గురువారం పేర్కొంది. పెరుగు తున్న ఆర్థిక శక్తి కేంద్రీకరణ పెట్టుబడుల వృద్ధిని నిరోధిస్తోందని స్పష్టం చేసింది. విస్తృత ప్రాతిపదికన జరిగే ప్రైవేట్ పెట్టుబడులను, ఇప్పుడు రాజకీయ అండతో వస్తున్న ప్రైవేట్ పెట్టుబడులే అణచివేస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. మార్చి 31, 2026తో ముగిసిన ఆర్థిక సంవత్స రంలో భారతదేశంలోని మొత్తం ప్రైవేట్ మూలధన వ్యయంలో మూడింట ఒక వంతు అదానీ గ్రూప్‌దేనని పేర్కొన్న ఒక మీడియా నివేదికను కూడా రమేశ్ ఎక్స్‌లో షేర్ చేశారు. 'ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులలో ఉత్సాహం లేకపోవ డమే భారతదేశానికి అత్యంత తీవ్రమైన సవాలు. ఈ మందకొడితనానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో, అన్ని ఆదాయ వర్గాలలో వినియోగ వృద్ధిని ప్రభావితం చేస్తున్న వాస్తవ వేతనాల స్తబ్దత; అధిక ద్రవ్యోల్బణం కారణంగా దేశీయ పొదుపు రేట్లలో భారీ తగ్గుదల వంటివి ఉన్నాయి' అని రమేశ్ అన్నారు. అధికార వర్గాలు, పన్నుల శాఖ అధికారులు, దర్యాప్తు సంస్థల 'దాడుల పాలన' వల్ల నెలకొన్న భయం, బెదిరింపుల వాతావరణం; పెట్టుబడి నిర్ణయాలను ప్రభా వితం చేసే కీలక విధానాలలో స్థిరత్వం, ఊహించదగిన తీరు, పారదర్శకత లోపించడం; దేశీయంగా తయారైన వస్తువుల మార్కెట్‌ను నాశనం చేసిన చైనా దిగుమతుల వెల్లువ పెరగడం వంటివి కూడా ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులలో మందకొడితనానికి కారణాలని ఆయన అన్నారు. ఆర్థిక శక్తి కేంద్రీకరణ పెర గడం కూడా పెట్టుబడుల వృద్ధిని నిరోధిస్తోందన్నారు. విచిత్రమేమిటంటే దీనికి ఉత్తమ సూచికను మోదానీ సామ్రాజ్య సహనిర్మాత అందిస్తున్నారని, 2025 –26లో భారతదేశంలోని మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులలో మూడింట ఒక వంతు తన సామ్రాజ్యం నుండే వచ్చిందని ఆయన గర్వంగా ప్రకటించారని రమేశ్ అన్నారు. ప్రభుత్వ పెట్టుబడులు ప్రైవేట్ పెట్టుబడులను అణచివేస్తాయని ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు. రాజకీయ అండతో నడిచే ప్రైవేట్ పెట్టుబడులే విస్తృత ప్రైవేట్ పెట్టుబడులను అణచివేస్తున్న దృశ్యాన్ని మనం ఇప్పుడు చూస్తున్నామని రమశ్ ఆరోపించారు.

ఇక ఒంటరిగానే

# పోటీపై పరిశీలిస్తాం

టిఎంకె అధినేత ఎం.కె.స్టాలిన్



**తిరువరూర్ :** ఇక మీదట ఏ ఎన్నికనైనా ఒంటరిగానే ఎదు ర్కోవాలని తమిళనాడులోని డిఎంకె భావిస్తోంది. పొత్తులు అవసరం లేదనే ప్రజల అభి ప్రాయం బలపడుతోందని, దీనిని తమ పార్టీ త్వరలోనే పరి శీలిస్తుందని డిఎంకె అధినేత ఎం.కె. స్టాలిన్ అన్నారు. పార్టీ కార్యకర్త ఒకరి కుటుంబ సభ్యుని వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్, ఎంపి ఎ. రాజా చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. పొత్తులు అవసరం లేదన్న రాజా అభిప్రాయాన్ని తాను పరిశీలిస్తానని స్టాలిన్ పేర్కొన్నారు. పార్టీ కూటమిలో ఇటీవల తలెత్తిన అసం తృప్తి, కొందరు బయటకు వెళ్లిపోవడం వంటి పరిణామాల నేపథ్యంలో రాజా అభ్యర్థనను ప్రస్తావిస్తూ స్టాలిన్ దివంగత డిఎంకె అధినేత ఎం. కరుణానిధి అను సరించిన విధానాన్ని గుర్తుచేసుకున్నారు. కరుణానిధి ఎప్పుడూ పొత్తులను పది లంగా కాపాడుకునేవారని పేర్కొన్న స్టాలిన్, తాను ఏ పొత్తునూ వదులుకోనని స్పష్టం చేశారు. 'కానీ భాగస్వామ్య పక్షాలు తమంతట తామే వెళ్లిపోతే నేనేమీ చేయలేను. ప్రస్తుతం పొత్తులే అవసరం లేదని ప్రజలు అంటున్నారు. ఆ విష యాన్ని మేము కచ్చితంగా పరిశీలిస్తాం' అని ఆయన అన్నారు. మే 23న జరి గిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి సభలో సభ్యుడిగా లేని స్టాలిన్‌ను ఉద్దేశించి, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ అసెంబ్లీలో చేసిన 'మీ తండ్రి ఎక్కడ ఉన్నారు?' అనే వ్యాఖ్యలపై డిఎంకె నేత తీవ్రంగా మండిపడ్డారు. అసెం బ్లీలో ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌ను ఎగతాళి చేసే క్రమంలో విజయ్, స్టాలిన్ ఎక్కడ ఉన్నారని వ్యంగ్యంగా ప్రశ్నించారు. అయితే 'అక్కడ తండ్రి కోసం వెతకకండి; ఆయన ప్రజల హృదయాల్లో నిలిచి ఉన్నారు' అని స్టాలిన్ బదులిచ్చారు. 'నేను అసెంబ్లీలో ఉన్నా లేకపోయినా, ప్రజల మధ్యే ఉంటాను. 60 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న నేను ఎప్పుడూ ప్రజలతోనే ఉన్నాను అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, అసెంబ్లీలో తన కోసం వెతకడానికి బదులుగా సచివాలయంలోని ప్రభుత్వ ఫైళ్లను పరిశీలించా లని స్టాలిన్ విజయ్‌కు సూచించారు. నిరంతర విద్యుత్ కోతలు మరియు డెల్టా రైతులకు సకాలంలో నీటిని విడుదల చేయడంలో వైఫల్యం వంటి పరిపాలనాప రమైన అంశాలపై స్టాలిన్ ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.
తన ఐదేళ్ల పాలనతో దీనిని పోల్చిన ఆయన, తన ప్రభుత్వం ప్రతి ఏటా నిర్దేశిత సమయానికి మెట్టూర్ ఆనకట్ట నుండి నీటిని తప్పనిసరిగా విడుదల చేసేదని గుర్తుచేశారు.

ప్రధాన్ రాజీనామాకై 30 నుంచి

# కాంగ్రెస్ దేశవ్యాప్త ప్రచారం

40 రోజుల ప్రచారంలో మొదటి దశ ఆగస్టు 9న 'ఢిల్లీ చలో' నిరసన ప్రదర్శనతో ముగింపు



**అహ్మదాబాద్ :** దేశంలో ప్రస్తుతం అమలవు తున్న పరీక్షా విధానంలో సమగ్ర మార్పులు తీసుకురావాలని ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అదే విధంగా నీట్‌యుజి 2026 పేపర్ లీక్ విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టింది. పరీక్ష విధానంలో మార్పులు, విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలకు వ్యతిరే కంగా ఈనెల 30 నుంచి దేశవ్యాప్త ప్రచారాన్ని చేపట్టనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. 'ఛత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) పేరుతో జరిగే 40 రోజుల ప్రచారంలో మొదటి దశ ఆగస్టు 9న 'ఢిల్లీ చలో' నిరసన ప్రదర్శనతో ముగుస్తుం దని ఒక పార్టీ నాయకుడు తెలిపారు. విద్యా ర్థులు, ఉద్యోగార్థులు, కోచింగ్ హబ్‌లు, కళా శాల ప్రాంగణాలు, గ్రంథాలయాలను లక్ష్యంగా చేసుకుని 28 నగరాలను కవర్ చేస్తూ దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని పార్టీ ప్రకటిం చింది. ఈ కార్యక్రమంలో భాగంగా, కాంగ్రెస్ నాయకులు 30 నుంచి కరపత్రాల పంపిణీ, వీధి సభలు, క్యాంపస్ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు.
ఈ ప్రచారంలో భాగంగా, కాంగ్రెస్ ఆగస్టు 1న 28 నగరాల్లోని జిల్లా కలెక్టర్ కార్యాలయాల బయట ప్రదర్శనలు నిర్వహించి, ఆగస్టు 9న 'ఢిల్లీ చలో' మార్చ్‌తో మొదటి దశను ముగి స్తుంది. గురువారం గుజరాత్‌లోని గాంధీభవ న్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు సతేజ్ పాటిల్ మాట్లాడుతూ పదే పదే జరుగుతున్న పరీక్షా అవకతవకలు విద్యా ర్థులలో పెద్ద ఎత్తున విశ్వాసం సన్నగిల్లిందని, లక్షలాది మంది ఆశావహుల భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయని ఆరోపించారు. సంవ త్సరాల తరబడి సన్నద్ధమైన తర్వాత దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారని, కానీ వారిలో కేవలం రెండు లక్షల మంది మాత్రమే వైద్య, దంత, ఆయుష్, అనుబంధ కోర్సులలో ప్రవేశం పొందుతున్నా రని మహారాష్ట్ర శాసనసభ్యుడైన పాటిల్ అన్నారు. 'వారు 130 కోట్ల జనాభా ఉన్న దేశాన్ని నడపడం గురించి మాట్లాడతారు, కానీ 23 లక్షల మంది విద్యార్థులకు కూడా సరిగ్గా పరీక్ష నిర్వహించలేకపోతున్నారు. ఇది చాలా శ్రమతో కూడుకున్న పరీక్ష, దానిని సరిగ్గా నిర్వ హించడంలో వారు విఫలమవుతున్నారు' అని మహారాష్ట్ర మాజీ మంత్రి అన్నారు. ఈ సమస్య కేవలం పేపర్ లీక్‌లు లేదా రీఎగ్జామినేషన్‌కు మాత్రమే పరిమితం కాదని, ఇది వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని ఆయన అన్నారు. తాము చదివిన దాని ఆధా రంగా మార్కులు వస్తాయన్న విద్యార్థుల నమ్మకం పోయిందని, ఆ విశ్వాసం ముక్కలైపో యిందన్నారు. ఇది దేశవ్యాప్తంగా యువతలో ఏర్పడిన ఒక భారీ విశ్వాస లోటు అని ఆయన అన్నారు. పేపర్ లీక్‌లు పునరావృతమవుతున్న దృగ్విషయంగా మారాయని, దీని వెనుక సూత్ర ధారులను జవాబుదారీగా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పాటిల్ ఆరోపించారు. నీట్ వివాదాన్ని ప్రస్తావిస్తూ, గత కేసుల్లో మధ్య వర్తులను అరెస్టు చేసినప్పటికీ, పరీక్షల కుంభకో ణాల వెనుక ఉన్న పెద్ద నెట్‌వర్క్‌ను మాత్రం ఏమీ చేయలేదని ఆయన పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పనితీరు, పరీక్షా ప్రక్రి యలు, పేపర్ సెట్టింగ్ యంత్రాంగాలు, ప్రింటింగ్, రవాణా వ్యవస్థలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, వెండర్ కాంట్రాక్టులపై కూడా విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కోచింగ్ సంస్థలకు, పరీక్షల లీకేజీ నెట్‌వర్క్‌లకు మధ్య ఒక కుతంత్రం ఉందని పాటిల్ ఆరోపిం చారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, విద్యార్థులకు మద్దతుగా నిలిచి, వారి ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించ డంలో సహాయపడటానికి కౌన్సెలింగ్ యంత్రాంగాలను ఏర్పాటు చేయాలనే సూచన లను కాంగ్రెస్ పరిశీలిస్తుందని పాటిల్ అన్నారు.

# అమిత్ షా ఎత్తుగడలను ఎదుర్కొంటాం


ఇండియా కూటమికి నిర్మాణాత్మక ఎజెండా ఉంది : జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయ డానికి, నిర్మాణాత్మక ఎజెండాను అమలు చేయడానికి 'ఇండియా కూటమి' ఏర్పడిం దని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేస్తున్న తీవ్ర ప్రయత్నాలు సహా తమ కూటమి ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమిస్తా మన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా రమేశ్ మాట్లడుతూ టిఎంసిలో చీలిక ఒక వెనుక డుగు అని, అలాగే శివసేన (యుబిటి)కు చెందిన తొమ్మిది మంది ఎంపిలలో ఆరుగురు పార్టీ మారడం అనేది ప్రతిపక్ష కూటమి కొన్ని నెలల క్రితం ఊహించని పరిణామమని పేర్కొన్నారు. అయితే, ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి హోం మంత్రి ఇలాంటి ఎత్తుగడలను ఆశ్రయించడం ఆయనలోని నిస్సహాయతను లేదా ఆందోళనను సూచిస్తుంద న్నారు. ఈనెల 8న 'ఇండియా' కూటమి సహృద్భావ వాతావరణంలో సమా వేశం జరుపుకుందన్నారు. ఆర్థిక వ్యవస్థ, కేంద్రరాష్ట్ర సంబంధాలు, రాజ్యాంగ పరిరక్షణ, విదేశాంగ విధానంపై ఈ కూటమికి ఒక నిర్మాణాత్మక ఎజెండా ఉందన్నారు. రానున్న కొన్ని నెలల్లో తాము సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుం దని చెప్పారు. ప్రతిపక్షాల మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల గురించి వివరిస్తూ, గత పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రతిపక్షంతో కలిసి ఓటు వేసిందని రమేష్ గుర్తుచేశారు. 'ఢిల్లీ, గుజరాత్, ముఖ్యంగా పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా మేము పోరాడుతున్నామని మీకు తెలుసు... నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటే షన్) బిల్లు విషయంలో సిపిఐ, సిపిఐ(ఎం) మాకు మద్దతుగా నిలిచాయి, కానీ కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో మేము వారితో తీవ్రంగా పోరాడాము' ఆయన చెప్పారు. ఇక ఇండియా కూటమి జాతీయ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉద్దే శించినదే అయినప్పటికీ, ఇందులో (రాష్ట్ర స్థాయిలో కూడా) భాగస్వామ్య పక్షాలు ఉన్నాయన్నారు. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీతో, బిహార్‌లో ఆర్‌జెడితో, జార్ఖండ్‌లో జెఎంఎంతో తమ భాగస్వామ్యం ఉందన్నారు.

# యువతకు ప్రధాన్ క్షమాపణ చెప్పాలి

- వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ వెంటనే పదవికి రాజీనామా
- లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** విద్యాశాఖమంత్రి ధరేంద్ర ప్రధాన్ దేశంలోని కోట్లాది మంది యువ తకు తక్షణమే క్షమాపణ చెప్పాలని లోక్‌స భలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. తన వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ వెంటనే పదవికి రాజీనామా చేయాలన్నారు. తరుచూ పేపర్ లీక్, పరీక్షల్లో అవకతవక లకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న విద్యార్థు లను 'ఉగ్రవాదులు' అని ప్రధానం వ్యాఖ్యా నించడాన్ని రాహుల్ తీవ్రంగా విమర్శిం చారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని ద్రోహు లుగా ముద్ర వేయడమే బిజెపి రాజకీయ మని మండిపడ్డారు. 'అధికార అహంకా రంతో మత్తెక్కిన మోదీ ప్రభుత్వం, తమ హక్కులు, నిష్పక్షపాత పరీక్షలు, సురక్షిత మైన భవిష్యత్తును కోరుతున్న విద్యార్థులను విద్యాశాఖ మంత్రి 'ఉగ్రవాదులు'గా ముద్ర వేసే స్థాయికి దిగజారింది' అని రాహుల్ ఎక్స్ వేదికగా దుయ్యాబట్టారు. 'ఒక్కసారి ఆలోచించండి: ఎవరి వైఫల్యాల వల్ల ఇన్ని ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయో, ఎవరి పర్య వేక్షణలో 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారో, కోట్లాది మంది యువత భవి ష్యత్తును అంధకారంలోకి నెట్టారో, అలాంటి వ్యక్తి ఈ రోజు బాధిత విద్యార్థులను, వారి కోసం గళం విప్పుతున్న వారిని 'ఉగ్రవాదు లు'గా ముద్ర వేస్తున్నారు' అని మాజీ కాంగ్రెస్ అధినేత అన్నారు. ఇది కొత్తేమీ కాదని, దేశానికి అన్నం పెట్టే రైతులను బిజెపి నేతలు కూడా 'ఆందోళన్‌జీవి' అని, 'పరాన్నజీవులు' అని పిలిచారని ఆయన అన్నారు. 'ప్రశ్నలు అడిగిన వారిని 'దేశద్రో హులు' అని ముద్ర వేశారు. ఇప్పుడు యువ తను 'ఉగ్రవాదులు' అని పిలుస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని దేశద్రోహు లుగా ముద్ర వేయడమే వారి రాజకీయాలు' అని గాంధీ అన్నారు. 'నన్ను మీకు నచ్చినం తగా విమర్శించండి. నేను కోటాలో చెప్పాను, మళ్ళీ చెబుతున్నాను: ఈనాడు ఈ విద్యా వ్యవస్థ కేవలం ఒక దోపిడీ దందాగా మారింది. నేను దీనిని ఇలాగే కొనసాగని వ్వను. ప్రతి బిడ్డకు అందుబాటు ధరలో, నాణ్యమైన విద్య, నిష్పక్షపాతమైన పరీక్షలు అందాలనే డిమాండ్‌ను నేను ఎప్పటికీ లేవనె త్తుతూనే ఉంటాను' అని రాహుల్‌గాంధీ అన్నారు. సిజెపిని 'ఉగ్రవాదుల బిటీమ్' అని ప్రధాన్ అభివర్ణించారన్న ఆరోపణలపై ఆయన వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా ఆయనను విమర్శించారు. విద్యా ర్థుల నిరసనపై ప్రధాన్ ఆరోపణలు చేసిన వ్యాఖ్యలు చేస్తున్న వీడియో క్లిప్‌ను దీప్కే ఎక్స్‌లో షేర్ చేశారు. 'ప్రధాన్ ఏమన్నారో ఊహించండి. ఆత్మహత్య చేసుకున్న విద్యా ర్థులకు మేము న్యాయం కోరుతుండగా, సిజెపి ఉగ్రవాదుల బిటీమ్ అని ఆయన అన్నారు. విద్యాశాఖ మంత్రి ఈ దేశ యువ తను ఉగ్రవాదులని పిలుస్తున్నారు' అని దీప్కే పేర్కొన్నారు.

# చట్టాన్ని అందరికీ సమానంగా అందుబాటులో ఉంచడమే సమానత్వానికి తొలి అడుగు...

- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఉద్ఘాటన
- రష్యాలో 14వ సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ లీగల్ ఫోరమ్‌ను ఉద్దేశించి కీలక ప్రసంగం



**న్యూఢిల్లీ :** సమానత్వానికి తొలి అడుగు చట్టాన్ని అందరికీ సమానంగా అందుబాటు లోకి తీసుకురావడమేనని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ అన్నారు. ఇది కేవలం ఒక విధానపరమైన అంశంగా మాత్రమే ఉండకూడదని సిజెఐ నొక్కిచె ప్పారు.బుధవారం రష్యాలోని 14వ సెయింట్ పీటర్స్ బర్గ్ ఇంటర్నేషనల్ లీగల్ ఫోరమ్‌ను ఉద్దే శించి ఆయన ప్రసంగిస్తూ చట్టం పట్ల సమాన ప్రాప్యత అనేది కేవలం నిష్ప్రయోజనమైన, చట్ట పరమైన ప్రకటనలకే పరిమితం కాకుండా, వాస్తవ హక్కుల కల్పనలో ఫలితం ఇవ్వాలని సిజెఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. సమానత్వం కోసం వాస్తవానికి ఏమి అవసరమో మనల్ని మనం ప్రశ్నించుకోవాలన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద, అత్యంత సంక్లిష్టమైన న్యాయవ్యవస్థ లకు అధ్యక్షత వహించిన తన అనుభవం ప్రకారం సమానత్వానికి మొదటి మెట్టు సమాన ప్రాప్యతను కల్పించడమేనన్నారు. అటువంటి ప్రాప్యత కేవలం ఒక విధానపరమైన లాంఛ నంగా ఉండకూడదని, డొల్ల శాసనప్రకటనలకు బదులుగా వాస్తవ హక్కుల ప్రదానానికి దారితీ యాలని సిజెఐ అన్నారు. సమానత్వం ఆవిర్భ వించిన స్థలం కచ్చితంగా 1215 నాటి మాగ్నా కార్టా కానక్కరలేదని ఆయన తెలియజేశారు. భారత రాజ్యాంగం అవిర్భవించినప్పుడు ఒక నూతన శకానికి నాంది పలికిందని, చట్టం ముందు సమానత్వం, సమాన న్యాయంతో కూడిన జీవితం వంటి అనేక ప్రాథమిక హక్కు లను ప్రజలకు ప్రసాదించిందని సిజెఐ సూర్య కాంత్ పేర్కొన్నారు. 'ఈ గ్యారంటీలను కేవలం పఠించడం మాత్రమే కాదని, ఆర్థిక సామాజిక ప్రతికూలతలు, భాషా అవరోధాలు, సాంస్కృ తిక వైవిధ్యాలు వంటి వాటిని లెక్కచేయకుండా భౌగోళిక దూరాలకు వాటిని అందించడమే అస లైన సవాల్ అని సూర్యకాంత్ వివరించారు. సమానత్వానికి అత్యంత ముఖ్యమైన అడ్డంకి చట్టపరమైన లేదా శాసనపరమైన మద్దతు లేక పోవడమేనని, భౌగోళిక, సామాజిక, ఆర్థిక అస మానతల కారణంగానే అది వ్యక్తం అవుతుం దని సిజెఐ తెలిపారు.అంతర్జాతీయ చట్టపరమైన వ్యవస్థకు సంబంధించి, ప్రపంచ తూర్పు దక్షి ణాదిలోని అనేక దేశాలు ఇప్పటికే తమ వ్యవస్థ లను నిర్మించుకుంటున్నాయని, వలసవాదం పర్యవసానాలను పరిష్కరిస్తున్నాయని, పేదరి కాన్ని ఎదుర్కొంటున్నాయని సూర్యకాంత్ అన్నారు. ఈ దేశాలు తరచుగా ధనిక, మరింత ప్రభావవంతమైన దేశాలపై వర్తించని పరిశీలన, ఒత్తిడిని ఎదుర్కొంటాయని, ఆ దేశాల సొంత నిబంధనల పాటింపు రికార్డులు కూడా తప్పనిస రిగా నిష్కళంకమైనవి కావని సిజెఐ వివరిం చారు.

# పది మంది రాజ్యసభ సభ్యుల ప్రమాణం



**న్యూఢిల్లీ :** ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు గురువారం పదవీ ప్రమాణం చేశారు. రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ పది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రజాప్రతినిధులు రాజ్యసభ ప్రధాన సభలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన కొత్త సభ్యులలో ఆంధ్రప్రదేశ్ నుండి నలుగురు, జార్ఖండ్ నుండి ఇద్దరు, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుండి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. కొ త్తగా ఎన్నికైన సభ్యులలో ఐదుగురు హిందీలో, ఒకరు ఆంగ్లంలో, ఒకరు తమి ళంలో, ముగ్గురు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా బాధ్యతలు చేప ట్టిన సభ్యుల్లో సనా సతీష్ బాబు (టిడిపి), విజయ్ చింతకాయల (టిడిపి), భాష్యం రామకృష్ణ (టిడిపి), లింగమనేని రమేష్ (జెఎస్‌పి) వీరంతా ఆంధ్రప్ర దేశ్ నుండి ఎన్నిక కాగా, తై తగాక్ (బిజెపి) అరుణాచల్ ప్రదేశ్ నుండి, రాజేష్ పరమానంద్ శుక్లా (బిజెపి) గుజరాత్ నుండి, పరిమల్ నత్వాని (స్వతంత్ర), వైద్యనాథ్ రామ్ (జెఎంఎం) వీరిద్దరూ జార్ఖండ్ నుండి, దేబాశిష్ సమంత రాయ్ (బిజెపి) ఒడిశా నుండి, ప్రవీణ్ చక్రవర్తి (కాంగ్రెస్) తమిళనాడు నుండి ఎన్నికయ్యారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి. మోదీ తదిత రులు హాజరయ్యారు.

# జాతీయ రహదారుల్లో ట్రాఫిక్ నిర్వహణ ఆధునీకరణ

ఢిల్లీ– ఎన్‌సిఆర్ మధ్య సరికొత్త ఎటిఎంఎస్ వ్యవస్థ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ–ఎన్‌సిఆర్ మధ్య 1,205 కి.మీ నిడివిగల జాతీయ రహదారి మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం గతంకంటే మరింత మెరు గైన సరికొత్త మౌలిక సదుపాయాల నిర్వహణా వ్యవస్థ (ఎటిఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చేలా ఎన్‌హెచ్‌ఎఐ ఆధునీకరణ చర్యలకు యోచిస్తోంది. ప్రాథమికంగా ప్రస్తుతం ఉన్న ఎటిఎంఎస్‌లను అప్‌గ్రేడ్ చేస్తారు. ట్రాఫిక్‌ను పర్యవేక్షించే కెమెరాల వ్యవస్థ (టిఎంసిఎస్)ను 24 గంటలూ అందుబాటులో ఉంచడం,ఘటన లను నమోదు చేయడానికి వీడియో చిత్రీక రణ,ట్రాఫిక్ ఉల్లంఘనల పర్యవే క్షణ,నిఘా,రోడ్డు ప్రమాద ఘటనలు కనిపెట్టేం దుకు ఆ ఆధునీకరణ చర్యలు దోహదం చేస్తాయి. ఎన్‌హెచ్‌ఎఐ ఈ మేరకు గురువారం ఒక ప్రకటన చేసింది. శరవేగంగా వెళ్ళే వాహ నాల నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థ మరింత మెరుగుదల, లెక్కకుమిక్కిలిగా ఉండే ప్రయాణి కులకు మరింత సులభంగా సమాచారాన్ని ఎప్ప టికప్పుడు చేరవేయడం, సాంకేతికతను ఉప యోగించుకుని, జాతీయ రహదారులలో పర్యా వరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం లక్ష్యాలుగా ఎన్‌హెచ్‌ఎఐ కొత్త చొరవ తీసుకుంటుందని ప్రక టన పేర్కొంది.
జాతీయ రహదారులలో కూడా ట్రాఫిక్ ఊహిం చనంతగా పెరుగుతోంది. వాహన కొనుగోళ్ళు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించాలంటే ఎప్పటికప్పుడు మెరుగైన వ్యవస్థలను మారు తున్న సాంకేతికతకు అనుగుణంగా అందుబా టులోకి తేవాలి. పర్యవేక్షణ పెరగాలంటే సాంకే తికపరమైన డేటాపైనే ఎక్కువగా ఆధారపడాలి. వాహనాలు ఎంత వేగంతో వెళుతున్నాయో, పరిధి దాటుతున్నాయో ఖచ్చితంగా తెలుసుకోగ లుగుతారు. డ్రైవర్లను అప్రమత్తం చేయడానికి సిగ్నల్ బోర్డులు కూడా అవసరమైన ప్రతిచోటా అందుబాటులో ఉంటాయి. ట్రాఫిక్ సంరక్షణ చర్యలకు ముందస్తు హెచ్చరికలు ఉంటాయి. హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఆధారిత కమ్యూ నికేషన్ వ్యవస్థ ఈ ఆధునిక వ్యవస్థకు మూలా ధారంగా పనిచేస్తుంది. ఈ కారిడార్ మొత్తానికి ఇ–చలాన్ వ్యవస్థను కూడా అనుసంధానం చేస్తారు. ఢిల్లీ–ఎన్‌సిఆర్ మార్గంలో 408 కి.మీ నిడివిగల మార్గంలో ఆధునీకరించిన ఎటిఎంఎ స్‌లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తారు. దాదాపు 797 కి.మీ మార్గంలో ప్రస్తుతం ఎటిఎంఎస్ వ్యవస్థ ఉంది. దీనికి వీడియో వ్యవస్థను జతచేసి అప్‌గ్రేడ్ చేస్తారు. ఢిల్లీ– ఎన్‌సిఆర్ అత్యంత కీలకమైన, ముఖ్య మైన మార్గం కాబట్టి దీనికి ప్రాధాన్యత ఉంది. దీంతోపాటు ఈ చుట్టుపక్కల రెవారి, మధుర, ఘాజియాబాద్, మీరట్, ద్వారక, భాగ్‌పట్, భివానీ ప్రాంతాలు కూడా ఈ ఆధునీకరణ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఢిల్లీ–గుర్‌గా వ్–కోట్‌పుత్లి ఎన్‌హెచ్– 48, ఢిల్లీ–మీరట్ ఎక్స్ ప్రెస్‌వే ఎన్‌ఇ–3, ఢిల్లీ–సహరాన్‌పూర్ ఎన్ హెచ్–709 కూడా కీలకమైన ఎన్‌సిఆర్ కారిడా ర్స్‌లో జత కలిసి ఉన్నాయి. మీరట్– ముజఫర్ నగర్ ఎన్‌హెచ్–58, మీరట్–బులంద్‌షహర్ ఎన్‌హెచ్–235, మీరట్–నజిబాబాద్ ఎన్ హెచ్–119 సహా వెస్ట్రన్ కారిడార్‌కు ఈ ఆధునీ కరణ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుంది.
ఈ ఎటిఎంఎస్ వ్యవస్థ మౌలిక సదుయాలలో కీలకమైన సమీకృత డిజిటల్ వేదికలుంటాయి. అంటే భారత జాతీయ రహదారుల సంస్థ డేటా,రాజ్‌మార్గయాత్ర మొబైల్ యాప్, నేషనల్ హైవే హెల్ప్‌లైన్ 1033, ప్రయాణికుల సేవలు కూడా ఇందులో అందుబాటులో ఉంటాయి. బహుముఖ నియంత్రణ కేంద్రాన్ని నిర్మిస్తారు. స్థానిక, ప్రాంతీయ, జాతీయ కంట్రోల్ సెంట ర్స్‌ను అనుసంధానం చేయడం ద్వారా ఈ బహుముఖ కమాండ్ కంట్రోల్ కేంద్రం పనిచేస్తుంది.

# ఆగని నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు




**హింగోలి :** నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. పరీక్షకు ముందే కొందరు ఆహత్యకు పాల్పడగా, పరీక్ష తరువాత కూడా అవే ఘటనలు జరుగుతున్నాయి. తాజాగా మహారాష్ట్రలోని హింగోలికి చెందిన 18 ఏళ్ల విద్యార్థి, ఇటీవల నీట్ యుజి రీటెస్ట్ రాసిన తర్వాత మొబైల్ ఫోన్‌లో ఒక వీడియో రికార్డ్ చేసి ఆత్మహత్యకు పాల్పడినట్లు అధికారులు గురువారం తెలిపారు. రీటెస్ట్ కష్టంగా అనిపించిందని అతని కుటుంబ సభ్యులు పేర్కొన్న నేపథ్యంలో, విద్యార్థి సుశీల్ ధాగే తీసుకున్న ఈ తీవ్ర నిర్ణయానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్షకు ఏమైనా సంబంధం ఉందా అని నిర్ధారించడానికి విచారణ జరుగుతోందని వారు చెప్పారు. నగరంలోని అష్టవినాయక్ నగర్ ప్రాంతంలో నివసించే ధాగే (18), బుధవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో బావిలోకి దూకారని ఒక అధికారి విలేకరులకు తెలిపారు. ఆత్మహత్యకు ముందు, సుశీల్ తన తల్లికి క్షమాపణ చెబుతూ 33 సెకన్ల నిడివి గల వీడియోను రికార్డ్ చేశాడని ఆయన చెప్పారు. 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను, నువ్వు (అమ్మ) ఆందోళన చెందవద్దు. వచ్చే జన్మలో నీ బిడ్డగానే పుట్టాలని కోరుకుంటున్నాను. సుమేధ్‌తో ఉండు. నన్ను క్షమించు' అని ఆ వీడియో క్లిప్‌లో ధాగే చెప్పిన సందేశాన్ని అధికారి ఉదహరించారు. నీట్ రీ ఎగ్జామినేషన్ పేపర్ కష్టంగా అనిపించిందని ధాగే కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ప్రస్తుతం ప్రమాదవశాత్తు మరణంగా కేసు నమోదు చేశామని ఒక అధికారి చెప్పారు.

# మేం చెప్పినట్లు వినకపోతే చర్యలు

- మా ప్రమేయం లేకుండా కొత్త జలమార్గాలు వాడొద్దు
- హోర్ముజ్‌లో రాకపోకలపై ఐఆర్‌జిసి హెచ్చరిక
- ఫీజు వసూలుపై భగ్గుమంటున్న వివాదం
- జలసంధిపై మరింత పట్టు బిగించిన ఇరాన్



**టెహ్రాన్:**హోర్ముజ్ జలసంధిలో టోల్ ఫీజు వసూలు చేసే విషయంపై అమెరికా–ఇరాన్ మధ్య వివాదం, వాగ్వాదం రోజు రోజుకూ ముదురుతోంది. హోర్ముజ్‌లో ఎలాంటి సుంకాలు, ఫీజులు వసూలు చేయడాన్ని అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా, కొత్త జలమార్గాల అంశం తెరమీదకు రావడంతో ఉద్రిక్తతలు మళ్ళీ పెరిగాయి. సుంకాలు లేదా ఫీజులను తిరస్కరిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఒప్పందానికి కట్టుబడి ఉండాలని హెచ్చరించారు. ఈ పరిస్థితులు ఒప్పందం అమలుపై ప్రభావం పడతాయన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దశలో ఒకవైపు బ్రహ్రైన్‌లో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో, గల్ఫ్‌లో మిత్రదేశాలకు పూర్తి రక్షణ కల్పిస్తామని ప్రకటించగా, జలసంధిపై ఇరాన్ మరింత ఎక్కువగా తన పట్టు బిగించింది. ఇరాన్‌తో సంప్రదించకుండా హోర్ముజ్ జలసంధి దాటేందుకు కొత్త మార్గాలను ఏర్పాటు చేయడంపై ఆ దేశ పాలకులు మండిపడ్డారు. తమకు చెప్పకుండా నిషేధిత జల మార్గాలను నౌకలు ఉపయోగించడం ఎంత మాత్రం సమ్మతం కాదని విమర్శించారు. ఇరాన్ నిర్దేశించిన జలమార్గాలనే నౌకలు ఈ జలసంధిలో రాకపోకల నిమిత్తం ఉపయోగించాలని, ఛానల్–16 మార్గంలోనే ప్రయాణం చేయాలని సముద్రయాన నిర్వాహకులను కోరింది. ప్రయాణ సమయంలో ప్రతినౌకా తమతో సమన్వయంతో వ్యవహరించాలని, తమకు అందుబాటులో ఉండాలని లేకపోతే ప్రమాదం సంభవిస్తుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) హెచ్చరించింది. వ్యూహాత్మకంగా గతంలో తాము ప్రకటించిన మార్గాలే అధీకృత మార్గాలని తెలియజేసింది. తమ ఆదేశాలను ఉల్లంఘించి కొత్త నౌకా మార్గాలలో ప్రయాణం చేసినట్లు తెలిస్తే అలాంటి నౌకలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తాము నిర్దేశించిన జలమార్గాలలో మాత్రమే నౌకలు ప్రయాణం చేయాలని, మిగిలిన దారులు చెల్లుబాటు కాబోవని హెచ్చరిక చేసింది. ఒకవేళ మిగతా దారులను ఉపయోగిస్తే తీవ్ర ప్రమాదాలు ఎదురవుతాయని గురువారం తెల్లవారుజామున విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. హోర్ముజ్ జలసంధి నీళ్ళలోపల యుద్ధ సమయంలో ఇరాన్ చాలాచోట్ల మందుపాతరలను అమర్చింది. వీటిని తొలగించడం మహాకష్టమైన పని. దీనికి అతిపెద్ద సంప్రదింపుల యంత్రాంగం కూడా అవసరం.

**ఇరాన్ ప్రతిష్ఠ పెరిగింది:పెజెష్కియన్**

శత్రువు చేతిలో పావుగా మారవద్దని ఇరాన్ ప్రజలకు ఆ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ హెచ్చరించారు. టెహ్రాన్ సమీపంలో ఇమామ్ ఖమేనీ సమాధివద్ద మాట్లాడుతూ, ప్రజలు ఐక్యత ప్రదర్శించాలన్నారు. అమెరికాతో యుద్ధం తర్వాత ఇరాన్ ప్రతిష్ఠ పెరిగిందని, ముస్లిం దేశాల ఐక్యత పెంపొందించడం,ఇరాన్ ప్రతిష్ఠ పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇతర ముస్లిం ప్రపంచం కూడా ఇరాన్‌తో బలమైన సంబంధాలను కోరుకుంటోందంటూ పాకిస్థాన్,లెబనాన్ దేశాలను ప్రస్తావించారు. యుద్ధ సమయంలో ఇరాన్ సైన్యం ఎంతో సమన్వయంతో వ్యవహరించి శత్రువుతో పోరాడిందన్నారు. జాతీయ ఐక్యతను కాపాడాలన్నారు.

**సాధారణ స్థాయికి చేరిన చమురు ధరలు**



**దుబాయ్:**హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకల రాకపోకల పునరుద్ధరణ, కార్యకలాపాలలో క్రియాశీలత బాగా పెరగడంతో చమురు ధరలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. యుద్ధంముందునాటి పరిస్థితికి చమురు ధరలు చేరాయని అంతర్జాతీయ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 72.59 డాలర్లు, డబ్ల్యుటిఐ ధర 69.52 డాలర్లకు చేరకుంది. ఈ ఏడాది ఫిబవరి 28న ఇరాన్‌పై అమరికా దాడులు ప్రారంభించడానికి ముందు ప్రామాణికమైన బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 72.48 డాలర్లుగా ఉండేది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అదుపు చేయడానికి, ఇతర సమస్యల పరిష్కారానికి ఒక తుది ఒప్పందానికి వచ్చేందుకు 60 రోజుల కాలపరిమితిలో చర్చలు పూర్తిచేయడానికి ఒక బృహత్తర ప్రణాళికపై అమెరికా–ఇరాన్ అంగీకారం తెలియజేశాయి. జూన్ 17న తాత్కాలిక ఎంఓయుపై సంతకాల ప్రక్రియ పూర్తయినప్పటినుండీ ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు గణనీయస్థాయిలో వేగంగా క్షీణిస్తూ వస్తున్నాయి. ఇటీవలి రోజుల్లో ఈ జలమార్గం మీదుగా ద్రవీకృత సహజ వాయువు, ఎరువులు, ఇతర వ్యవసాయ పరికరాలు,ఆర్థిక వ్యవస్థను మెరుపరచే ఉత్పత్తుల రవాణా వేగం పుంజుకున్నాయి. యుద్ధ సమయంలో ఇరాన్ ఏర్పాటు చేసిన మందుపాతరలను తప్పించుకుని వెళ్ళేందుకు అమెరికా రవాణా నిమిత్తం ప్రత్యేక మార్గదర్శనం చేసింది. ఐతే ఈ జలసంధిలో ఇప్పటికీ చాలా తక్కువగానే నౌకలు ప్రయాణం చేస్తున్నాయి. సాధారణ రాకపోకలకు ఇంకా సమయం పడుతుంది.

# మినాబ్ స్కూల్‌పై మేం దాడి చేయలేదు:ట్రంప్

బహుశా ఇది ఎప్పటికీ తేలే విషయం కాదు



**వాషింగ్టన్:** ఇరాన్‌పై యుద్ధ సమయంలో మినాబ్‌లోని స్కూలుపై దాడి అమెరికాకు సంబంధం లేదని డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ ప్రాంతం అంతటా క్షిపణులు ఎగురుతూనే ఉన్నాయని, అందువల్ల ఆ దాడి ఎవరు చేశారనే విషయం ఎప్పటికీ తెలిసే అవకాశం ఉండకపోవచ్చునని అన్నారు. ''ఈ దాడి మేం చేశామని అనుకోవడంలేదు'' అన్నారు. ఈ దాడి అమెరికా వల్లనే జరిగి ఉండవచ్చునని అంతర్గతంగా అమెరికాలో జరిపిన ఒక విచారణలో తేలిందని రాయిటర్స్ వార్తాసంస్థ గడచిన మార్చినెలలో మొదటిసారి ప్రకటించింది. ఐతే ఈ విషయంతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మినాబ్ పాఠశాలలపై దాడి చేసినది మా క్షిపణే అని ఎవరో అన్నారు, బహుశా కాకపోవచ్చు, అది మా క్షిపణే అనే విషయం నమ్మడానికి నాకు ఎలాంటి ఆధారాలు కనిపించలేదు, బహుశా ఈ విషయం ఎప్పటికీ పరిష్కారం కాని సమస్యగా మిగిలిపోవచ్చు అని వ్యాఖ్యానించారు. ఈ దాడికి ఇరాన్ దేశమే బాధ్యత వహించాలని, దీనిపై దాడి విషయం తనకు తెలియదని తొలుత ట్రంప్ చెప్పారు. దీనిపై విచారణ కొనసాగుతోందని, విచారణలో తేలిన అంశాలను తాను అంగీకరిస్తానని మొదట ఆయన చెప్పారు. మినాబ్ పాఠశాలలపై దాడి ఘటనలో మరణించినవారి సంఖ్య 175గా ఉందని ఆయన చెప్పారు. ఇరాన్ ఇప్పటి వరకూ ఈ సంఖ్యను 168గా అధికారికంగా ధృవీకరించింది. ఐతే దీనికి సంబంధించిన వివరాలను పెంటగాన్ వ్యవస్థ ఇంకా విడుదల చేయాల్సి ఉంది. ఇరాన్‌లో మినాబ్ పాఠశాలలపై అమెరికా దాడి ఇరాన్ దేశంలో, ముస్లిం ప్రపంచంలో తీవ్ర భావోద్వేగాలను సృష్టించింది. దక్షిణ ఇరాన్ హోర్ముజ్‌గాన్ రాష్ట్రం మినాబ్‌లో ఒకే ప్రాంగణంలో ఉన్న షజారే తయ్యిబే బాల–బాలికల పాఠశాలలపై ఫిబ్రవరి 28వ తేదీ యుద్ధం మొదటి రోజు క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో పాఠశాల నేలమట్టమైంది. 168 మంది బాల బాలికలు, ఉపాధ్యాయులు మరణించారు. ఈ దాడి అమెరికా జరిపి ఉండవచ్చునని, అమెరికా బాధ్యత వహించాలని అనేక స్వతంత్ర దర్యాప్తులు నిర్ధారించాయి. ఇరాన్‌తోపాటు యునెస్కో,ఇతర అంతర్జాతీయ మానవహక్కుల సంఘాలు,కార్యకర్తలు ఈ చర్యను అంతర్జాతీయ మానవహక్కుల చట్టాల ఉల్లంఘనగా పేర్కొన్నారు. ఇది అంతర్జాతీయస్థాయిలో తీవ్ర యుద్ధనేరంగా తెరమీదకు వచ్చింది. ఈ ఘటనపై ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికీ విచారణ కొనసాగిస్తోంది. ట్రంప్–నెతన్యాహూలను హతమార్చివారికి భారీ బహుమతి ఇస్తామని ఇరాన్ ప్రకటించినట్లు ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. ఇరాన్ న్యాయ చట్టాల ప్రకారం నేరం రుజువైతే విదేశీ నేరస్థులపై ఫతా జారీ అవుతుంది. అన్నెంపున్నెం ఎరుగని అమాయక బాలలు పాఠశాలలో ఉంటే హతమార్చిన ఘటనపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి.ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం దీనిని ''అత్యంత భయంకరమైన సంఘటన''గా పేర్కొంది. ఐతే ఉద్దేశపూర్వకంగా తమ దేశం పాఠశాలలను ఎంచుకుని క్షిపణి దాడులు ఎప్పటికీ చెయ్యదని అమెరికా అధికారులు ఇప్పటికే ఒక బహిరంగ ప్రకటన చేశారు. ''మినాబ్–168'' అనే పేరుగల విమానంలోనే ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్ళారు. ఇరాన్ నాయకులు ఏ దేశంలో పర్యటించినాగానీ మినాబ్–168 అనే అంశం ప్రపంచ దేశాలకు తెలిసేవిధంగా అందరి దృష్టికీ తెస్తున్నారు.

## నేను ఉన్నంతకాలం లెబనాన్ సెక్యూరిటీ జోన్‌లో

**ఇజ్రాయెల్ సైన్యం కొనసాగుతుంది: నెతన్యాహూ**

**టెల్‌అవీవ్:**ఇజ్రాయెల్ ప్రధానమంత్రి పదవిలో తాను కొనసాగినంతకాలం లెబనాన్‌లోని సెక్యూరిటీ జోన్‌లో ఐ.డి.ఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) కొనసాగుతుందని బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు. దక్షిణ లెబనాన్‌లోని ఉన్న కొన్ని సెక్యూరిటీ జోన్ల నుండి ఇజ్రాయెల్ సైన్యం వైదొలగనుందని రాయిటర్స్ వార్తాసంస్థ చేసిన ప్రకటనను నెతన్యాహూతోపాటు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ కూడా ఖండించారు. రాజకీయ నాయకుల నుండి ఇంకా పూర్తిస్థాయి ఆదేశాలు రావాల్సి ఉందని రాయిటర్స్ పేర్కొంది. ఐతే ప్రధాని పదవిలో తాను కొనసాగినంతకాలం ఇరాన్‌ను అణ్వాయుధం తయారు చేయకుండా వివిధ మార్గాలలో అడ్డుకుంటామని నెతన్యాహూ చెప్పారు.మార్చి రెండో తేదీన లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత 10 కి.మీ లోనికి చొచ్చుకుపోయి తన దేశ సరిహద్దులను విస్తరించుకుని బఫర్‌జోన్,సెక్యూరిటీ జోన్‌లను ఐ.డి.ఎఫ్ ఏర్పాటు చేసింది. దక్షిణ లెబనాన్‌లో మారణహోమం సాగించి అనేక గ్రామాలు,పట్టణాలను ఖాళీ చేయించి ఆక్రమణలు చేయడంతో 10 లక్షలమంది పైగా ప్రజలు [illegible] ఉండగా, లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో గురువారం మరో ఇద్దరు మరణించారు. ఒక ఇజ్రాయెల్ సైనికుడు కూడా మరణించాడు. ఈ చర్యలను హెజ్బొల్లా తీవ్రంగా ఖండించింది. దక్షిణ లెబనాన్ నుండి ఎప్పటిలోగా ఖాళీచేసి వెళ్ళిపోతారో ఒక టైమ్‌టేబుల్ ప్రకటించాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేసింది.

## పెరూ అధ్యక్ష పదవిలో తొలి మహిళ

అత్యల్ప తేడాతో ఫుజి మోరి గెలుపు

**లిమా:** ఆఫ్రికా పశ్చిమప్రాంత దేశం పెరూలో మొదటిసారి ఒక మహిళ అధ్యక్ష పదవి గెలుచుకున్నారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఈ ఫలితాలను ప్రకటించారు. అధ్యక్ష పదవికి జరిగిన తుది విడత పోలింగ్‌లో మితవాద నాయకురాలు కీకో సోఫియా ఫుజిమోరి హిగుచి (51) అత్యల్ప తేడాతో విజయం సాధించారు. 99.87 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి ఆమెకు 50.12 శాతం ఓట్లు లభించాయి. వామపక్ష అభ్యర్థి రాబర్టో సాంఛెజ్ (57)కు 49.88 ఓట్లు వచ్చాయి. ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.దేశంలో వామపక్షాల తరపున (టుగెదర్ ఫర్ పెరూపార్టీ)పోటీ చేసిన సాంఛెజ్ ఆమె విజయాన్ని తిరస్కరించారు.కౌంటింగ్‌లో మోసం జరుగుతోందని, ఈ విజయాన్ని తాను గుర్తించబోనని అన్నారు.పెరూ మాజీ అధ్యక్షుడు ఆల్బెర్టో ఫుజిమోరి పెద్ద కుమార్తె ఫుజిమోరి హిగుచి. మొదట రాజకీయాలలోకి వచ్చేందుకు విముఖత చూపించిన ఫుజిమోరి ఆ తర్వాత పెద్ద నాయకురాలిగా ఎదిగారు. ఈనెల ఏడో తేదీన జరిగిన రన్-ఆఫ్ ఎన్నికలలో అతిస్వల్ప తేడాతో సాంప్రదాయ ఫుజిమోరి విజయం సాధించారు. అధికారంలోకి వస్తే రెండుగా చీలిపోయిన పెరూను ఏకం చేయడానికి ప్రయత్నం చేస్తానని ఆమె ప్రజలకు వాగ్దానం చేశారు.ఆమె ఇంతకుముందు నాలుగుసార్లు దేశాధ్యక్ష పదవికి పోటీపడి భంగపడ్డారు. 2011,2016,2021 సంవత్సరాల్లో జరిగిన రన్నాఫ్ ఓడిపోయిన ఫుజిమోరి చివరకు అతిస్వల్ప తేడాతో వామపక్ష అభ్యర్థిపై గెలిచారు.

## ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ సమక్షంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎపి మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల కిష్టప్ప, మూడు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20వ గేటును, ఎపి సిఎం చంద్రబాబు 19వ నెంబరు గేటు, కర్నాటక ముఖ్యమంత్రి 18వ గేటు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ 17వ గేటు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తుంగభద్ర ప్రాజెక్టు, జలాల వినియోగంపై సమావేశమయ్యారు. మూడు రాష్ట్రాల ప్రయోజనాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని మునీరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూడు రాష్ట్రాల చొరవ తుంగభద్ర గేట్ల పునరుద్ధరణకు మాత్రమే పరిమితం కాదని, ఇది ప్రాంతీయ నీటి సమస్యల పరిష్కారానికి ఒక చారిత్రాత్మక ముందడుగు అని స్పష్టం చేశారు. ఆర్‌డిఎస్ కింద తెలంగాణాలోని పాలమూరు ప్రాంతానికి కేటాయించిన 15.9 టిఎంసిలలో కేవలం 5 టిఎంసిలను మాత్రమే వినియోగించగలుగుతున్నామని, తుంగభద్రలో మట్టి పేరుకుపోవడం, నీళ్ల తరలింపులో ఉన్న సమస్యల కారణంగా కేటాయించిన నీటిలో మరో 10 టిఎంసిల నీరు అందక, గద్వాల్, అలంపూర్ ప్రాంతాల్లో ఉన్న లక్షలాది మంది రైతులకు నష్టం జరుగుతుందని, నీటి సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల పొలాలను తడపాల్సిన నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. డి.కె.శివకుమార్ ఆహ్వానం మేరకు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే పట్టుదలతో చంద్రబాబు నాయుడు, తాను 3 రాష్ట్రాల ప్రతినిధులం బళ్లారి వేదికగా కలిశామన్నారు. తమ చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని, ఈ సమస్యలను కేంద్ర మంత్రి పాటిల్ దృష్టికి తీసుకెళ్ళామని, మూడు రాష్ట్రాల మధ్య సాగునీటి సమస్యలకు కేంద్ర మంత్రి ఒక శాశ్వత పరిష్కారం చూపిస్తారని తాము సంపూర్ణంగా విశ్వసిస్తున్నామన్నారు.



**రాజకీయాలకు అతీతంగా చారిత్రాత్మక నిర్ణయం**

'మాకు పంచాయితీ కావాలా లేక సమస్య పరిష్కారం కావాలా అంటే సమస్యలకు శాశ్వత పరిష్కారమే కావాలి. రైతుల ఆకాంక్షలు నెరవేరాలనేదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా, ఎన్నికల స్వార్థ ప్రయోజనాలకు వాడుకోకుండా, తుంగభద్ర నది ఒడ్డున జరుగుతున్న ఈ చర్చలు చరిత్రలో ఒక గొప్ప నిర్ణయంగా మారబోతున్నాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదీ జలాల అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనం : సిఆర్ పాటిల్**

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం ఆధునిక గేట్ల ప్రారంభం కేవలం నిర్మాణ కార్యక్రమం కాదని, దేశంలో సహకార సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనమని తెలిపారు. 2024లో గేట్ దెబ్బతిన్న తర్వాత కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో వేగంగా పునరుద్ధరణ చేసి 33 ఆధునిక స్పిల్‌వే గేట్లు ఏర్పాటు చేయడం ఇంజినీరింగ్ విజయమన్నారు. ఈ ప్రాజెక్టు రైతులకు నీటి భద్రత, సాగునీటి స్థిరత్వం, రాష్ట్రాల మధ్య సహకారానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**నది సరిహద్దులు చూడదు..**
**సమన్వయం అవసరం: డికె శివకుమార్**

కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ తుంగభద్ర ఒక రాష్ట్రానికి చెందినది కాదు. ఈ జలాలు లక్షలాది కుటుంబాల జీవనాధారం. పరస్పర సహకారం, సాంకేతిక ఆధునీకరణ, సమర్థ నిర్వహణ ద్వారా భవిష్యత్ తరాలకు నీటిని అందించాలి. నీటి వినియోగంలో బాధ్యతాయుత దక్పథం అవసరం అని స్పష్టం చేశారు.

**గోదావరి–కావేరి అనుసంధానం జరిగితే**
**దక్షిణాది సస్యశ్యామలం : చంద్రబాబునాయుడు**

ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ కెన్ బేత్వా ప్రాజెక్టు ద్వారా ఉత్తర భారతదేశంలో నదుల అనుసంధానం విజయవంతంగా అమలవుతోందని, అదే తరహాలో గోదావరి–కావేరి అనుసంధానం జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు సస్యశ్యామలం కావడంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరతాయన్నారు. 1983లో ప్రధానితో పాటు నలుగురు ముఖ్యమంత్రులు కలిసి తమిళనాడుకు 5 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారని, ఉమ్మడి ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర అంగీకారంతో చెన్నైకి 15 టీఎంసీల తాగు నీటిని అందించామని గుర్తుచేశారు. గంగా కావేరీ నదుల అనుసంధానం జరిగితే భారత్ అభివద్ధి అన్ స్టాపబుల్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## సర్ షురూ

(మొదటి పేజీ తరువాయి)

ఎన్యూమరేషన్ ఫారాలు అందించడంలో విఫలం కావడంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణి ప్రక్రియ స్తంభించిపోయింది. దీనిపై స్థానిక రాజకీయ నాయకులు, ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటింటికి తిరిగిర ఎన్యూమరేషన్ ఫారాలు అందచేసి, ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం విఠల్ వాడి ప్రాంతంలో బిఎల్‌ఏలు, బిఎల్‌ఓలతో కలిసి స్వయంగా ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యంలో మన ప్రాథమిక హక్కు అని, బలమైన ఆయుధం అన్నారు. 2002, 2025 ఓటరు జాబితాల ఆధారంగా ఈ సవరణ ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. బిఎల్‌ఏలు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అర్హులైన ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లోని 35 వేల పోలింగ్ బూత్‌లలో ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటి ఓట్లు తటస్థ ఓట్ల కింద పడ్డాయి, వాటిని జాగ్రత్తగా పరిశీలన చేసి నమోదు చేయాలన్నారు. ఒక ఓటు కూడా తొలగిపోకుండా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున 35 వేల బూత్‌లలో బిఎల్‌ఏలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రతి ఓటరు తమ వివరాల ధృవీకరణ కోసం రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను ఎన్యూమరేషన్ ఫారంతో పాటు అందజేయాల్సి ఉంటుందన్నారు.

## ఇళ్ల పట్టాలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కూడిన ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు ఇటీవల గుండ్ల సింగారంలో పేదల ఇళ్ల కూల్చివేత ఘటనను వేం నరేందర్ రెడ్డిని దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో 50 గజాల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి ప్ర భుత్వ సహాయం అందించాలని కోరారు. పేదల ఇ ళ్లను నిర్ధాక్షిణ్యంగా కూల్చివేసి వారిని రోడ్డున పడేయడం సరికాదని, ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వాని కి చెడ్డపేరు వస్తుందన్నారు. ఈ అంశంపై స్పందించిన వేం నరేందర్ రెడ్డి, పేదలకు ప్రభుత్వం తరపున అ వసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామ ని హామీ ఇచ్చినట్లు సిపిఐ నాయకులు వెల్లడించారు.

## ప్రకృతి విలయం

(మొదటి పేజీ తరువాయి)

భూమి రెండుపాయలుగా లోతుగా కొన్నిచోట్ల కోసుకుపోయింది. కొలంబియా రాజధాని బోగోటాలో కూడా ప్రకంపనలు వచ్చాయి. కొలంబియా వ్యాప్తంగా 200 ప్రకంపనలు వచ్చినట్లు నివేదికలు అందాయని ఆ దేశ భూకంప నమోదు విభాగం సమన్వయకర్త ఫ్రెడ్డీటోవర్ చెప్పారు. కారకస్‌కు 1700 కి.మీ దూరంలో ఉన్న బ్రెజిల్ అమెజాన్ ప్రాంతం వరకూ ఈ భూకం ప్రభావం కనిపించింది. వెనిజులా ప్రధాన విమానాశ్రయం ధ్వంసమైంది. మెట్రోసేవలు సహా కార్యకలాపాలు స్తంభించాయి. సబ్‌వేలు, సహజవాయు కేంద్రాలసేవలు,పాఠశాలలను రద్దుచేశారు. స్కూళ్ళలో బాధితులకు ఆశ్రయం కల్పించారు.ఆరోగ్య కార్యకర్తలు,ఆసుపత్రులను రోడ్రిగ్జ్ అప్రమత్తం చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు.

టన్నుల బరువైన కాంక్రీట్ శిథిలాలు అడ్డంగా పడిపోవడంతో సహాయ కార్యక్రమాలు నిర్వహించడానికి భారీ క్రేన్లు,వాహనాలను తరలించడానికి ఆటంకం ఏర్పడుతోంది. ప్రజలు తమ ఆత్మీయులకోసం శిథిలాల్లో కలియ దిరుగుతూ సహాయం కోసం కేకలు పెట్టారు.ప్రధానంగా వెనిజులా లగుయిరా రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఇక్కడ ఎంతమంది మరణించారన్న విషయం ఇంకా పూర్తిగా వెల్లడికాలేదు. 100 సంవత్సరాల తర్వాత మళ్ళీ వెనిజులా చరిత్రలో ఇదే అతిపెద్ద ప్రకృతి విలయం. దేశంలో మళ్ళీ పెను భూకంపం వచ్చే అవకాశాలు ఉన్నాయని వెనిజులా హోంమంత్రి ప్రజలను అప్రమత్తం చేశారు. పరిస్థితి తీవ్రతను గమనించిన వెనిజులా అధ్యక్షురాలు (తాత్కాలిక) డెల్సీ రోడ్రిగ్జ్ దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. మృతులసంఖ్య, జరిగిన నష్టం తీవ్రతను అంచనావేసే వరకూ ప్రజలు తమ తమ పరిసరాల నుండి కదలి దూరంగా వెళ్ళవద్దని అదేశించారు.

10,000 మంది మరణించడానికి 44 శాతం మేరకు అవకాశాలున్నాయని, 1,00,000 మంది మరణించడానికి 34 శాతం అవకాశాలు ఉన్నాయని, ఆర్థిక నష్టం కూడా 10 బిలియన్ డాలర్లు దాటిపోయేందుకు 45 శాతం అవకాశాలు ఉన్నాయని అమెరికా జియలాజికల్ సర్వే విభాగం అంచనా వేసింది.కారకస్‌కు పశ్చిమాన 168 కి.మీ దూరంలో మోరోన్‌కు పశ్చిమంగా కరేబియన్ తీరంలో 22 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు యుఎస్‌జిఎస్ గుర్తించింది. అందరూ జాతీయ సెలవు దినాన్ని ఎంతో సంతోషంగా గడుపుతున్న సమయంలో ఒక్కసారిగా వెనిజులాలో కాళ్ళకింద భూమి కంపించింది. వెనిజులా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం దాటాక మొదటిసారి రిచ్‌టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో భూకంపం వచ్చింది. వెంటనే రెండోసారి 7.5 తీవ్రతతో భూకకామి బద్దలు కావడంతో వందల భవనాలు కుప్పకూలిపోయాయి. ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఏం జరిగిందో పూర్తిగా ఒక అవగాహనకు వచ్చేలోపే తీవ్ర నష్టం జరిగిపోయింది. అనేకమంది నివాసితులు శిథిలాల్లో చిక్కుకుపోయారు. ఈ పెను విషాదంపై అనేక దేశాలు స్పందించాయి.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మెక్సికో,స్పెయిన్ నేతలతోపాటు పలు దేశాల నాయకులు వెనిజులాకు పూర్తి సంఘీభావం ప్రకటించారు. పలు దేశాల నుండి సహాయ బృందాలు వెనిజులాకు బయలుదేరాయి. కాగా మోదీ, ట్రంప్ సహా సహాయం చేస్తున్న దేశాల నాయకులకు రోడ్రిగ్జ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## అడ్డుకట్ట వేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులే 'ప్రభుత్వ ఇమేజ్ బిల్డింగ్ బ్రాండ్ అంబాసీడర్ల'ని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం 'పిఆర్‌సి' అమలుకు ప్రయత్నించాలని, ఉద్యోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని డిప్యూటీసిఎం భట్టి విక్రమార్కకు సిఎం సూచించారు. 'మీ విశ్వాసమే' తమ బలమన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి, ప్రభుత్వ ఉద్యోగులకు విడతల వారీగా వేతనాలు ఇవ్వలేదా? అని బిఆర్‌ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల, ప్రమాద బీమా పథకం అమలు పైన పలు బ్యాంకర్లతో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలను సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్చుకున్నారు.

అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 58 సంవత్సరాల రిటైర్‌మెంట్ వయసును 61 సంవత్సరాలకు పెంచి,వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను పెండింగ్‌లో పెట్టారని, వాటన్నింటికీ తాము మెల్లమెల్లగా పరిష్కరిస్తున్నామన్నారు. చిన్న చిన్న అవంతరాలు వస్తే ప్రభుత్వానికి సూచనలు చేయాలని, అమలు తీరులో ఏదైనా సమస్యలు వస్తే కూర్చొని చర్చించుకుందామని,' మీరు, నేను వేర్వురు' కాదని ఉద్యోగలకు సిఎం సూచించారు. ప్రభుత్వానికి ఆదాయం వస్తే ఉద్యోగులకు, పేద ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చుచేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగుల శ్రమ, కృషి , ప్రయత్నం ఉందని కొనియాడారు. 'ఇందిరమ్మ ఇండ్ల ' అమలులో ఎటువంటి లోపాలు, అవినీతికి ఆస్కారం లేకుండా చేస్తున్నామంటేనే ఇందులో ఉద్యోగుల శ్రమ ఎంతో ఉందన్నారు. ఒకవైపు రూ. 8.11లక్షల అప్పులు, మరోవైపు జీతభత్యాలు, ఇంకోవైపు తాము భర్తీ చేసిన 70వేలఉద్యోగుల అదనపు ఆర్థిక భారం ఇలా ఎన్ని కష్టాలు ఉన్నప్పటికీ తాము ఉద్యోగుల విషయంలో సానుకూలంగానే వ్యవహరిస్తున్నామని, ఒక్కొక్కటిగా సమస్యను పరిష్కరిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం ఆర్థిక అనాలోచిత నిర్ణయాలతో 11.9 శాతం వడ్డీతో తీసుకొచ్చిన రుణాలను రిస్ట్రక్చర్ చేపించేందుకే తాము పదే పదే ఢిల్లీకి వెళ్తున్నామన్నారు.

తాను 30 నెలలుగా 16 నుంచి 18గంటల పాటు పనిచేస్తున్నానని, తమ ప్రణాళికలు ఒక కొలిక్కి వచ్చాయని,శాశ్వత సమస్యలను ఒక్కొక్కటికి పరిష్కరిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకే ఇప్పటి వరకు రూ. 2లక్షల కోట్లను చెల్లించామన్నారు. నల్లడొండ బిడ్డల ప్రాణాలు తీస్తున్న 'మూసీ'ని అభివృద్ధి చేస్తామంటే ,తమ కాళ్లలో కట్టెలు పెడుతున్నారని సిఎం ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో విస్తరిస్తే ఫామ్‌హౌజ్‌లో ఉన్నవారు, వారి పిల్లలు మెట్రోలో వెళ్లరని,వారికి సొంతంగా విమానాలలో వెళ్తారని ఎద్దేవా చేశారు.

**ఫామ్‌హౌస్‌లో కుంభకర్ణుడు..**
**బయటికొస్తే బకాసూరుడు..**

తమకు లేనిది, ఎవరికీ ఉండకూడదని, తెలంగాణ సర్వనాశనం కావాలని, తండ్రి,కొడుకులు, అల్లుడు రాష్ట్రంలో గద్దాల్లాగా తిరుగుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు .ఫామ్‌హౌస్ లో కుంభకర్ణుడు, బయటికి వస్తే బకాసూరుడు అని వ్యాఖ్యానించారు. తాము ఏది చేసినా అడ్డుకుంటున్నారని, తాము ఏమీ చేయొద్దంటే , 'మీ ఫామ్‌హౌస్ వద్ద కాపాలా కాయాలా? మీకు భజన చేయాలా?'అని సిఎం ప్రశ్నించారు. ఇలాగే ప్రతీది అడ్డుకుంటామంటే చీల్చిచింతకు కడుతమని, ఇక చింతమడకకు పోవాల్సి వస్తుందని సిఎం హెచ్చరించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి, వందేళ్ల కాలంలో చేయాల్సిన విధ్వంసాన్ని సృష్టించి, ఎక్కడిదక్కడే పడేశారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర పరిస్థితిని గందరగోళంగా మార్చారని, 'పటానుల మాకు బాకీ,మేము పకీర్లకు బాకీ' అన్న చందంగా వ్యవహారించారని సిఎం ఎద్దేవా చేశారు.

**'సంక్షేమాన్ని, అభివృద్ధి' తీసుకెళ్లే**
**'గుంపు'కే నేను గుంపు మేస్త్రీని...**

ప్రభుత్వ ఉద్యోగులకు, మంత్రులు అనే గుంపునకు తాను గుంపు మేస్త్రీనని, ఈ గుంపే తనకు బలం, ప్రతిష్ట అని,ఇదే గుంపు ప్రభుత్వ సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వద్దకు తీసుకెళ్తుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొందరు గడీలు, దొరలు అని చెప్పుకుంటారని, అలాంటి పోకడలు తనకు లేవన్నారు. 'రేవంత్ అన్న' అని పిలిస్తేనే తనకు ఇష్టమని, పదవులు వచ్చిపోతాయని,కానీ 'రేవంత్ అన్ననే' శాశ్వితమని, హోదాలు, పదవులు మరినప్పటికీ అన్నదమ్ముల అనబంధం శాశ్వితమన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు భద్రత, భరోసా.... భట్టి విక్రమార్క**

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగులకు అమలు చేస్తున్న బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణగా ఉంటుందన్నారు. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డ్ సమస్యకు ప్రజాప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తోందన్నారు. ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్‌లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని,తద్వారా ఆరోగ్య భద్రత మరింత మెరుగవుతుందని భట్టి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు హరకర వేణుగోపాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి .కె.రామకృష్ణరావు, డిజిపి సి.వి. ఆనంద్, ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు ఏలూరి శ్రీనివాస్‌రావు, మారం జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్, ఐర్లాండ్ టి–20 షెడ్యూల్లో మార్పులు





భారత్, ఐర్లాండ్ పొట్టి సిరీస్ షెడ్యూల్ మారింది. ఇదివరకు ప్రకటించిన సమయానికంటే గంట ముందే మ్యాచ్‌లు జరుగనున్నాయి. మహిళల టి–20 వరల్డ్ కప్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఐర్లాండ్ క్రికెట్ ఈ నిర్ణయం తీసుకుంది. భారత్, తమ జట్టు మధ్య జరుగనున్న రెండు టి–20ల సమయాన్ని మార్చినట్టు బుధవారం రాత్రి ఆ దేశ బోర్డు వెల్లడించింది. ఐర్లాండ్ పర్యటనలో శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత పురుషుల జట్టు రెండు టి–20ల సిరీస్ ఆడనుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. జూన్ 26న తొలి టి–20.. ఆపై ప్రపంచకప్‌లో సెమీస్ బెర్తుపై కన్నేసిన టీమిండియా జూన్ 28న ఆస్ట్రేలియాను ఢీ కొట్టనుంది. ఉంది. లార్డ్స్ మైదానంలో ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు జరుగనుంది. దాంతో, రెండూ ఒకేసారి మొదలవ్వకూడదనే ఉద్దేశంతో.. ఆరోజు భారత్, ఐర్లాండ్ గేమ్‌ను గంటముందు నిర్వహించేందుకు ఐర్లాండ్ క్రికెట్, బిసిసిఐ అంగీకరించాయి. టీమిండియా మ్యాచ్‌లను ప్రసారం చేసే సోనీ స్పోర్ట్స్ సైతం షెడ్యూల్ మార్పునకు ఆమోదం తెలిపింది. ఇంగ్లండ్ పర్యటనలోనూ భారత జట్టు ఐదు టి–20ల సిరీస్‌లలో మ్యాచ్‌ల సమయం కూడా తేడాగా ఉంది. రెండు, నాలుగో టి–20లు రాత్రి 7 గంటలకు జరుగనుండగా.. మిగతా మూడు(ఒకటో, మూడో, ఐదో టి–20లు) మ్యాచ్‌లను రాత్రి 10 గంటలకు నిర్వహించనున్నారు. ఇక ఆగస్టులో మొదలయ్యే శ్రీలంక పర్యటన విషయంలోనూ బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. రెండు టెస్టుల సిరీస్‌కు అదనంగా మూడు టి–20 సిరీస్ ఉండదని స్పష్టం చేంది.

### షఫాలీ, జెమీమా మెరుపులు..

# సెమీస్ ఆశలు నిలబెట్టుకున్న భారత్



పొట్టి ప్రపంచకప్‌లో సెమీస్ ఆశల్ని భారత మహిళల జట్టు నిలబెట్టుకుంది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను వణికించింది. 137 పరుగుల ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ (53) రికార్డు అర్ధ శతకంతో కదం తొక్కగా.. జెమీమా రోడ్రిగ్స్(26) ధనాధన్ ఆటతో లక్ష్యాన్ని కరిగించింది. మిడిలార్డర్ తేలిపోయినా.. అనుభవజ్ఞురాలైన జెమీమా విధ్వంసక ఆటతో బంగ్లా ఓటమి ఖాయం చేసింది. ఫలితంగా సెమీస్ రేసులో అవసరమైన రెండు కీలక పాయింట్లు లభించాయి. మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు మూడో విజయంతో సెమీస్ రేసులో నిలిచింది. దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్య ఓటమిని తొలుత బంగ్లాదేశ్‌ను 136కే కట్టడి చేసిన టీమిండియాకు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. స్మృతి మంధాన (8) ఔటైనా.. షఫాలీ వర్మ(53 )చితక్కొట్టింది. 29 బంతుల్లోనే అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పింది. ఔట్ చేయగా.. యస్తికా భాటియా(23) మరోసారి విఫలమైంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన రిచా ఘోష్(10).. రెండు ఫోర్లతో అలరించినా ఎల్బీగా వెనుదిరిగింది. నాలుగు వికెట్లు పడిన వేళ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(13 నాటౌట్), జెమీమా రోడ్రిగ్స్(26) నింపాదిగా ఆడారు. అప్పటికీ అవసరమైన రన్స్ 35లోపే ఉండగా.. షంజిదా అక్తర్ ఓవర్లో జెమీమా 6, 4తో రెచ్చిపోయింది. అదే ఊపులో రీతు మోనిని ఉతికేస్తూ వరసగా రెండు బౌండరీలు బాదింది. కానీ, అదే ఓవర్లో మరుఫా చేతికి చిక్కింది. నహిదా అక్తర్ వేసిన 17వ ఓవర్లో దీప్తి శర్మ(5 నాటౌట్), హర్మన్‌ప్రీత్ చెరొక ఫోర్ కొట్టగా.. ఐదు వికెట్లతో టీమిండియా గెలుపొందింది. గ్రూప్ ఏ లో ఆరు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది భారత్

#### రాణించిన ఫిర్దౌస్, సుల్తానా

టాస్ గెలిచిన బంగ్లాదేశ్ భారీ స్కోర్ కొట్టాలనే పట్టుదలతో ఆడింది. కానీ, రాధా యాదవ్(3–28), శ్రీ చరణి(2–21)లు భారత్ 136 పరుగులకు కట్టడి చేసింది. ఆరంభంలోనే వికెట్ పడినా.. ఓపెనర్ జువారియా ఫిర్దౌస్(33), నిగర్ సుల్తానా(32)లు ధనాధన్ ఆడారు. మిడిల్ ఓవర్లలో రాధా యాదవ్(328), శ్రీచరణి(221)లు వికెట్లు తీసి పరుగులు నియంత్రించారు. కానీ, ఆఖర్లో షోర్నా అక్తర్(13) మెరుపులతో బంగ్లాదేశ్ మోస్తరు లక్ష్యాన్ని నిలిపింది. మిష్టిగా రాణించడంతో బంగ్లా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### నిజాంసాగర్ ప్రాజెక్ట్

# గల నది ఏది?



- దేహమంతట ఒకే రకమైన పెరుగుదల చూపేది?
  కుక్క
- గంధపు చెట్లు యీ జిల్లాలోని అడవులలో ఉన్నాయి
  అనంతపురం
- రాజీవ్ నగర బాటను ప్రారంభించినది
  వై.యస్. రాజశేఖరరెడ్డి
- వెండిని అధికంగా ఉత్పత్తి చేయుచున్న రాష్ట్రాలు ఏవి?
  రాజస్థాన్ – బీహార్
- RSETI అనగా
  గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ
- చర్మం వెలుపలి పొర
  ఎపిడెర్మిస్
- ఫరక్కా ప్రాజెక్టు గల రాష్ట్రం ఏది?
  పశ్చిమ బెంగాల్
- 'ది ప్రిన్స్' గ్రంథ రచయిత ఎవరు?
  మాకియవిల్లి
- అయస్కాంతత్వానికి, విద్యుత్ ప్రవాహానికి మధ్యగల సంబంధమును కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
  ఆయర్ స్టెడ్
- మోయోన్ అగ్ని పర్వతం ఇచట ఉంది.
  ఫిలిప్పైన్స్ దీవులు
- గాలిలో కార్బన్ డైఆక్సైడు శాతం సుమారుగా
  0.03%
- వోలంఫ్రం అంటే:
  టంగ్‌స్టన్
- మంత్రులందరూ వ్యక్తిగతంగా, సమిష్టిగా ఎవరికి బాధ్యత వహిస్తారు?
  లోక్‌సభకు
- ఇది ఉష్ణ మండల ఎడారి లేని ఏకైక ఖండము
  అంటార్కిటికా
- సిమ్లా ఈ రాష్ట్రం యొక్క రాజధాని
  హిమాచల్ ప్రదేశ్
- హొయసలేశ్వరాలయం ఎక్కడ ఉంది?
  హళేబీడు
- బిసాంత్ అను బంగారు నాణాన్ని ప్రవేశపెట్టినది ఎవరు?
  రోమన్లు
- WACRA అనగా
  గ్రామీణ ప్రాంతాలలో మహిళా శిశు అభివృద్ధి పథకం
- 'లివర్ పూల్' రేవు నగరం గల దేశం ఏది?
  యునైటెడ్ కింగ్ డమ్
- జాన్ గూటెన్ బర్గ్ కనిపెట్టినది
  అచ్చుయంత్రం
- 'స్వర్ణ జయంతి షహరి రోజ్ గార్ యోజన' ఎప్పుడు ప్రారంభించబడింది?
  1997
- విద్యుత్ ఎలా ప్రవహిస్తుంది?
  పొటన్షియల్ నుండి తక్కువ పొటన్షియల్ కు
- నిజాంసాగర్ ప్రాజెక్ట్ గల నది ఏది?
  మంజీర
- నిత్యావసర వస్తువుల చట్టం చేయబడిన సంవత్సరం
  1955
- సామ్రాజ్యవాదానికి ముఖ్య ఆధారం:
  పారిశ్రామిక విప్లవం
- చిత్రావతి ఏ నదికి ఉపనది
  పెన్నా
- గాంధార శిల్పకళ ఇతని కాలం నాటిది:
  నిష్కుడు.
- ఉత్తరాఖండ రాజధాని :
  డెహ్రాడూన్
- వరల్డ్ జస్టిస్ ప్రాజెక్టు(డబ్ల్యుజెపి) స్వేచ్ఛాయుత ప్రభుత్వాల సూచీ 2015లో భారత్ స్థానం?
  37
- ప్రతిష్టాత్మక ఆర్బీసీ ప్రైజ్ 2015ను గెలుచుకున్న 'దె లెఫ్ట్ అజ్ ఎవ్రిథింగ్' పుస్తక రచయిత్రి?
  ఫ్లమ్ జాన్సన్
- 62వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో జాతీయ ఉత్తమ చిత్రం పురస్కారాన్ని పొందింది?
  కోర్ట్
- 2015 జులై 25 నాటికి రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ ఎన్నేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు?
  మూడేళ్లు
- విధాన సభ నాయకుడు
  ముఖ్యమంత్రి
- కాంతి జనకానికి ఉదాహరణ
  సూర్యుడు
- 'దియోగర్ వైద్యనాథ్ దేవాలయం' ఏ రాష్ట్రంలో ఉంది?
  ఝార్ఖండ్
- 'ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్ షిప్ 2015'ను ఆగస్టులో ఎక్కడ నిర్వహించారు?
  కోపెన్‌హెగన్
- ప్రపంచ తల్లిపాల వారోత్సవం ఎప్పుడు?
  ఆగస్టు 17
- 2015 ఏప్రిల్లో ఏ హైకోర్టు శతవార్షిక వేడుకలను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రారంభించారు?
  పట్నా
- దేనిలో అడ్డంకులు ఏర్పడితే గుండెపోటు సంభవిస్తుంది?
  హృదయ ధమని
- స్టియరిక్ ఆమ్లం యొక్క వనరులు
  వెన్న
- విద్యుదయస్కాంతాలు తయారుచేయడానికి ఉపయోగించే పదార్థం
  మెత్తని ఇనుము
- సూర్యునికి అతి దగ్గరగా ఉన్న గ్రహం:
  బుధుడు
- సిపాయిల విప్లవకాలంనాటి గవర్నర్ జనరల్
  కానింగ్
- చలామణి నుంచి అదృశ్యమైన ఒక రూపాయి నోట్ల ముద్రణను కేంద్ర ప్రభుత్వం ఏ రోజు నుంచి తిరిగి ప్రారంభించింది?
  2015 జనవరి 1
- భారత మొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ ఏ రోజున ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశారు?
  1950 మార్చి 15
- భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ కంపెనీ ఇచట ఉంది
  శ్రీరామచంద్రాపురం

### ఎల్ఎండి నీళ్లు పక్క జిల్లాలకు..

# కరీంనగర్ ప్రజలకు కన్నీళ్లు

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**

**మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా**




**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్‌లోని తాగునీటిని ప్రక్క జిల్లాలకు తరలించి కరీంనగర్ ప్రజలకు కన్నీళ్లను మిగుల్చుతున్నారని, కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లోని చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పాటించుకోవడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. నగరంలో తాగునీటి ఎద్దడిని నివారించాలని, విలీన గ్రామాల్లోని కుంటలు, చెరువులను కాపాడాలని గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తాగునీటి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తలాపున నీళ్ళున్నా చేప దూపకు ఏడ్చినట్టు కరీంనగర్ లో మానేరు డ్యామ్ ఉన్నప్పటికీ ప్రజలు తాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎండాకాలంలో ప్రజలకు నీరందక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లల్లో నీరు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, నగర వ్యాప్తంగా ఎటు చూసినా, ఏ డివిజన్‌కు వెళ్లినా ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీరు కొనుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం అధికారులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వక పోవడమేనని, ఎమ్మెల్యే బిఆర్ఎస్, ఎంపి బిజెపిలకు చెందిన వారు కావడం, కాంగ్రెస్ పార్టీకి ప్రజాప్రతినిధి లేకపోవడం, నాయకుల, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేక నీటి ఎద్దడికి కారమవుతుందన్నారు, మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లోని చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేస్తున్నారని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ అధికారులు నగర ప్రజల తాగునీటి కష్టాలను తీర్చాలని, భూముల కబ్జాలను నిలువరించాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన మరిన్ని పోరాటాలు చేస్తామని శ్రీనివాస్ హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా నాయకులు న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, మచ్చ రమేష్, బాకం ఆంజనేయులు, గామినేని సత్యం చెంచల మురళి, నగునూరి రమేష్, కాల్వ శ్రీనివాస్, ఇ.భారతి, కేంసారం శ్రీనివాస్, అల్లేపు రాజు, నునావత్ శ్రీనివాస్, మామిడిపల్లి హేమంత్ కుమార్, మమత, స్రవంతి, దానవేణి రమేష్, రాజయ్యతో పాటు పెద్దఎత్తున సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.



### పేదలకు పట్టాలివ్వాలని దశలవారీగా

# వామపక్షాల ఉద్యమం




**సిపిఐ, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శులు భిక్షపతి, ప్రభాకర్‌రెడ్డి**

**ప్రజాపక్షం/హనుమకొండ :** పేదల ఇళ్ళ స్థలాల సాధనకు దశల వారీగా ఉద్యమం చేపట్టనున్నట్లు సిపిఐ, సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శులు కర్రె భిక్షపతి, గాదె ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేదల గుడిసెల కూల్చివేతలపై ఈనెల 27న హనుమకొండలోని ఏకశిలా పార్కు నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పదివేల మందితో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొననున్నట్లు తెలిపారు. జూలై 1న హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట పికెటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఇండ్ల కూల్చివేతను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళే విధంగా జూలై 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. హనుమకొండలో గోపాల్ పూర్ చెరువు సుందరీకరణ పేరుతో 200 మంది పేదల గుడిసెలను కూల్చి వేశారని, గుడిసెవాసులకు పట్టాలివ్వాలని ఈనెల 19న కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేసిన మరునాడే గుండ్ల సింగారంలో 360 మంది పేదల ఇళ్ళను కూల్చి వేశారన్నారు. రోజురోజుకు నగరం విస్తీర్ణం పెరుగుతున్న క్రమంలో గ్రామీణప్రాంతాల నుంచి వలస వచ్చి కూలీ, నాలీ చేసుకుని జీవించే వారు ఇండ్లలో కిరాయిలు కట్టలేని పరిస్థితిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. వామపక్షాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలలో పేదలు పెద్దఎత్తున పాల్గొని నిరసన తెలపాలని వారు కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్.అశోక్‌స్టాలిన్, మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, సిపిఎం నాయకులు ఎం.చుక్కయ్య, రాగుల రమేశ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుంచి సిపిఐలోకి చేరికలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని పుటానితండా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సిపిఐలో చేరారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ కిషన్, బానోత్ పవన్‌లు సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ పార్టీలో నూతనంగా చేరిన వారు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పార్టీ చేపడుతున్న పోరాటాలతో సిపిఐలో చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీలో నూతనంగా చేరిన వారు రజబ్‌అలీ స్ఫూర్తితో మండలంలో సిపిఐ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల రమేష్, మండల సమితి సభ్యులు బానోత్ నాగేశ్వరరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కొల్లగొడుతున్న కేంద్రం

**ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి**




**ప్రజాపక్షం/వరంగల్ :** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని, కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కొల్లగొడుతుందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్‌ల్లో ఎఐటియుసి వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన గురువారం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని, పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయన్నారు. ఎన్డీఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల కింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, కార్మిక చట్టాల సవరణ ఇప్పుడు అత్యంత వేగంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని దీనిని ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. పాలకులు కార్మికులను కాదని యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నాయని శ్రమకు తగిన వేతనం ఇప్పించడంలో విఫలమవుతున్నాయన్నారు. గతంలో కార్మిక చట్టాలు అత్యంత పదునుగా ఉండడంతో శ్రమకు తగిన రీతిలో కాకపోయినా కనీసం సగమైనా వేతనం లభించేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్మికుల సంక్షేమాన్ని చూడాల్సిన పాలకులు యాజమాన్యాల సంక్షేమాన్ని చూస్తున్నారని, యాజమాన్యాలకు వేల కోట్ల రాయితీలు ప్రకటిస్తున్నా ప్రభుత్వాలు కార్మికుల గురించి ఆలోచించడం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల కార్మికులు, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధాం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పనాస ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గుంపల్లి మునీశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శులు దామెర కృష్ణ, తాళ్లపల్లి జాన్ పాల్, ఇప్పుల రవి, నాయకులు ఎండి అక్బర్, సంద్ర కుమార్, మియాపురం గోవర్ధన్, చిరంజీవి, స్వామి, పకీర్ తదితరులు పాల్గొన్నారు

### మిషన్ భగీరథ

## కార్మికుల వేతనాలు చెల్లించాలి

**ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఉపేందర్ డిమాండ్**

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కాగజ్ నగర్‌లోని మిషన్ భగీరథ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ముందు గురువారం నిరసన తెలిపారు. అనంతరం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో పాటు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలనాధికారి రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ వేతనాలను కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమై కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ బాలేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంసద్, జిల్లా ప్రధాన కార్యదర్శి షకీర్, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల మధ్య సఖ్యతకు, ఐక్యతకు వారధిగా మొహర్రం : సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** త్యాగనిరతికి, అనిర్వచనీయ సహనానికి మొహర్రం ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని సంస్మరణగా మొహర్రం జరుపుకుంటారని, తరతరాలుగా తెలంగాణ గ్రామాల్లో హిందూ ముస్లింలు కలిసి పీర్ల ఊరేగింపు నిర్వహిస్తారని సిఎం గుర్తు చేసుకున్నారు. ఈ సంస్కృతి తెలంగాణ ప్రాంతంలో గంగా జమునా తెహజీబ్ విధానానికి గొప్ప నిదర్శనమని చెప్పారు. మొహర్రం సందర్భంగా రాష్ట్రంలో హిందూ ముస్లింలు ఐక్యంగా శాంతియుతంగా పీర్ల ఊరేగింపు నిర్వహించుకోవాలని సిఎం కోరారు. తెలంగాణ ప్రాంతంలో కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య సఖ్యతకు, ఐక్యతకు వారధిగా మొహర్రం నిలుస్తుందని సిఎం రేవంత్ రెడ్డి ఒక సందేశంలో పునర్ ఉద్ఘాటించారు.

## త్యాగానికి ప్రతీక మొహర్రం : కెసిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధర్మం,సత్యం,త్యాగానికి ప్రతీకగా 'మొహర్రం' నిలుస్తుందని బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు అన్నారు. త్యాగానికి స్ఫూర్తిదాయకంగా ముస్లిం సహోదరులు మొహర్రంను జరుపుకుంటారని, పీరీల పండుగ పేరుతో తెలంగాణ ప్రజలు సహోదర భావంతో, కుల మతాలకు అతీతంగా పాల్గొంటారని కెసిఆర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సాహం విషాదం కలగలిపి దూలాలాడుతూ, నిప్పుల గుండం మీద నడుస్తూ..., మత సామరస్యాన్ని చాటుతూ పల్లె నుండి పట్నం వరకు పీరీల వేడుక,గంగా జమున సంస్కృతికి అద్దం పడుతుందని తెలిపారు.

## 'టిజి లా' కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ ఖరారు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 'లా' కోర్సుల్లో ప్రవేశాల కోసం 'టిజి లాసెట్, టిజి పిజి లాసెట్' కౌన్సెలింగ్ షెడ్యూల్ ఖరారైంది. మూడేళ్ళ, ఐదేళ్ళ ఎల్ఎల్బితో పాటురెండేళ్ళ ఎల్ఎల్ఎం కోర్సుల అడ్మిషన్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ను శుక్రవారం విడుదల చేయనున్నట్లు టిజిలా సెట్ ప్రవేశాల కన్వీనర్ ప్రొఫెసర్ బి. పాండురంగారెడ్డి గురువారం ప్రకటించారు. మూడు, ఐదేళ్ల ఎల్ఎల్బి కోర్సు అభ్యర్థులకు జూలై 5వ తేదీ నుంచి, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సు అభ్యర్థులకు జూలై 27వ తేదీ నుంచి ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు, ఐదు సంవత్సరాల ఎల్ఎల్బి కోర్సుల జాబితాలు కళాశాలల వారీగా జూలై 24న విడుదల చేస్తారు. ఆ మరుసటి రోజు 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అలాగే రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సు జాబితాను ఆగస్టు 5న విడుదల చేస్తారు. అదే రోజు నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు విద్యార్థులు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.

## తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ఏమైనా స్పష్టమైన హామీని సాధించారా?

### బిఆర్ఎస్ఎల్పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కర్నాటకలోని తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చినందుకు సంబురాలు చేసుకోవడం పక్కనపెట్టి, కృష్ణాజలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ఎల్పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. ఆర్డిఎస్నీటి వాటా విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపైన సిఎం రేవంత్ రెడ్డి ఏదైనా స్పష్టమైన హామీని సాధించారా అని గురువారం ఒక ప్రకటనలో హరీశ్రావు పేర్కొన్నారు. ఆంధ్రా వైపు ఉన్న ఆర్డిఎస్ తూములను శాశ్వతంగా మూసివేసేలా, ఆర్డిఎస్ ఆనకట్టకు మరమ్మతులు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించారా అని అన్నారు. కేవలం తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చినంత మాత్రాన తెలంగాణకు రావాల్సిన 15.90 టిఎంసిల నీరు ఎలా వస్తుందని, గత 75 ఏళ్లుగా పాత గేట్లు పనిచేస్తూనే ఉన్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. తెలంగాణకు ఏనాడూ 5 టిఎంసిలకు మించి నీళ్లు రాలేదన్నారు. తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చడానికీ, తెలంగాణకు దక్కాల్సిన 15.90 టిఎంసిల నీటి వాటాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ పరిమితికి మించి వాడుకుంటున్న తీరును రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు.

## మాదకద్రవ్యాలపై జైళ్ల శాఖ ఉక్కుపాదం

### 15,645 మంది ఖైదీలకు డీ-అడిక్షన్ సేవలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర జైళ్లలో మాదకద్రవ్యాల నిర్మూలనకు తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న చర్యలు మెరుగైన ఫలితాల దిశగా సాగుతున్నాయి. ఖైదీలను వ్యసనాల బారినుంచి బయటకు తీసుకురావడంతో పాటు వారిలో ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన 'నివృత్తి' డీఅడిక్షన్ కేంద్రాలు గత ఏడాదిలో 15,645 మంది ఖైదీలకు సేవలు అందించినట్లు జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా వెల్లడించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్రంలోని అన్ని జైళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ జైలులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సౌమ్య మిశ్రా 'నివృత్తి' డీఅడిక్షన్ సెంటర్ అధికారిక లోగోను ఆవిష్కరించి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. స్క్రీనింగ్లో గంజాయి వినియోగం అత్యధికంగా 1,563 కేసులుగా నమోదవగా, కల్తీ కల్లు వినియోగం 815 కేసులతో ఆందోళనకరంగా కనిపించింది. అదేవిధంగా సెడేటివ్ మాత్రలు, ఇంజెక్షన్లు, ఎండిఎంఎ, మెథాంఫెటమైన్, ఎల్ఎస్డి, కొకైన్, ఓపియాడ్స్ వినియోగానికి సంబంధించిన కేసులు కూడా గుర్తించారు. రాష్ట్రంలోని హైదరాబాద్, చెర్లపల్లి, నిజామాబాద్, సంగారెడ్డి కేంద్ర కారాగారాలు, మహిళల ప్రత్యేక జైలులోని డీఅడిక్షన్ కేంద్రాల్లో అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ కార్యక్రమాలు, ప్రేరణాత్మక ప్రసంగాలు, ప్రతిజ్ఞా స్వీకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఖైదీలు, జైలు సిబ్బంది మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ జైలులో జరిగిన కార్యక్రమంలో ఐజి జైళ్లు ఎన్. మురళీబాబు, సూపరింటెండెంట్ ఎన్. శివకుమార్ గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## టౌన్ప్లానింగ్లో బదిలీలు

### టిజిరెరా సెక్రటరీగా కె. శ్రీనివాస్

### జిహెచ్ఎంసి సిసిపిగా భవాని రాణి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రణాళిక శాఖలో కీలక అధికారుల బదిలీలు, నియామకాలకు ఆదేశాలు జారీ చేసింది. హెచ్ఎంసి డిఏ ప్లానింగ్ డైరెక్టర్ ఎం. భవాని రాణిని జిహెచ్ఎంసి చీఫ్ సిటీ ప్లానర్గా బదిలీ చేశారు. ఇప్పటివరకు జిహెచ్ఎంసి చీఫ్ సిటీ ప్లానర్గా పనిచేస్తున్న కె. శ్రీనివాస్ను తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టిజిరెరా) కార్యదర్శిగా నియమించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న ఖాళీ స్థానంలో ఆయనను పోస్టింగ్ ఇచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంబంధిత చర్యలను వెంటనే చేపట్టాలని హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులను విడుదల చేశారు.

# యువత ఆలోచనలు దేశ భవిష్యత్కు దిక్సూచి

### ఛాత్రోన్కి గూంజ్ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువత ఆలోచనలు దేశ భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తాయని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమస్యలపై విశ్లేషణాత్మక దృక్పథం, సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను ప్రతిపాదించే సామర్థ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే వేదికలను కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కల్పిస్తుందని తెలిపారు. హైదరాబాద్ నారాయణగూడలో డిసిసి అధ్యక్షులు మోతే రోహిత్ అధ్యక్షతన నిర్వహించిన 'ఛాత్రోన్కి గూంజ్' విద్యార్థి ప్రజెంటేషన్ కార్యక్రమానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు సామాజిక, విద్యా, సాంకేతిక, యువత అభివృద్ధి తదితర అంశాలపై తమ ఆలోచనలు, సూచనలు, వినూత్న ప్రతిపాదనలను ప్రజెంటేషన్ల రూపంలో వివరించారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, సమాజాభివృద్ధిపై వారి అవగాహనను ప్రతిబింబించే విధంగా ప్రదర్శనలు సాగాయి. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ మూలాలున్న వ్యక్తులే నీట్ పేపర్ లీక్కు కారణమన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే నీట్ పరీక్ష పేపర్ను లీక్ చేశారని ఆరోపించారు. పేపర్ లీక్ వల్ల 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల కష్టాన్ని, విద్యార్థుల శ్రమను పేపర్ లీకులు వమ్ము చేస్తున్నాయని మండిపడ్డారు. నీట్ అక్రమాలపై ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మౌనం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకం దెబ్బతింటోందని పేర్కొన్నారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని నొక్కి చెప్పారు.

విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, రాజస్థాన్ కోటలో రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కాపాడటం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని, దేశ యువత ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని మహేష్కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించిన ఆయన, వారి సూచనలు సమాజ నిర్మాణానికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి కార్మికుల పోరాట ఫలితమే క్యాజువల్ లీవులు, పండుగ సెలవుల అమలు

- సర్క్యులర్ జారీ చేసిన జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయం
- మహిళా కార్మికులకు 120 రోజుల ప్రసూతి సెలవులు
- యూనియన్ ఉద్యమాల ఫలితమే ఈ నిర్ణయం ఎఐటియుసి నేత వనంపల్లి జైపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల పోరాటానికి ఫలితం దక్కింది. కార్మికులకు సంవత్సరానికి 15 క్యాజువల్ లీవులు, జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయం సర్క్యులర్ జారీ చేసింది. ఈ నిర్ణయం కార్మిక సంఘాల నిరంతర పోరాట ఫలితమేనని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లకు క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు కల్పించాలంటూ యూనియన్ తరఫున చాలాకాలంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయం సర్క్యులర్ జారీ చేయడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. సర్క్యులర్ ప్రకారం జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు ఏడాదికి 15 రోజుల క్యాజువల్ లీవులు మంజూరు చేయనున్నారని, మహిళా కార్మికులకు 120 రోజుల ప్రసూతి సెలవులు కల్పించనున్నారని, అలాగే 8 జాతీయ, పండుగ సెలవులు కూడా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు తక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్లు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాల వల్లే ఈ నిర్ణయం సాధ్యమైందని జైపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల హక్కులను గుర్తించి సానుకూల నిర్ణయం తీసుకున్న జిహెచ్ఎంసి కమిషనర్, సంబంధిత అధికారులకు యూనియన్ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే సర్క్యులర్ జారీతో సరిపెట్టకుండా, ప్రకటించిన సెలవుల అమలు విషయంలో క్షేత్రస్థాయిలోనూ స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ ప్రయోజనాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అందేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.

## సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ఎజెండా

- అన్ని జిల్లాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అన్ని జిల్లాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి, యుపిఎస్సి, గ్రూప్ సర్వీసులు, ఇతర పోటీ పరీక్షల్లో విజయశాతాన్ని పెంచాలన్నారు. అంబేద్కర్ టవర్, బాబూ జగ్జీవన్ రామ్ విద్యార్థి వసతి భవనాల నిర్మాణానికి సంబంధించి నెలవారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను అదేశించారు. బహుళ అంతస్తుల అంబేద్కర్ భవనంను 2027 ఏప్రిల్ 14న ప్రారంభోత్సవం నిర్వహించేలా లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం బిసి, ఎస్సి, ఎస్టి డిపార్ట్మెంట్స్ సమీక్షా సమావేశం భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ప్రైవేట్ భవనాల్లో వసతి పొందుతున్న విద్యార్థులను సాధ్యమైనంత మేరకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు మార్చే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు హాస్టల్లో గురుకులాలలో మరమ్మతు పనులు ఒక నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే 2023 నుంచి పెండింగ్లో ఉన్న సుమారు రూ.7.5 కోట్ల మరమ్మతు బిల్లులను ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు సూచించారు. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ బిల్లులను క్రమం తప్పకుండా సమర్పించి క్లియరెన్స్ పొందాలని ఆయా శాఖల కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఉమెన్ చైల్డ్ డెవలప్మెంట్ కార్యదర్శి అనిత రామచంద్రన్, ఎస్సి డెవలప్మెంట్ కార్యదర్శి విజయేంద్ర బొయి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో స్కూల్ పిల్లలను తరలిస్తున్న ఆటోడ్రైవర్ అరెస్ట్

### హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో వెలుగులోకి ఘటన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాఠశాల విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, మద్యం మత్తులో స్కూల్ పిల్లలను తరలిస్తున్న ఓ ఆటో డ్రైవర్ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గోషామహల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఈ ఘటన వెలుగుచూసింది. సీనియర్ అధికారుల ఆదేశాల మేరకు జూన్ 24న ఉదయం 8 గంటల నుంచి గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (టిటిఐ) సమీపంలో స్కూల్ బస్సులు, స్కూల్ ఆటోరిక్షాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను సబ్ ఇన్స్పెక్టర్ డి. జగదీష్, హోంగార్డులు కిరణ్ కుమార్, సురేష్లతో కలిసి చేపట్టారు. ఉదయం 8.37 గంటల సమయంలో టిఎస్12యుఎ 9230 నంబర్ గల ఆటోరిక్షాను పోలీసులు తనిఖీ చేయగా, అందులో అబిడ్స్లోని స్లేట్ స్కూల్కు చెందిన ఆరుగురు చిన్నారులు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్ షేక్ ఇస్మాయిల్ (35) మద్యం సేవించినట్లు అనుమానం రావడంతో వెంటనే బ్రిత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో డ్రైవర్ రక్తంలో ఆల్కహాల్ శాతం (బిఎసి) 60 మిల్లీగ్రాములు/100 మిల్లీ లీటర్లుగా నమోదవడంతో, మద్యం మత్తులోనే వాణిజ్య వాహనం నడుపుతున్నట్లు నిర్ధారణ అయింది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించిన పోలీసులు, పిల్లల భద్రత దృష్ట్యా ఆటోను స్వాధీనం చేసుకుని డ్రైవర్ను గోషామహల్ లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై గోషామహల్ పోలీసులు క్రైమ్ నంబర్ 227/2026గా కేసు నమోదు చేసి, బిఎన్ఎస్ సెక్షన్ 125, మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185(ఎ), 130/177 కింద న్యాయపరమైన చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్కూల్ పిల్లలను తరలించే డ్రైవర్లు సహా అన్ని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## తెలంగాణ ఎక్సైజ్ శాఖలో భారీ బదిలీలు

### 68 మంది అధికారులకు స్థానచలనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. శాఖలోని వివిధ కేడర్లకు చెందిన మొత్తం 68 మంది ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ (ఎక్సైజ్1) శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎం. రఘునందన్ రావు మూడు వేర్వేరు జిఓలను విడుదల చేశారు. బదిలీ అయిన అధికారులు అందరూ తక్షణమే తమకు కేటాయించిన కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించి, ఆ నివేదికను సమర్పించాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి. హరి కిరణ్ ఆదేశించారు.

**డిప్యూటీ కమిషనర్ల (డిసి) బదిలీలు**

ఈ బదిలీలలో భాగంగా 14 మంది డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కలిగింది. మెదక్ డిసిగా ఉన్న జె. హరికిషన్ను సైబరాబాద్కు, నల్గొండ డిసి ఎ. శ్రీనివాస్ రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్కు బదిలీ చేశారు. రంగారెడ్డి డిసి పి. దాశరథను టిజిబిసిఎల్కు, ఖమ్మం డిసి జి. జనార్ధన్ రెడ్డిని ఆదిలాబాద్కు, టిజిబిసిఎల్ (ఆర్ఆర్ఐ)లో ఉన్న హెచ్. దాతురాజ్ గౌడ్ను వరంగల్ డిసిగా నియమించారు. అలాగే నిజామాబాద్ ఎసిగా ఉన్న వి.సోమి రెడ్డికి ప్రమోషన్ కల్పించి బదిలీపై ఖమ్మం డిసిగా బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ టిజిబిసిఎల్ మేనేజర్ జె. రవి కుమార్ను కరీంనగర్ డిసిగా, ఎసి (లేబుల్స్) పి. శ్రీధర్ను నిజామాబాద్ డిసిగా, హెడ్క్వార్టర్స్ డిసి కె. రఘురామ్ను రంగారెడ్డి డిసిగా మార్చారు. హైదరాబాద్ ఎసిగా ఉన్న ఎ.అనిల్ కుమార్ రెడ్డిని జాయింట్ డైరెక్టర్ (ఈస్ట్)గా, ఎస్టిఎఫ్ ఎసి పి.ప్రణవిని మల్కాజిగిరి డిసిగా, మహబూబ్నగర్ ఎసి ఎ.విజయ్ భాస్కర్ రెడ్డిని అక్కడే మహబూబ్నగర్ డిసిగా, బ్రేవరీస్ ఎసి ఎ. చంద్రయ్యను మెదక్ డిసిగా నియమించగా, ఈస్ట్ జాయింట్ డైరెక్టర్గా ఉన్న సి.వి. శశిధర్ రెడ్డిని నల్గొండ డిసిగా బదిలీ చేశారు.

## 'పది'అడ్వాన్స్డ్ పరీక్షలో 82.61% ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలో 82.61 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష ఫలితాలను హైదరాబాద్లోని పాఠశాల విద్యా సంచాలకుల కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కె.లింగయ్య గురువారం విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 27,857 మంది పరీక్షలు రాయగా, 23.013 మంది ఉత్తీర్ణులయ్యారు. 17,568 మంది బాలురు పరీక్ష రాయగా, 14,281 (81.29 శాతం), 10,289 మంది బాలికలు పరీక్ష రాయగా 8,732 మంది (84.87 శాతం) ఉత్తీర్ణులయ్యారు. కాగా జయశంకర్ భూపాలపల్లి, సిద్ధిపేట, ములుగు జిల్లాలు వంద శాతం ఫలితాలను సాధించగా, వికారాబాద్ జిల్లా 44.43 శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

## వాగన్ డిజైన్ విధానంలో సంస్కరణలు.. పరిశ్రమలకు స్వేచ్ఛ

### 15 రోజుల్లో కొత్త విధానం విడుదలకు రైల్వే మంత్రిత్వ శాఖ సన్నాహాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ రైల్వేల్లో సరుకు రవాణా సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. వాగన్ డిజైన్ విధానంలో సమగ్ర సంస్కరణలను అమలు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో కొత్త వాగన్ డిజైన్ పాలసీని వచ్చే 15 రోజుల్లో విడుదల చేయాలని కేంద్ర రైల్వే మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి ముందు సంస్కరణలపై కేంద్ర రైల్వే మంత్రి సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వాగన్లను స్వయంగా రూపకల్పన చేసుకునే అవకాశం కల్పించడమే ఈ విధానం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. దీంతో వివిధ రంగాల పరిశ్రమలు తమ సరుకు రవాణా అవసరాలకు తగిన ప్రత్యేక వాగన్లను అభివృద్ధి చేసుకునే వెసులుబాటు పొందనున్నాయి. డిజైన్ ఆమోదం, ప్రోటోటైప్ తయారీ ప్రక్రియలకు కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రమాణాల ద్వారా దేశంలో అత్యుత్తమ నాణ్యత కలిగిన వాగన్ల తయారీకి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. రైల్వే సరుకు రవాణా రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు రవాణా సామర్థ్యాన్ని పెంచడంలో ఈ కొత్త విధానం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు భావిస్తున్నారు. పరిశ్రమలు, తయారీ సంస్థలు, లాజిస్టిక్స్ రంగానికి ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చనుందని రైల్వే శాఖ పేర్కొంది.

# రూ. 107 కోట్లతో మరో 4 చెరువుల పునరుద్ధరణ

### శంకుస్థాపన పనులు ప్రారంభించిన.. హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో వరదల కట్టడితో పాటు భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా హైడ్రా మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐటీ కారిడార్కు సమీపంలో ఉన్న మరో 4 చెరువుల పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ గురువారం అధికారికంగా ప్రారంభించారు. రాజేంద్రనగర్ మండలం ఇబ్రహీంబాగ్ లోని ఇబ్రహీం పెద్ద చెరువు, కూకట్పల్లి మండలం మూసాపేటలోని కాముని చెరువుల వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెరువుల్లో పూడికను పూర్తిగా తొలగించి, దుర్గంధం రాకుండా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. వరద నీరు సాఫీగా వచ్చి చేరేలా ఇన్లెట్లు, బయటకు వెళ్లేలా ఔట్లెట్లను ఆధునీకరిస్తామన్నారు. మొదటి విడతలో 6 చెరువులను అభివృద్ధి చేసిన తరహాలోనే, రెండో విడతలో భాగంగా చేపట్టిన 14 చెరువులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతామన్నారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్లు, ఓపెన్ జిమ్లు, పిల్లల ప్లే ఏరియాలను ఏర్పాటు చేసి వీటిని పర్యాటక కేంద్రాలుగా మారుస్తామని, పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ ద్వారా బోటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామని తెలిపారు. ఈ పనుల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మురుగు, దోమల సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వానికి, హైడ్రాకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

**చెరువుల విస్తీర్ణం – కేటాయించిన నిధుల వివరాలు..**

- కాప్రా చెరువు (112 ఎకరాలు): రూ. 35 కోట్లు
- ఇబ్రహీం పెద్ద చెరువు (97 ఎకరాలు): రూ. 29 కోట్లు
- భగీరథమ్మ చెరువు (54 ఎకరాలు): రూ. 22 కోట్లు
- కాముని చెరువు (48 ఎకరాలు): రూ. 21 కోట్లు

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎం.ఋషేంద్రమణి తెలిపారు. గురువారం ఆలగడప రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాలో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నోటిఫై చేసిన సన్నరకం వరి వంగడాలైన ఆర్ఎన్ఆర్15048, బిపిటి 5204, కెఎన్ఎం1638, హెచ్ఎంటి సోనా, డబ్ల్యుజిఎల్44, కేఎన్ఎం 7715, జై శ్రీరామ్ రకాలను రైతులకు పరిచయం చేశారు. పంటల దిగుబడిని పెంచడంలో నానో యూరియా, నానో డిఎపివినియోగం ప్రయోజనకరంగా ఉంటుందని ఆమె రైతులకు వివరించారు. రైతు భరోసా2026 పథకానికి సంబంధించి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి కె.ఎం. అఫ్రిన్, సర్పంచ్‌లు ఇంద్రపల్లి కుమారి, వెల్దాస్ సుజాత, రైతులు బచ్చిరెడ్డి, సోమయ్య, శ్రీకాంత్, వంశీ, రంగారెడ్డి, వికాస్, మొగలరాల వీరయ్యపాల్గొన్నారు.

## సిరిపురంలో 'సర్' ప్రక్రియ ప్రారంభం



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఎంపిక సర్వేను గురువారం సర్పంచ్ వెంపటి రామారావు ప్రారంభించారు. బిఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి అన్యూమరేషన్ ఫారాలను అందజేసి ఎలా పూర్తి చేయాలో వివరిస్తున్నారు. పూర్తి చేసిన ఫారాలను జూలై 24వ తేదీలోపు తమకు అందజేయాలని సూచించారు. మండల అధికారి ఉపేందర్, జూనియర్ అసిస్టెంట్ శరత్, జిపివో ఇమామ్, ఉప సర్పంచ్ కె.రమేష్, వార్డు సభ్యులు పా ల్గొన్నారు.

## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్రంలో జూన్ 22 నుండి 26 వరకు మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన వారం జరగనున్నదని ఈ వారం ముగింపులో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నారని హుజూర్‌నగర్ సబ్ జైలర్ గౌతమ్ తెలిపారు. గురువారం సబ్ జైలు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు, సిబ్బంది సమక్షంలో పోస్టర్లను ఆవిష్కరించారరు. సబ్ జైలర్ గౌతమ్ ఆధ్వర్యంలో సబ్ జైలుఉలోని సమస్త ఖైదీలు, సిబ్బంది మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని మాదక ద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్య దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్ర వ్యాప్త జన చైతన్య యాత్ర




**ప్రజాపక్షం/మునగాల:** గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్ర వ్యాప్త జన చైతన్యయాత్రను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గణపవరం ఫ్లైఓవర్‌లో ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర సూర్యాపేట నుండి మొదలు పెట్టానని, యువత ఎక్కువగా గంజాయి, డ్రగ్స్ బారీన పడి వారి బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, బెట్టింగ్ యాప్‌లలో ఎంతోమంది డబ్బులు పొగొట్టుకున్నారని, కొంతమంది యాప్‌లో డబ్బులు పొగొట్టుకున్న వారు తమ ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు కోసం తాను రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

## నార్కొటిక్ డాగ్స్ స్క్వాడ్‌తో గరిడేపల్లిలో ముమ్మర తనిఖీలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని డ్రగ్స్ గంజాయి మహమ్మారిని నిర్మూలించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. గురువారం నార్కొటిక్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి గరిడేపల్లి మండల కేంద్రం, పరిసర గ్రామాల్లో పలు ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. యువత విద్యార్థులు భవిష్యత్‌ను నాశనం చేస్తున్న మత్తు పదార్థాల కదలికలపై నిఘా ఉంచేందుకు ఈ తనిఖీలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని హోటళ్లు, ప్రైవేట్, ప్రభుత్వ హాస్టళ్లు పాఠశాలల పరిసరాలు, టీస్టాళ్లు, కిరణ దుకాణాలలో నార్కొటిక్ డాగ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మత్తు పదార్థాల విక్రయాలు జరిపినా, రవాణా చేసిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి ఇతర డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్న వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా యువత

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్





**ప్రజాపక్షం/సూర్యాపేట:** యువత సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల బానిసత్వానికి దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా పోలీస్, ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల హాల్‌లో జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి కె. నరసింహ, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరమణ, డిఎస్‌పి ప్రసన్న కుమార్, సిఐ వెంకటయ్య, ఎక్సైజ్ అధికారులు, కళాశాల అధ్యాపకులు,మెడికల్,నర్సింగ్,ఇంటర్‌విద్యార్థులుపాల్గొన్నారు.

### సర్ ప్రక్రియ పరిశీలన

ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) ఇంటింటి సర్వే ప్రక్రియను సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించిన ఆయన, ప్రతి ఓటరకు రెండు ఫారాలు అందజేయడంతోపాటు బిఎల్‌ఒలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఓటరు వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సంబంధిత బిఎల్‌ఒకు తెలియజేసి సరిచేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే, కావాలని తప్పుడు సమాచారం అందించిన వారి విషయంలో ఫారంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడుతాయని స్పష్టం చేశారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్‌డిఒ వేణుమాధవరావు, డిప్యూటి తహసీల్దార్ లాలు, బిఎల్‌ఒ బంగారు పద్మ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

### డంపింగ్ యార్డులో వ్యర్థాల శుద్ధి ప్రక్రియ పరిశీలన

మండలంలోని బాలెంల గ్రామ పరిధిలో మున్సిపల్ డంపింగ్ యార్డును గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సందర్శించి తనిఖీ చేశారు. డంపింగ్ యార్డులో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఏ విధంగా శుద్ధి చేస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు పరిసరాల్లో పేరుకుపోయిన తడిచెత్తను త్వరగా శుద్ధి చేయాలని, ఎటువంటి చెత్తనిల్వ ఉండకుండా పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మున్సిపల్, ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వినియోగంలోకి ఆర్‌టిసి బస్టాండ్

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలను ఖర్చు చేసి ప్రతి మండల కేంద్రంలో ఆర్‌టిసి బస్టాండ్ ఉండాలనే లక్ష్యంతో ఉంటే, గరిడేపల్లి మండల కేంద్రంలో కూడా ఆర్‌టిసి బస్టాండ్ నిర్మించారని, కాని ఆర్‌టిసి సంస్థ వారు పట్టించుకోకపోవడం వల్ల ఆది నేడు శిథిలావస్థకు చేరిందని, వెంటనే దానిని మరమ్మతులు చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు ఆర్‌టిసి అధికారులను కోరారు. గురువారం మండల కేంద్రంలో సిపిఐ సమితి ఆధ్వర్యంలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ధర్నా చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా బస్సులను ఆపటం వల్ల ట్రాఫిక్ జామ్ అయ్యి యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, దీని వల్ల ప్రయాణికులు చాల ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు ఉపయోగంగా ఉండాల్సిన ఆర్‌టిసి బస్టాండ్ పడావు పడి, వేరే చోట్ల బస్సులను నిలపడం, ప్రజలకు చాల ఇబ్బందిగా ఉందని అన్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు మేల్కొని ఆర్‌టిసి బస్టాండ్‌ను వేరే వాళ్లు కబ్జా చేయకముందే దానిని ఉపయోగంలోకి తీసుకవచ్చి ప్రయాణికులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి బస్టాండ్‌ను ప్రయాణికులకు అనుకూలంగా తీర్చిదిద్ది బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలను కొనసాగించకుంటే మున్ముందు సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సుధాకర్, కుందురు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, ప్రతాని సైదులు, పంగ గోవింద్, గోదుమల ఈశ్వరచారి, ముండ్ల కోటయ్య, షేక్ పీర్‌సాహెబ్, నందిపాటి కాశయ్య, ఈదయ్య, నాగచారి, పంగా సైదులు, లింగరాజు పాల్గొన్నారు.

## 'సర్'పై బిఎల్‌ఎలకు అవగాహన



**ప్రజాపక్షం/గుండాల;** ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్‌ఏ)లకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో బిఎల్‌ఏలకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనందని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా రాజకీయ పార్టీలు, బిఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల విషయంలో నిబంధనలను పాటిస్తూ ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలో బిఎల్‌ఏలకు సూచనలు, సలహాలు, మార్గదర్శకాలపై సందేహాలను నివృత్తి చేసుకొని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో ప్రజలకు చేరవేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, సర్పంచ్‌లు ఐలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, ఉపేందర్, నాగిరెడ్డి, కొండమ్మ, ఉపసర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తత



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ము న్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ పట్ల స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించామన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులపై ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన మందులు, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మున్సిపల్ సిబ్బందితో పారిశుద్ధ్య నివారణ చర్యలకు కృషి చేస్తామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈనెల 28న ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్నిన ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైద్యాధికారిణి నాగిని, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మండల అధికారులు, ఎంఈవో, రెవిన్యూ ఐసిడిఎస్, మార్కెట్ వైస్ చైర్మన్ , వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి



**ప్రజాపక్షం/చింతలపాలెం :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యో ధుడు, సిపిఐ పార్టీ సీనియర్ నాయకు లు అమరజీవి కామ్రేడ్ ఉస్తెల వీరారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యక ర్త కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. గురువారం వీరారెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సోమిరెడ్డి వెంకటరెడ్డి స్మారక భవనం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ ఆనాడు రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం ఎర్రజెండా చేతబట్టి పోరాటాలు చేసిన విప్లవ యో ధుడు వీరారెడ్డి అని గుర్తు చేశారు. చివరి శ్వాస వరకు తన రాజకీయ జీవితంలో ఎర్ర జెండాను నమ్ముకొని సిపిఐ పార్టీలోనే కొనసాగిన గొప్ప వ్యక్తి అని ఆయన చూ పిన బాటలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామ కార్యదర్శి గంధం మంగయ్య, సిపిఐ మ ండల నాయకులు చిత్తలూరి వీర బాబు, షేక్ అబ్దుల్ భాష, తాలూరి సత్యం, భీ మ్‌శెట్టి సత్యం, దొంగల అంకరాజు, భీ మిశెట్టి పద్మ, చిలక ఏసు, గంధం కొ ండలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్మిక, కుల సంఘాల నాయకులు పాల్గొని నివాళు లర్పించారు.

## మొదలైన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా (సర్)ఇంటింటి సర్వే కార్యక్రమం గురువారం మున్సిపాలిటీ లో మొదలైంది. శిక్షణ పూర్తి చేసుకున్న బిఎల్‌ఒలు ఇం టింటి సర్వే కార్యక్రమంలో పాల్గొని ఓటర్ల సమగ్ర సమాచార న మోదు చేపడుతున్నారు. అర్హులైన ఓటరు జాబితా నుండి త ప్పించుకోకూడదని అనర్హులైన వారు ఓటర్ల జాబితాలో ఉండకూడదని ఈ సర్వే చేపడుతున్నారు. బిఎల్ వోలు ప్రతి ఇంటికి మూడు దఫాలుగా వస్తారు.మొదటి సారి ఫారంలు ఇచ్చి వెళ్లి పూర్తి చేసిన ఫారాలను మళ్ళీ తీసుకెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని ధ్రువీకరించుకుని ఓటర్ల తుది జాబితాను సవరించి ప్రత్యేక సమగ్ర జాబితా విడుదల చేస్తారు. ఇంటింటి సర్వేలో పాల్గొని బిఎల్‌ఓ లకు కుటుంబ సభ్యులు సరియైన వివరాలు అందజేసి సహకరించాలని కోరారు. ఈ ఇంటింటి సర్వే ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం వచ్చే నెల 24 వరకు కొనసాగనుంది. మొదటి రోజు కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ తాసిల్దారు నాగేశ్వరరావు రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్ రావు సత్యనారాయణ రెడ్డి సర్వేయర్ సాయి మండల రెవెన్యూ సిబ్బంది బి ఎల్ ఓ లు బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## గగన వీధిలో త్రివర్ణ శోభ..

### విజ్ఞాన్స్ క్యాంపస్‌లో వంద అడుగుల జాతీయ జెండా



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాల స్ఫూర్తిని రగిలించేలా యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలో గురువారం 100 అడుగుల ఎత్తైన భారత జాతీయ జెండాను ఆవిష్కరించారు. 20 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో రూపొందించిన ఈ భారీ జాతీయ జెండా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసినట్లు విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య తెలిపారు.గగనతలంలో రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం విజ్ఞాన్స్ క్యాంపస్‌కు మరింత గౌరవాన్ని, ప్రత్యేకతను తీసుకొచ్చిందని విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు అభిప్రాయపడ్డారు. క్యాంపస్లో ఇంతటి ప్రతిష్టాత్మకమైన భారీ జాతీయ పతాకం రెపరెపలాడటంతో ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/-చండూరు:** మున్సిపాలిటీ పరిధిలో 16 కోట్ల 25 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 15 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ ,కమ్యూనిటీ హాల్ వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి సెంట్రల్ డివైడర్ లో మొక్కలు నాటారు.అనంతరం చండూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో 1 కోటి 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న మార్కెట్ కార్యాలయ నూతన భవనానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం చండూరు మండల వ్యాప్తంగా మెదటి విడతలో మంజూరు అయిన ఇందిరమ్మ గృహాలను కట్టుకోలేని వారి స్థానంలో అదే గ్రామాలకు చెందిన నిరుపేదలకు చండూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తో కలిసి 20 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాల మంజూరి పత్రాలను పంపిణీ అందజేశారు . ఇటీవల కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడి గా ఎన్నికైన మేకల సాగర్ రెడ్డి, ఐతరాజు మల్లేష్ కు రాజగోపాల్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు,వైస్ చైర్మన్ బూత రాజు దశరథ, మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, వైస్ చైర్మన్ పోలు వెంకట్ రెడ్డి , కౌన్సిలర్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య,మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 28న సిఎం బహిరంగ సభ

### ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాక సందర్భంగా ఈ నెల 28న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్.జి. కళాశాల మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన నల్లగొండ పట్టణంలోని ఎన్.జి. కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, వాహన పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదతర అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభా ప్రాంగణం చుట్టూ బలమైన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ఇరువైపులా ఎల్ఇడితెరలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కళాకారుల కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయాలని, మైదానం మొత్తాన్ని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు.మైదానం మొత్తాన్ని రోలింగ్ చేసి తీర్చిదిద్దాలని, పరిసర ప్రాంతాల్లో గుంతలు లేకుండా చూడాలని సూచించారు.ముఖ్యమంత్రి ప్రసంగించే ప్రధాన వేదికను ఎత్తుగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, తహసీల్దార్ పరశురాం, ఇతర అధికారులు ఉన్నారు.

## నాలుగు హత్యల కేసులో వీడిన మిస్టరీ!

**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన నల్లగొండ పట్టణంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు హత్యకు గురైన కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం.పోలీసు విచారణలో వె ల్లడైన ప్రాథమిక సమాచారం మేరకు, మృతురాలు హసీనా మొదటి భర్తకు జన్మించిన కూతురు, ఆమె భర్త ఈ హత్యల వెనుక ప్రధాన పాత్ర పోషించిన ట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. హసీనా పేరిట సుమారు రూ.కోటి విలువైన ఆస్తులు ఉండగా,ఆఆస్తిని మొదటి భర్త సంతానానికి కాకుండా ప్రస్తుత భర్త సుల్తాన్ పిల్లలకు ఇవ్వాలని నిర్ణయించుకోవడమే వివాదానికి దారితీసినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో కూతురు,అల్లుడు కలిసి కుట్ర పన్ని హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతానికి చెందిన నలుగురు రౌడీషీటర్లకు భారీ మొత్తంలో సుపారీ ఇచ్చి హత్యలు చేయించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. గతంలో ఇంట్లో జరిగిన దొంగతనం ఘటన వెనుక కూడా ఇదే వర్గం ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం.ఈ నెల 22న జరిగిన ఈ దారుణ ఘటనలో సుల్తాన్ (45),హసీనా (40),కుమారుడు ముజమ్మిల్ (20),కుమార్తె అక్సర (11)లను అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైనట్లు తెలుస్తోంది.సుల్తాన్‌పై 6 కత్తిపోట్లు,హసీనాపై 7,ముజమ్మిల్‌పై 16 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు.భయంతో మంచం కింద దాక్కున్న అక్సరను కూడా బయటకు లాగి 9 కత్తిపోట్లు పొడిచి హత్య చేసినట్లు సమాచారం.ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సుపారీ గ్యాంగ్‌తో పాటు ఈ హత్యాకాండ వెనుక మరెవరి ప్రమేయం ఉందన్న కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కలయికలో రాబోతున్న చిత్రం ఎన్ బికె 112 షూటింగ్ ప్రారంభమైంది. అమరావతిలో గురువారం జరిగిన పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైంది. ఎస్ ఎల్ వి సినిమాస్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# రీల్



## మా అబ్బాయిని ఆశీర్వదించండి

### సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్

ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ కుమారుడు తెలుగు తెరపై హీరోగా పరిచయం అవుతున్నారు. సురవి విజన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ గురువారం ఫిలిం నగర్ లోని దైవ సన్నిధానంలో పూజ కార్యక్రమాలతో ప్రారంభమైంది. దర్శకుడు దాలి (కిషోర్ కుమార్) క్లాప్ కొట్టి మొదటి షాట్ కు దర్శకత్వం వహించారు. నిర్మాత నల్లమలుపు బుజ్జి స్క్రిప్ట్ ను అందజేయగా, గంట రవితేజ కెమెరా స్విచాన్ చేశారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ వందల సినిమాలకు సంగీతం అందించిన నన్ను ఎలా అయితే ఆదరించారో ఇప్పుడు మా అబ్బాయిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. నేటి యువతకు ఏం కావాలి అనే అంశాలతో అందరినీ ఆకట్టుకునే విధంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని చెప్పారు. హీరోగా పరిచయం అవుతున్న సున్నర తరుణ్ (వందేమాతరం శ్రీనివాస్ కుమారుడు) మాట్లాడుతూ సినిమాలో నటించడంతో పాటు యాక్షన్ అంశాలలో కూడా శిక్షణ తీసుకున్నానని చెప్పారు. ఈ కథ చాలా బాగా వచ్చిందని అన్నారు. ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుందని వివరించారు. దర్శకుడు వీరేష్ మాట్లాడుతూ యాక్షన్, సెంటిమెంట్, లవ్, ఇలా అన్ని అంశాలతో కూడిన వినోదాత్మకమైన కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ లో అధిక శాతం షూటింగ్ జరుగుతుందని, రెగ్యులర్ గా షూటింగ్ కొనసాగిస్తామని అన్నారు. నిర్మాత నల్లమలుపు బుజ్జి మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ కు చెందిన దివ్యని హీరోయిన్ గా పరిచయమవుతున్న ఈ సినిమాకు కేరళ సంగీత దర్శకుడు బిబిన్ అశోక్ సంగీతం అందిస్తున్నారు.

## 'ఇట్స్ లైఫ్ బ్రో' ఫస్ట్ లుక్ విడుదల



కేఎం (కృష్ణమోహన్), పూజా సుందర్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ లైఫ్ బ్రో'. కేఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సోమశేఖర్ రెడ్డి దర్శకత్వంలో కృష్ణ మోహన్ నల్లగొండ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎమోషనల్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను హీరో నితిన్ విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ' వైవిధ్యమైన కథ, కథనాలతో ఎమోషనల్ లవ్‌స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రం అందరి హృదయాలను హత్తుకునే విధంగా ఉంటుంది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ భావోద్వేగ ప్రేమకథ అందరికి తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. కృష్ణమోహన్, పూజా సుందర్ శెట్టి, రాజీవ్ కనకాల, చమ్మక్ చంద్ర, అంబటి శ్రీనివాస్, దేవి ప్రసాద్, కిరీటి, త్రిశూల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే: ఇ. రాజయ్య, డీఓపీ: చైతన్య, సంగీతం: సాహిత్య సాగర్, ఎడిటర్: సత్య గిద్దటూరి .

## ఫోక్ డ్యాన్సర్ నాగ దుర్గ హీరోయిన్ గా
# 'ఇడుపు కాయితం' సినిమా షురూ

* నిర్మాతగా మారిన సుకుమార్ భార్య తబిత


తెలంగాణ జానపద పాటలపై డ్యాన్స్ చేస్తూ యూట్యూబ్ లో సంచలనంగా మారిన డ్యాన్సర్ నాగ దుర్గ. ఇప్పుడు ఈమె పెద్ద తెరమీద హీరోయిన్ గా కనిపించబోతోంది. బలగం ఫేమ్ ప్రియదర్శి సరసన నాగ దుర్గ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. ఇడుపు కాయితం' సినిమాతో నాగ దుర్గ హీరోయిన్ గా పరిచయమవుతున్న ఈ సినిమా షూటింగ్ గురువారం అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా ప్రారంభమైంది. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రొడ్యూసర్ బన్నీ వాస్, డైరెక్టర్ సుకుమార్ కలసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా 'ఇడుపు కాయితం' సినిమాను దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ప్రముఖ తమిళ దర్శకుడు దర్శకుడు లోకేష్ కనకరాజ్ పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, తెలంగాణ ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజు, నవీన్ యెర్నేని, కేఎల్ దామోదర ప్రసాద్, ఎస్ కేఎన్, బాపినీడు, ధీరజ్ మొగిలినేని, దర్శకులు మెహర్ రమేష్, చందూ మొండేటి, సాయి రాజేశ్, వేణు ఊడుగుల, సాయి మార్తాండ్ అతిథులుగా పాల్గొన్నారు. అల్లు అరవింద్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో డైరెక్టర్ వంశీకృష్ణ దొండపాటి మాట్లాడుతూ మా 'ఇడుపు కాయితం' సినిమా ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఈ కథ చెప్పగానే నమ్మి సినిమా చేస్తున్నామని గట్టిగా చెప్పిన మా ఆడబిడ్డ తబితకు థ్యాంక్స్. నమ్మితేనే ఎవరైనా పైకి వస్తారు. తబితకి, సుకుమార్ కి, బన్నీ వాస్,



దర్శి కి, వేణు ఊడుగుల, పూజారి నాగేశ్వరరావు, బూసం జగన్మోహన్ రెడ్డి గారికి థ్యాంక్స్ అని అన్నారు. నిర్మాత తబిత సుకుమార్ (సుకుమార్ భార్య) మాట్లాడుతూ నేను హైదరాబాద్ లో పుట్టి పెరిగాను. పక్కా తెలంగాణ అమ్మాయిని. మీరు ఈ కథకు కనెక్ట్ అవుతున్నారో లేదో గానీ నేను తెలంగాణ అమ్మాయిని కాబట్టి చాలా కనెక్ట్ అయ్యాను. మనం ఎలాగైనా సుకుమార్ రైటింగ్స్ లో ఈ సినిమా చేయాలని, మనం చేస్తున్నాం అంతే అని సుక్కుకు చెప్పాను. హీరోయిన్ నాగదుర్గ మాట్లాడుతూ యూట్యూబ్ లో నా పాటలు చూసి విని ఉంటారు. ఇప్పుడు 'ఇడుపు కాయితం' అనే మూవీతో మీ ముందుకు హీరోయిన్ గా వస్తున్నాను. ఇండస్ట్రీకి హీరోయిన్ గా రావాలని ఎంతోమంది అమ్మాయిలు కోరుకుంటారు. మీ అందరి సపోర్ట్ తో నాకు ఈ అవకాశం వచ్చింది. . హీరో ప్రియదర్శి మాట్లాడుతూ 'ఇడుపు కాయితం' సినిమాను మేము జమ్మికుంట, ఇల్లంతకుంట, . ఇది నా ఇంట్లో ఉన్న కథ. వంశీ ఈ కథ చెప్పినప్పుడు ఇది నా కథ అని నమ్మాను అన్నారు.ఈ చిత్రానికి సంగీతం సురేష్ బొబ్బిలి, నిర్మాతలు బన్నీ వాస్, తబిత సుకుమార్, ఆర్ట్ డైరెక్టర్ ఆశిష్ తేజ, ఎడిటర్ శ్రీధర్ సొంపల్లి డీవోపీ ఎంఎన్ బాల్ రెడ్డి, స్క్రిప్ట్, డైరెక్షన్ వంశీరెడ్డి దొండపాటి.

## మామయ్యకు క్లాప్ కొట్టిన అల్లుడు
# బాలకృష్ణ 112వ చిత్రం షూటింగ్ ప్రారంభం

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కలయికలో రాబోతున్న చిత్రం ఎన్ బి కె 112 షూటింగ్ ప్రారంభమైంది. అమరావతిలో గురువారం జరిగిన పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైంది. ఎస్ ఎల్ వి సినిమాస్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సినీ ప్రముఖులు సురేష్ బాబు, గోపీచంద్ మలినేని, వెంకట సతీష్ కిలారు, సాహు గారపాటి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. కందుల దుర్గేష్ కెమెరాను స్విచ్ ఆన్ చేయగా, నారా లోకేష్ క్లాప్ కొట్టారు. బాలకృష్ణ కుమార్తె నందమూరి తేజస్విని మొదటి షాట్కు గౌరవ దర్శకత్వం వహించారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ప్రజల రాజధాని అయిన అమరావతిలో చలన చిత్ర పరిశ్రమను బలంగా ప్రోత్సహించే లక్ష్యంతో మేము పనిచేస్తున్నాము. సినిమాతో పాటు 'క్రియేటర్ ఎకానమీ'ని ప్రోత్సహించడం ముఖ్యమంత్రి ఆశయం. దీనిని సాధించడానికి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యాధునిక ఫినిషింగ్ స్టూడియోలు, లేటెస్ట్ టెక్నాలజీతో కూడిన సౌకర్యాలను అభివృద్ధి చేయడం ద్వారా పరిశ్రమకు ఒక సుస్థిరమైన వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. నందమూరిబాలకృష్ణ మాట్లాడుతూ



కోట్లాది మంది అభిమానుల ప్రేమను, ఆప్యాయతను పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గే ష్ కి, అలాగే ప్రారంభ షాట్కు దర్శకత్వం వహించిన తేజస్విని కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్లో ఇంత భారీ స్థాయిలో ఒక సినిమా ప్రారంభోత్సవం జరిగి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తోంది. ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపిందని చెప్పారు. డైరెక్టర్ కొరటాల శివ మాట్లాడుతూ రచయితగా, దర్శకుడిగా మారకముందే, బాలకృష్ణ నటించిన సినిమాలకు సహాయ రచయితగా, సహాయ దర్శకుడిగా పనిచేసే అవకాశం నాకు లభించింది. బాలకృష్ణ కోసం ఒక సినిమాను రాసి, దర్శకత్వం వహించే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు.

## నాన్న విలువ తెలిపే కథ
# 'వెంకట్రామయ్య గారి తాలుకా'

ఈటీవి సీరియల్స్ తో పాపులర్ అయిన నటుడు ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ 'వెంకట్రామయ్య గారి తాలుకా' సినిమాతో హీరోయిన్ గా పరిచయం అవుతోంది. దినేష్ కుమార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల దర్శకత్వం వహిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం టీజర్ ను ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన ఈవెంట్ లో ప్రభాకర్ రిలీజ్ చేశారు. చరణ్ అర్జున్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. టీజర్ విడుదల అనంతరం బుల్లితెర నటుడు ప్రభాకర్ మాట్లాడుతూ తండ్రి విలువను తెలియజేసే కథతో ఈ చిత్రాన్ని రూపొందించారని అన్నారు. కొన్ని సన్నివేశాల్లో కన్నీళ్లు వస్తాయని చెప్పారు. నాన్న గురించి ఒక పాట గుండెలు పిండేస్తుందని పేర్కొన్నారు. ఈ సినిమాలో తన కూతురు హీరోయిన్‌గా నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో వంద సినిమాలు చేసినా వెంకట్రామయ్య గారి తాలుకా సినిమా గుర్తుండిపోతుందని చెప్పారు. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపునీ కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు. తల్లి తల్లిదండ్రుల గొప్పతనం తెలియచేసే సినిమా అని దర్శకుడు సతీష్ అన్నారు. తండ్రి పాత్రను పోషించిన



మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ ఎమోషన్ అయ్యారు. నిజజీవితంలో నాకు ముగ్గురు ఆడపిల్లలు, సినిమా కథలో కూడా ముగ్గురు ఆడపిల్లలే అని చెప్పారు. తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లల గురించి ఈ సినిమా చాలా చక్కగా తీశారని అన్నారు. అన్ని పనులు పూర్తి చేసుకుని త్వరలోనే ఈ సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత కోమలి తెలిపారు. ఈ చిత్రానికి కొరియోగ్రాఫర్: సాగర్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్: చరణ్ అర్జున్, కెమెరామెన్: బి. అనిల్ కుమార్, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్.

## ఆర్థిక ప్రణాళిక ఎంతో కీలకం

### ట్రైనీ పోలీసు అధికారులకు పెట్టుబడి మోసాలపై అవగాహన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెట్టుబడుల విషయంలో అప్రమత్తతతో పాటు ఆర్థిక ప్రణాళిక ఎంతో కీలకమని నిపుణులు సూచించారు. ఆర్థిక ప్రణాళిక, సురక్షిత పెట్టుబడులు, స్టాక్ మార్కెట్‌లో మోసాల నివారణపై ట్రైనీ పోలీసు అధికారుల్లో అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబి), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) సంయుక్త ఆధ్వర్యంలో రీజినల్ ఇన్వెస్టర్ సెమినార్ నిర్వహించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) కె.ఆర్.కె. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రైనీ డిఎస్పిలు, ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెబి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ మోహన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో ఆర్థిక ప్రణాళికకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలను అరికట్టడంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడమే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని పేర్కొన్నారు.

## ఓయూ రసాయన శాస్త్ర విభాగంలో
# అక్రమాలపై విచారణ జరపాలి

### ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పిహెచ్‌డి పరిశోధక విద్యార్థుల డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెలువడుతున్ననేపథ్యంలో దీనిపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్‌కాలేజ్ వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, రసాయన శాస్త్ర విభాగంలో ఒక పిహెచ్‌డి విద్యార్థికి డిజైన్ సెమినార్ నిర్వహించకుండానే పూర్వ తేదీతో నివేదిక జారీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఈ వ్యవహారంలో ఓయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. కృష్ణంరాజు పర్యవేక్షణలో ఉన్న విద్యార్థికి ప్రత్యేక మినహాయింపు ఇచ్చారని ఆరోపించారు. డిజైన్ సెమినార్లు పూర్తి చేయని సుమారు 80 మంది పిహెచ్‌డివిద్యార్థులను కట్‌ఆఫ్ తేదీ పేరుతో తదుపరి విద్యా ప్రక్రియలకు అనుమతించకపోయినా, ఒక విద్యార్థికి మాత్రం ప్రత్యేక అనుమతి ఇవ్వడం అనుమానాలకు తావిస్తోందన్నారు.ఈ ప్రక్రియలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ విజ్జులత, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయ్ కుమార్,



విషయ నిపుణుడు ప్రొఫెసర్ సక్ రామ్ పాత్రపై కూడా విచారణ జరపాలని కోరారు.ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ వెంటనే జోక్యం చేసుకుని ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించాలని, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ప్రొఫెసర్లను సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి ఐ. లెనిన్ మాట్లాడుతూ, ఈ ఆరోపణలు ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారాన్ని దుర్వినియోగం చేయడం సిగ్గుచేటాన్నారు. ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, లేకపోతే ఎఐఎస్ఎఫ్ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ఉప్పల్ ఉదయ్ కుమార్, ఆశ్వన్ కుమార్, దొంది రామ్, సుమన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రూఫ్‌గా పరిగణించలేదు

(మొదటి పేజీ తరువాయి)

పాస్‌పోర్ట్స్ చట్టం 1967లో ఉందని వెల్లడించింది. అలాగే పాస్‌పోర్ట్ కలిగి ఉండటం పౌరసత్వాన్ని నిర్ధరించదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పులు స్పష్టం చేశాయని తెలిపింది. ఈ మేరకు కేంద్ర సర్కార్ ప్రకటన విడుదల చేసింది. భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, దానిని పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించరాదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) సీనియర్ అధికారి స్పష్టతనిచ్చారు. పత్రాలను విస్తృతంగా ధ్రువీకరించి, పరిశీలించిన తర్వాతే పాస్‌పోర్ట్ జారీ చేస్తారని, అయితే దాని ప్రాథమిక ఉద్దేశ్యం అంతర్జాతీయ ప్రయాణాన్ని సులభతరం చేయడం, విదేశాల్లో పాస్‌పోర్ట్ హోల్డర్ జాతీయతను నిర్ధరించడమని పేర్కొన్నారు. జూన్ 24న 14వ పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా ఎంఇఎ అధికారి ఈ మేరకు మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

**మరి పౌరసత్వానికి అసలైన ప్రూఫ్ ఏది : కపిల్ సిబల్**

పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేమన్న విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటనపై ప్రతిపక్ష పార్టీల నేతలు మండి పడ్డారు. అలాంటప్పుడు ఏ పత్రం పౌరసత్వానికి రుజువుగా నిలుస్తుందో చెప్పాలని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ప్రశ్నించారు. 'భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ జూన్ 24న పాస్ పోర్ట్ ఒక ప్రయాణ పత్రం మాత్రమే, పౌరసత్వానికి ప్రూఫ్ కాదని చెబుతోంది. అలాంటప్పుడు ఏ పత్రం పౌరసత్వానికి అసలైన ప్రూఫ్? బిఎల్ఒ నా పౌరసత్వాన్ని అనుమానించవచ్చు. నా ఓటును నాకుదూరం చేయవచ్చు. ఫలితంగా ఎన్నికల్లో బిజెపి గెలుస్తుంది' అని ఎక్స్‌లో కపిల్ సిబల్ పోస్ట్ పెట్టారు. టిఎంసి నాయకురాలు మహువా మొయిత్రా ప్రభుత్వాన్ని విమర్శించారు. 'ఈ రోజుల్లో భారత పౌర సత్వానికి ఉన్న ఏకైక రుజువు హిందువుగా ఉండటం, బిజెపి ఓటరుగా ఉండటమే అనిపిస్తోంది. మరేదీ చెల్లదు' అని ఆమె ఎక్స్‌లో ఎద్దేవా చేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరణను గేయ రచయిత జావేద్ అక్తర్ ఇది 'అసంబద్ధం' అని అభివర్ణించారు.

## పది అంతస్తుల ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మహిళల పేరిటే ఇళ్ల రిజిస్ట్రేషన్ చేస్తాంఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. తొలి విడతలో ప్రయోగాత్మకంగా ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మిస్తామన్నారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 ప్రాంతాల్లో స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, ఈ నెల 28 లోగా అన్ని ప్రాంతాల్లో ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లు, నిర్మాణ నమూనాలు కూడా ఈనెల 28లోగా సిద్ధం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర వివరాలతో కూడిన బ్రోచర్‌ను వచ్చెనెల తొలి వారంలో విడుదల చేస్తామన్నారు. క్యూర్ పరిధిలోని కీలక ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, ఈ స్థలాల్లో అన్‌డివైడెడ్ షేర్ కింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. ఒకే నమూనాలో ఆర్‌డిఓ, తహసీల్దార్ కార్యాలయాలురాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే నమూనాలో ఆర్‌డిఓ, తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. జిల్లాల కలెక్టర్‌లతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆర్‌డిఓ, తహసీల్దార్ కార్యాలయ భవనాల రమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏఈలు భవనాలను పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయకుంటే మరొమారు సమ్మెకు సిద్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయకుంటే మరొమారు సమ్మెకు సిద్ధమని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్ బస్‌భవన్ వద్ద గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిజెఎంయు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారని, పోలీసులతో బెదిరింపులతో సమస్యలు పరిష్కారం కావని, ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంలో విలీనం చేసే అపాయింటెడ్ డేట్‌ను వెంటనే ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆర్‌టిసిలో యూనియన్ ఎన్నికలు జరిగితే మరొక రెండు సంవత్సరాలు ప్రభుత్వంలో విలీనం కాలయాపన అవుతుందని, అలా చేస్తే ప్రభుత్వం మాట తప్పినట్లు అవుతుందన్నారు. ఒకవేళ ముందుగా ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయకుంటే మరొకసారి విలీనం కోరుకునే యూనియన్‌లతో కలిపి సమ్మె చేస్తామని ప్రకటించారు.

## ఎస్ఐఆర్ ఫారంలో ఇతర బాషలు లేకపోతే ఎలా?

### ఇసిని ప్రశ్నించిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటరు గణన ఫారాలను తెలుగుతో పాటు ఇతర భాషల్లో ఎందుకు పంపిణీ చేయడం లేదో వివరణ ఇవ్వాలని హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. భాష కారణంగా ఎవరూ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కోల్పోరాదని స్పష్టం చేసింది. జీహెచ్‌ఎంసీ మినహా మిగిలిన తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చే ఫారం తెలుగు బాషలో మాత్రమే ఎలా ఇస్తారని ప్రశ్నించింది.కేవలం తెలుగు ఫారాలే పంపిణీ చేయడాన్ని సవాలు చేస్తూ కరీంనగర్‌కు చెందిన సోషల్ వర్కర్ ఎం.ముజీబ్ అయూబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం విచారించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ తెలుగు మాతృభాష కాని ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వలస కార్మికులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, మైనారిటీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వాదించారు. ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది పరిపాలనా సౌలభ్యం కోసం ఈ నిర్ణయం ఫారాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆన్ లైన్ లో తెలుగు, ఆంగ్లం, ఉర్దూలో ఫారాలు అందుబాటులో ఉన్నాయని, బూత్ తీసుకెళుతున్నారని వివరించారు. అయితే ఆన్ లైన్ లో ఉండడమే సరిపోదని, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఫారాల పంపిణీపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ హైకోర్టు విచారణను వారానికి వాయిదా వేసింది.

## బుకింగ్ యాప్ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతోందని మంత్రి వెల్లడించారు. గత యాసంగి సీజన్‌లో 21.81 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 97.95 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేయగా, ప్రస్తుత వానాకాలంలో ఇప్పటి వరకే 11.71 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 38.62 లక్షల బ్యాగులు బుక్ చేసుకోగా, వీటిలో ఇప్పటికే 34 లక్షల బ్యాగులను రైతులకు పంపిణీ జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 85.84 లక్షల యూరియా బ్యాగులు నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ, రైతులు ఇప్పటికే 1.91లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని తెలిపారు. గతంలో ఆధార్ ఆధారిత విక్రయాల వల్ల సబ్సిడీ యూరియా దుర్వినియోగం, బ్లాక్ మార్కెట్‌కు మళ్లింపు, ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా వంటి సమస్యలు ఉండేవని ప్రస్తుతం యూరియా పంపిణీని భూయజమానులు,సాగుదారులతో అనుసంధానం చేయడం ద్వారా నిజమైన రైతులకు ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన యూరియాను ఒకేసారి అందిస్తున్నామని, పెద్ద రైతులకు మాత్రం కేంద్ర కేటాయింపుల ప్రకారం విడతల వారీగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కౌలు రైతుల కోసం ఒటిపి విధానం, ఫోన్ బుకింగ్, వాలంటీర్ల సహాయం, మీ సేవా కేంద్రాల ద్వారా నమోదు వంటి ప్రత్యామ్నాయ సదుపాయాలు కూడా కల్పించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అభినందించిందని, ఇతర రాష్ట్రాల్లో కూడా పైలట్ ప్రాతిపదికన అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల ఎరువుల విక్రయ కేంద్రాల ద్వారా సరికాదని విమర్శించారు.రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని, అక్రమాలకు తావివ్వదని, పారదర్శకత, సమాన పంపిణీ లక్ష్యాలతో యూరియా యాప్ అమలును కొనసాగిస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ముఖ్యమైన వృద్ధి మార్కెట్లలో భారతదేశం ఒకటి అని అభివర్ణించిన ఆండీ జస్సీ మాట్లాడుతూ భారతదేశం పట్ల అమెరికాకు ఉన్న దీర్ఘకాలిక నిబద్ధతను నొక్కిచెప్పారు. ఇ-కామర్స్ దాని క్లౌడింగ్ కంప్యూటింగ్ విభాగమైన ఎడబ్ల్యుఎస్ (అమెజాన్ వెబ్ సర్వీసెస్) అంతటా బలమైన వినియోగదారుల డిమాండ్ కారణంగా భారతదేశ వ్యాపారం బలమైన వృద్ధిని చూస్తోందన్నారు. దేశంలో విస్తరిస్తున్న డిజిటల్ వినియోగదారుల సంఖ్య క్లౌడ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు ఆకర్షితులై ప్రపంచ టెక్నాలజీ సంస్థలు భారతదేశంలో పెట్టుబడులు పెడుతున్న తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ఆర్థికవ్యవస్థలలో ఒకటైన భారతదేశంలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నంలో భాగంగా అమెజాన్ గత కొంతకాలంగా లాజిస్టిక్ నెట్‌వర్క్‌లు, టెక్నాలజీ, మౌలిక సదుపాయాలు, సేలవను ఏర్పాటు చేస్తూ భారతదేశంలో భారీగా పెట్టుబడులు పెట్టింది. భారతదేశం పట్ల అమెజాన్ దీర్ఘకాలిక నిబద్ధతను ఆండీ జస్సీ పునరుద్ఘాటించారు. ముఖ్యంగా, ఇ-కామర్స్ దాని క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్ అయిన అమెజాన్ సర్వీసెస్‌లో బలమైన వినియోగదారుల డిమాండ్ కారణంగా కంపెనీ భారత వ్యాపారం బలమైన వృద్ధిలో ఉంది అని అమెజాన్ సిఇఒ ఆండీ జస్సీ చెప్పారు. ఇ-కామర్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలతో సహా అమెజాన్ అనేక వ్యాపారాలను నిర్వహిస్తున్న భారతదేశం ప్రాముఖ్యత పెరుగుతోందని ఆయన నొక్కిచెప్పారు. 'ఆండీ జెస్సీతో సమావేశం అద్భుతంగా జరిగింది. భారతదేశంలోకి రికార్డు స్థాయిలో 48బిలియన్ డాలర్ల పెట్టుబడులను నేను స్వాగతిస్తున్నాను. ఇది మన యువత కోసం సరికొత్త అవకాశాలను సృష్టిస్తుంది' అని ప్రధానమంత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఇది ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆసక్తిని కూడా ఇది ప్రతిబింబిస్తుందని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం నుంచి అమెజాన్ సిఇఒ ఆండీ జస్సీ ఒక ఫోటోను తన 'ఎక్స్'పోస్ట్‌లో షేరింగ్ చేస్తూ భారతదేశంలో అమెజాన్ భవిష్యత్ ప్రణాళికల గురించి తాను నిజంగా ఆస్వాదించానని తెలియజేశారు. 2030 నాటికి అమెజాన్ 3.8మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వాలని, 80బిలియన్ డాలర్ల ఇ-కామర్స్ ఎగుమతులను ప్రారంభించాలని, 15మిలియన్ల చిన్న వ్యాపారాలకు, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రయోజనాలను అందించాలని యోచిస్తున్నట్లు అమెజాన్ అగ్రస్థాయి అధికారి ఆండీ జస్సీ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com